1 భాగవత రత్నాలు

– బమ్మెర పోతన

కింది పద్యం, భావం చదవండి – ఆలోచించి చెప్పండి

1. పలికెడిది భాగవతమంట
పలికించు విభుండు రామభద్రుండంట నేఁ
బలికిన భవహరమగునంట
పలికెద వేఱొండుగాథఁ బలుకఁగ నేలా

నేను చెప్పబోవునది పరమపవిత్రమైన భాగవతమట, నాచే చెప్పించేవిభుడు సాక్షాత్తు ఆ శ్రీరామచంద్ర ప్రభువేనట, నేనీ భాగవతగాథను చెప్తే, సంసార బంధము నశిస్తుందట. అందుచేత నేనీ భాగవతమునే చెప్పెదను. మఱి వేఱొకగాథను చెప్పడమెందుకు?

ప్రశ్నలు

1. పై పద్యం దేని గురించి ఉంది?
2. పై పద్యం ఎవరు రాసి ఉంటారు?
3. ఆయన రచించిన గ్రంథం ఏది?
4. భాగవతంలో ఎవరి గురించి ఉంటుంది?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

బమ్మెర పోతన రాసిన ఆంధ్రమహాభాగవతంలోని తీపి పలుకులను భాషామాధుర్యాన్ని పరిచయం చేయడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

ప్రస్తుత పాఠం బమ్మెర పోతన రాసిన ఆంధ్రమహాభాగవతంలోనిది.

పాఠ్యభాగ వివరాలు

బమ్మెర పోతన భాగవతమంతా పద్య మకరంద మాధుర్య భరితమే! ప్రాచీన కాలంలో రాసిన పద్యమే అయినా తేట తెలుగు పదాలతో శబ్దాలంకార ప్రయోగంతో భాగవతం అలరారింది.

విద్యార్థులకు సూచనలు

- *పాఠాన్ని చదివి అర్థంగాని పదాల కింద గీతలు గీయండి.*
- *'పదపట్టిక' ఆధారంగా మిత్రుల సహాయంతో వీలైనన్ని అర్థాలు తెలుసుకొని రాయండి.*
- *ఉపాధ్యాయుని సహాయంతో తెలియనిపదాలకు అర్థాలు తెలుసుకోండి.*
- *పాఠ్యాంశంలోని చిత్రాల గురించి మాట్లాడండి.*

కవి పరిచయం



భక్తి రసామృతంగా భాగవతాన్ని మలచిన పోతన సహజకవిగా సుప్రసిద్ధుడు. 15వ శతాబ్దానికి చెందిన వీరు ఒక చేత హలం, మరోచేత కలం పట్టి క్షేత్రాన్ని, సాహితీక్షేత్రాన్ని సుసంపన్నం చేసిన (అక్షర) కృషీవలుడు. సాహితీ నేద్యం చేసిన కృషీవలుడు. ఆంధ్రమహాభాగవతం (12 స్కంధాలు), నారాయణాశతకం, భోగినీదండకం, వీరభద్ర విజయం వీరి రచనలు. తెలుగునుడికారం, శబ్దాలంకార ప్రయోగంలో సిద్ధహస్తులు.



I

క. చదువనివాఁడజ్ఞుండగుఁ,
జదివిన సదసద్వివేక చతురత గలుగున్
జదువఁగ వలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ! 1




క. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వఁడు ప్రాణులకును
బలమెవ్వం డట్టి విభుఁడు బలమసురేంద్రా! 2




II

క. పరహితము సేయునెవ్వఁడు
పరమహితుండగును భూతపంచకమునకున్
బరహితమె పరమ ధర్మము
పరహితునకు నెదురులేదు పర్వేందుముఖీ! 3



ఆ. బ్రతుకవచ్చుఁగాక బహు బంధనములైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక
జీవధనములైనఁ జెడుఁగాక పడుఁగాక
మాట దిరుగలేరు మానధనులు 4

III



క. క్షమగలిగిన సిరి గలుగును
క్షమగలిగిన వాణిగలుగు సౌఖ్యములెల్లన్
క్షమగలుగఁ దోన కలుగును
క్షమకలిగిన మెచ్చుశౌరి సదయుఁడు తండ్రీ! 5



క. అతిథి జనంబుల భక్తిన్
సతతముఁ బూజించి యుచితసత్కారములు
న్నతి నడుపు సజ్జనులు శా
శ్వతకీర్తులు ధరణిఁ బడయఁ జాలుదురనఘా! 6

భావాలు

1. కుమారా! చదువుకోనివాడు జ్ఞానహీనుడగును. చదువుకుంటే మంచి చెడుల వివేచన, చతురత కల్గుతుంది. కావున ప్రజలు తప్పక చదువుకోవాలి. నాయనా! నీవు శ్రేష్ఠులైన గురువుల వద్ద చదువుకొనుము.
2. దానవేంద్రా! లోకంలోని బలవంతులకు, బలహీనులకు, నాకు, బ్రహ్మాది దేవతలకు, సమస్త ప్రాణులకూ ఎవ్వడు బలమో; ఆ ఈశ్వరుడే నాకూ బలం.
3. పూర్ణేందుముఖీ! ఇతరులకు మేలు చేయువాడు. పంచభూతములకు, జీవరాశులకు పరమ హితుడవుతాడు. పరహితమే శ్రేష్ఠధర్మం. పరహితునకు ఎఎక్కడా ఎదురుండదు.
4. అనేక కష్టాలు చుట్టుముట్టినా బ్రతుకవచ్చు. సంపదలన్నీ పోయి పేదరికం వచ్చినా బ్రతుకవచ్చు. ధన నష్టమై జీవితం కష్టాల పాలయినా సరే, మానధనులు మాటను మాత్రం తప్పరు. అని శుకయోగి పరీక్షిత్తుకు తెలిపాడు.
5. క్షమాగుణమున్నవారికి సంపద లభిస్తుంది. క్షమ ఉంటేనే జ్ఞానం, సుఖాలు లభిస్తాయి. క్షమవల్లనే అన్నీ సమకూరుతాయి. క్షమ ఉంటేనే దయామయుడైన శ్రీహరి కూడా ప్రశంసిస్తాడు.
6. అతిథులను ఎల్లప్పుడూ భక్తితో పూజించి, తగురీతిన సత్కరించి గౌరవించే సజ్జనులే ఈ భూమిమీద శాశ్వత కీర్తిని పొందుతారు.

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

అ) మీకు తెలిసిన శాశ్వత కీర్తివంతుల గురించి చెప్పండి.

ఆ) పాఠంలోని పద్యాల భావాలను సొంతమాటల్లో చెప్పండి.

2. కింది గద్యాన్ని చదవండి.

మిత్రుడు చెడుపనుల నుండి దూరం చేస్తాడు. మంచి పనులను చేయడానికి ప్రోత్సహిస్తాడు. రహస్యాలను దాచిపెడతాడు. సద్గుణాలను పెంపొందిస్తాడు. ఆపదలోనున్నవారిని ఆదుకుంటాడు. ఆపదలోనున్నవారికి సహాయం చేస్తాడు. ఇలాంటి ఉత్తమ లక్షణాలు కల్గినవాడే ఉత్తమ మిత్రుడు అని భావించాలి.

పై పేరా ఆధారంగా కింద ఇచ్చిన వాక్యాల్లో సరైన వాటిని గుర్తించి " ✓ " గుర్తు పెట్టండి.

అ) ఆపదలోనున్నవారిని మిత్రుడు ఆదుకోవాలి. ( )
ఆపదలోనున్నవారిని మిత్రుడు అణగదొక్కాలి. ( )

ఆ) మిత్రుడు చెడుపనులను ప్రోత్సహిస్తాడు. ( )
మంచి పనులను ప్రోత్సహించేవాడే మిత్రుడు. ( )

ఇ) తన మిత్రులలో సద్గుణాలను పెంచుతాడు మిత్రుడు. ( )
మిత్రుడు దుర్గుణాలను పెంపొందిస్తాడు. ( )

ఈ) పై పేరా ఉత్తమమిత్రుని లక్షణాలను చెబుతుంది. ( )
ఉత్తమ మిత్రుని లక్షణాలు పై పేరాలో లేవు. ( )

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) చదువు గురించి చెప్పిన విషయాలేవి?

ఆ) పరహితము యొక్క గొప్పదనమేమి?

ఇ) క్షమ గలుగడం వల్ల ఏమేమి లభిస్తాయి?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు నాలుగేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) "జదువఁగ వలయును జనులకు" అని పద్యంలో చదివారు కదా! దీనిపై మీ అభిప్రాయమేంటి?

ఆ) పరహితునకు ఎదురులేదు అని ఎందుకు అన్నారు?

ఇ) మాట తిరుగలేని వారు ఎవరు? ఎందుకట్లా అని ఉంటారు?

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) 'క్షమ కలిగి ఉండడం అవసరం' దీన్ని సమర్థిస్తూ రాయండి.

ఆ) శాశ్వతకీర్తి గలవారని ఎవరిని అంటారు? ఎందువల్ల? కారణాలు రాయండి.

3. కింది వాటి గురించి సృజనాత్మకంగా, ప్రశంసాత్మకంగా రాయండి.

అ) పాఠంలోని మొదటిపద్యం 'చదువు' ప్రాధాన్యతను తెలిపేలా ఉందికదా! దీని ఆధారంగా ఒక కథను రాయండి.

ఆ) క్షమ అంటే సహనం. నేటి పరిస్థితుల్లో సహనం యొక్క ఆవశ్యకతను వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది ప్రకృతి, వికృతి పదాలను జతపరచండి.

అ)	ఆర్య	( )	i)	బత్తి
ఆ)	ధర్మం	( )	ii)	సిరి
ఇ)	శ్రీ	( )	iii)	అయ్య
ఈ)	భక్తి	( )	iv)	కీరితి
ఉ)	కీర్తి	( )	v)	దమ్మం

2. కింది పదాలకు అర్థాలు రాసి సొంతవాక్యాల్లో ఉపయోగించండి.

చతురత లేమి పరహితము మానధనులు

వ్యాకరణాంశాలు

1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించండి.

అ) ప్రహ్లాదుడిని గురువుల వద్ద చదువమని తండ్రి చెప్పాడు.

ఆ) అతిథులను సన్మానించాలి. వారు దైవంతో సమానం.

ఇ) పరహితం గురించి ఆలోచించు, ఆచరించు.

ఈ) ఆహా! క్షమ కలిగియుండటం ఎంత గొప్పతనం.

ఉ) మన బతుకే ముఖ్యం కాదు. పది మందికి ఉపయోగపడాలి.

2. కింది ఖాళీలను విభక్తి ప్రత్యయాలతో పూరించండి.

అ) సీత _____ రావణాసురుడు అశోకనం _____ ఉంచాడు.

ఆ) సుశీలుర _____ మాటనే ప్రాణం.

ఇ) సమయాన్ని మంచి పనుల _____ ఖర్చుపెట్టి, శాశ్వతకీర్తి _____ పొందు.

ఈ) ఆయనకు దొంగల _____ భయం కాబట్టి అర్ధరాత్రి ఒంటరిగా వెళ్ళడు.

ఉ) వినయం _____ విద్య ప్రకాశించి, సమాజము _____ నిన్ను ఉన్నతుడిని చేస్తుంది.

3. కింది వాక్యాలకు కర్తరి / కర్మణి రూపాలు రాయండి.

అ) అఫ్షా ప్రార్థన చేసింది.

ఆ) వంట నలునిచే చేయబడింది.

ఇ) వినాయక్ శిక్షణ ఇచ్చాడు.

ఈ) పాఠం సునీల్‌చే చెప్పబడింది.

ఉ) అందరూ నటించినవారే.

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- చదువు, సత్యం గొప్పదనాన్ని తెలిపే పద్యాలను సేకరించండి, సంకలనంగా తయారుచేసి ప్రదర్శించండి.

సూక్తి

సంపదలు, ప్రాణం, జీవితం, యౌవనం
యివన్నీ అస్థిరములే!
సర్వం అస్థిరమైన ఈలోకంలో
ధర్మమొక్కటే స్థిరమైనది.

2 మొద్దబ్బాయిలూ మహా మేధావులే.....

– తిరుమల రామచంద్ర

చదవండి – ఆలోచించండి – చెప్పండి

నాలుగు లేక అయిదు సంవత్సరాలక్రితం తోటి అనుచరుల పట్టుదలవల్ల నేను ఆత్మకథ వ్రాయుటకు అంగీకరించాను. వ్రాయటం ఆరంభించి ఒక పేజీ పూర్తిచేశానో లేదో ఇంతలో బొంబాయిలో రగడ ప్రారంభమైంది. దాంతో నా ఆత్మకత ఆశపోయింది. నేను ఆత్మకథను త్వరగారాసి గ్రంథరూపంలో ప్రచురించాలని స్వామీ ఆనంద్ కోరిక. నేను ఆత్మ చరిత్ర వ్రాయాలని అనుకోలేదు. నేను అనేక సమయాల్లో సత్యప్రయోగాలు చేశాను. నాజీవితం అట్టి ప్రయోగాలతో నిండి ఉంది. ఈ ప్రయోగాలవల్లనే నాకు 'మహాత్మ' అను బిరుదువచ్చింది. నాదృష్టిలో ఆ బిరుదుకుగల విలువ స్వల్పమే. సత్యపు ప్రమాణాలను వివరించడమే నాలక్ష్యం.

– మహాత్ముడు

ప్రశ్నలు

1. పై పేరాను ఎవరు రాసి ఉంటారు?
2. 'ఆత్మకథ' అంటే ఏమిటి?
3. దీన్ని ఎందుకు రాస్తారు?
4. ఎవరెవరు ఆత్మకథలు రాసారో మీకు తెలుసా?
5. గొప్ప వాళ్ళ ఆత్మకథలను మనం ఎందుకు చదవాలి?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

డా॥ తిరుమల రామచంద్రగారు తన జీవిత విశేషాలను "హంపీ నుండి హరప్పాదాక" అనే గ్రంథం ద్వారా వివరించారు. ఇది ఆయన ఆత్మకథ. తన బాల్యం నుండి జీవితంలో చోటుచేసుకొన్న విశేషాలను, జీవితానుభవాలను గ్రంథస్థం చేశారు. తన బాల్యంలోని మిత్రుల గురించి, వారు ఎలా ఉన్నతస్థాయికి చేరుకొన్నారో ఆయా అనుభవాలను వివరించే భాగమే ప్రస్తుత పాఠ్యాంశం. మొద్దబ్బాయిలుగా పిలువబడుతున్న తన తోటివారు మహామేధావులుగా ఎలా ఎదిగారో ఆసక్తికరంగా వివరించారు.

పాఠ్యభాగ వివరాలు

ఎవరైనా తమ జీవితానుభవాలను, విశేషాలను గ్రంథస్థంచేస్తే దాన్ని 'ఆత్మకథ' అంటారు. దీనినే స్వీయచరిత్ర అని పిలుస్తారు. ఆత్మకథల ద్వారా వారి వ్యక్తిత్వాలేకాక సమకాలీన సంఘటనలు కూడా తెలుస్తాయి.

ప్రస్తుత పాఠం తిరుమల రామంచంద్రగారు రచించిన 'హంపీ నుండి హరప్పా దాక' అనే గ్రంథంలోనిది.

విద్యార్థులకు సూచనలు

- *పాఠం చిత్రం ఆధారంగా పాఠంలోని విషయాన్ని ఊహించండి.*
- *పాఠం చదవండి. అర్థంకాని పదాలను గుర్తించండి.*
- *వాటి అర్థాలను 'పదాలు – అర్థాలు' పట్టిక లేదా నిఘంటువు చూసి రాయండి.*

కవి పరిచయం

శ్రీ తిరుమల రామచంద్రగారు 1913 జూన్ 17న అనంతపురం జిల్లాలోని రాఘవం పల్లెలో జన్మించారు. శ్రీమతి జానకమ్మ, శ్రీ శేషాచార్యులు ఈయన తల్లిదండ్రులు. ప్రాథమిక విద్య కాకినాడలోను, నెల్లూరు, తిరుపతి, మద్రాసులలో ఉన్నత విద్య సాగింది. రచయితగా, విమర్శకునిగా, భాషావేత్తగా, పరిశోధకునిగా, పత్రికా రచయితగా పేరొందిన వీరు జాతీయోద్యమంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారు.

'హంపీ నుండి హరప్పా దాకా' అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు; 'గాథాసప్తశతిలో తెలుగు పదాలు' అనే గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

'మహా మహోపాధ్యాయ', 'పత్రికారశిరోమణి' వంటి బిరుదులు పొందారు. తెలుగు విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు మరియు డా॥ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుండి 'డాక్టరేట్'ను పొందారు. ఏకతా అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు.

'మన లిపి పుట్టు పూర్వోత్తరాలు', 'హిందువుల పండుగలు – పర్వాలు', 'హాలుని గాథలు', 'బృహదారణ్యకం', 'మనవి మాటలు', 'బుద్ధుణ్ణి బళ్ళోవేశారు', 'నుడి–నానుడి' వంటి ఎన్నో రచనలు చేసారు. 'లలిత విస్తరం', 'అవధాన కల్పలత' వంటి అనువాదాలు చేశారు. ఎందరి పుస్తకాలకో పీఠికలు రాశారు. సహస్రాధికంగా సమీక్షలు వివిధ పత్రికలలో ముద్రితమయ్యాయి. విశేష సాహిత్య కృషి చేసిన ఈయన 1997 అక్టోబర్ 12న పరమపదించారు.

I

దేశకాలాలు మారినా, ఆపదలు విరుచుకొని మీద పడినా, గోడ మీద గీచిన బొమ్మలాగ పెడమొగం పెట్టనివాణ్ణి స్నేహితుణ్ణిగా చేసుకోవాలి – అంటాడొక ప్రాకృతకవి.

అదనులో విత్తిన విత్తనంలాగ మంచి సమయంలో ఆడిన మంచిమాట ఎంత మంచిని పెంచుతుందో ఇతరుల అనుభవంతోనేకాక, నా అనుభవంతోను గ్రహించాను.

మా కళాశాలలో ముగ్గురు మహామూధులు ఉండేవారు. వాళ్లు ఒక్కొక్క తరగతిలో రెండు మూడు సంవత్సరాలు ఉంటూ దేకుతూ వెళ్లేవాళ్లు. వారికి మట్టిబసవడు, రాతి బసవడు, చెక్క బసవడు అని పేరు పెట్టారు తద్జ్ఞులు. మట్టిబసవడు ఎన్నో దండయాత్రలు చేసి చివరకు వ్యాకరణశిరోమణి పట్టాపుచ్చుకొని దేశం మీద పడ్డాడు ఉద్యోగం కోసం. రాతి బసవడు నా సహాధ్యాయుడయ్యాడు.

పాపం అతని తప్పేమీలేదు. రాత్రంతా చదివేవాడు. తెల్లవారి స్నానంతోపాటు చదువంతా నీరుగారిపోయేది. ఆరోగ్యంతో అందంగా ఉండేవాడు. పరీక్షలలో మార్కులు ఒక్క అంకెను దాటేవి కావు. ఎందుకితడు ఇంత మొద్దు – అని అనుకునే వాడిని. ఇతరులు హాస్యం చేసినా నేను ఏమీ అనేవాడిని కాదు. అతణ్ణి సానుభూతితో చూసేవాడిని. అతని లోపం ఏమీలేదు. దుర్విధి, దుర్విలాసం.


ఆరు నెలల పరీక్షలు జరిగాయి. అతని మార్కులు దేనిలోను 10, 12ను దాటలేదు. చాల చింతాక్రాంతుడై నా వద్దకు వచ్చాడు. నా స్వభావంలో ఒక మంచి ఉంది. ఎవరేమి చెప్పినా శ్రద్ధగా వింటాను. సాధ్యమయితే ఒక మంచి మాట, కాకపోతే మౌనం. ఇది మా నాన్నగారి గుణం, వారసత్వం. నాతో తన బాధ చెప్పుకొని ఏడ్చాడు. నా మనస్సు కరిగింది. చెప్పాను. "చూడు రామన్నా! (పేరు రామాచార్లు) సంస్కృతం చదివావు? సంస్కృతం ముక్కలు నోట కరచిన మాత్రాన మేధావివా? నీకు ఇది రాలేదు. మరొకటి ప్రయత్నం చేయి. నేను నా అమ్మా, తాతల బలవంతాన చదువుతున్నాను. గాని... నీవు ప్రైవేటుగా మూడవ ఫారం ప్యాసుకా, టీచర్స్ ట్రైనింగ్‌చేయి, బడిపంతులు ఉద్యోగం దొరుకుతుంది. హాయిగా జీవితం గడుపు. బతుకు ముఖ్యం. సంస్కృతం కాదు. తర్వాత ఇష్టం ఉంటే చదువుకో" అని సలహా ఇచ్చాను.

నా మాట అతనికి సూటిగా తాకింది. మరుసటి దినం నా వద్దకు వచ్చాడు. "రాముడూ, ఒక రహస్యం. నేను వెళ్ళిపోతున్నాను. ఎవరికీ చెప్పక, ఎలాగయినా థర్డ్‌ఫారమన్నా పాసవుతాను. సవ్యంగా అంతా జరిగితే నీకు వ్రాస్తాను" అన్నాడు. నేను, అతను తన విషయం చెప్పేవరకు రహస్యం దాచుతానని మాట ఇచ్చాను.

అతను వెళ్ళిపోయాడు. నేను ఇంటిల్లిపాదికీ సన్నిహితుడిని. అతని అక్కగారు నర్సమ్మక్క భర్తకు జాబులు వ్రాయడానికి మంచి భాషకు నేనుండాలి. "రాముడూ బావగారిని రమ్మని రాయరా. చాల బాధపడుతున్నానని వ్రాయరా" అనేది. నేను వ్రాసేవాడిని. భర్త తాసీల్దారు. ఎక్కడ వస్తాడు త్వరగా? వాళ్ళంతా అడిగారు. తమ కుమారుని ఆచూకీ తెలుపమని. నాకేం తెలుసు?

మా పెద్దమ్మాయి 1954లో పుట్టింది. బారసాలకు అత్తవారి ఊరు వెళ్ళాను. మద్రాసు బొంబాయి రైలు మార్గంలో రాయచూరు తర్వాత యాద్‌గిరి స్టేషనులో దిగి బస్సులో ముప్పైమైళ్ళు పయనిస్తే సురపురం – అత్తవారి ఊరు. యాద్‌గిరి స్టేషనులో దిగాను. తెల్లవారుజాము. టికెట్ టికెట్ అంటూ స్టేషను మాస్టర్ దగ్గరికి వచ్చాడు. గొంతు ఎక్కడో విన్నట్టుందే అనుకొని "తమ గొంతు ఎక్కడో విన్నాను" అన్నాను. "మొదట టిక్కెట్ ఇవ్వండి. బండి వెళ్ళిన తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు అతను. నేను అక్కడి నిలబడి ఆలోచిస్తున్నాను టికెట్ అందజేసి.

II



గొంతు పోల్చుకున్నాను. ఒరె ఒరె ఒరె! రాతి బసవన్న కదూ! అనుకున్నాను. "ఇప్పుడు చెప్పండి" అంటూ వచ్చాడు. ఇరవై ఏడేళ్ళకాలం... దాదాపు ఒక తరం గడిచింది. ఆజానుబాహువుగా పెరిగాడు. మీరు నా సహాధ్యాయుడు రామాచార్ల... గొంతు... అంటూ నీళ్ళు నమిలాను. చేతిలో ఉన్న లైటు కిందపడేసి "ఒరే ఒరె! రాముడు కదూ! నిన్ను తలచుకోని గడియలేదనుకో" అంటూ నన్ను పైకెత్తి కావలించుకున్నాడు. "ఇక్కడ నేను స్టేషను మాస్టరును. అసిస్టెంట్ సెలవు మీద ఉన్నాడు. డ్యూటీకి రావలసివచ్చింది. క్వార్టర్సుకు వెళ్ళదాం. నీవు దారి చూపిన కథ చాల ఉంది. సురపురానికి బస్సా? గంటకు ఒకటి. బారసాల ముహూర్తం దాటకుండా పంపే ఏర్పాటు చేస్తా" అంటూ పోర్టర్‌ను పిలిచి నా చేతి సంచీ అతని చేతికిచ్చి, "అమ్మగారికి చెప్పు, తెల్లవారుతోంది. అయ్యగారి ఫ్రెండ్ వచ్చారట. కాఫీ, టిఫిన్ రెడీగా ఉండాలట–" అని హుకుములపై హుకుములు ఇస్తూ పోయాడు. అతని ఆనందం, సంరంభం చూడముచ్చటగా ఉన్నాయి.

క్వార్టర్స్ చేరి ఏకంగా స్నానాదులు ముగించుకొని ఫలహారం ముందు పెట్టుకొని కూచున్నాము. కథ చెప్పాడు.

టికెట్ లేకుండా బండి ఎక్కాడు కట్టుగుడ్డలతో, ధర్మవరం జంక్షన్‌లో దింపేశారు. ఊళ్ళోకి వెళ్ళాడు. ఒక ఉపాధ్యాయుని ఇంటికి వెళ్ళాడు. తన సంగతి చెప్పాడు. ధర్మవరంలో నీటికి కటకట ఆ కాలంలో చెరువుకు మైలు దూరం. "అబ్బాయ్! నేను నీకు ఒక వారం ఇస్తాను. తక్కిన ఆరువారాల భోజనం ఏర్పాటుకు ప్రయత్నిద్దాం. నాకు చెరువు నుంచి పూటకొక బిందె మంచి నీళ్ళు తెచ్చిపెట్టాలి. అరుగుమీద గదిలో పడుకోవచ్చు" అన్నాడు ఆ ఉపాధ్యాయుడు. ఒప్పుకున్నాడు ఇతడు.

వారాలు దొరికాయి. బుద్ధి వికసించింది. సంస్కృతం పాఠాలు వల్లెవేసిన పద్ధతి అంతా కంఠపాఠం. ఆరు నెలల శిక్షణతో థర్డ్‌ఫారంలో చేర్పించాడు ఆయన. బుద్ధి చురుకుదేరింది. శంకరనారాయణ డిక్షనరీ, నెస్‌ఫీల్డ్ గ్రామర్ కంఠపాఠం, స్కూల్లో అతనికి శంకరనారాయణ ముద్దుపేరు. ఆరోఫారానికి వచ్చాడు. అంతవరకు అజ్ఞాతవాసమే.

అప్పుడు దిగాడు ఒక ఎం.ఎస్.ఎమ్.రైల్వే అధికారి. శ్రీవైష్ణవుడు, అల్లుళ్ల వేట కోసం, ఉపాధ్యాయులందరూ ఇతనిని సిఫార్సు చేశారు. అయితే ఒక షరతు. రైల్వేలో ఉద్యోగం ఇప్పించిన తర్వాతే వివాహం. ఇది హెడ్‌మాస్టారు విధించిన షరతు. ఆరవ ఫారం ప్యాసయ్యాడు. రైల్వే గుమాస్తా ఉద్యోగం దొరికింది. ఎంత అదృష్టం అన్నారు. స్కూలు సిబ్బంది తల్లిదండ్రులను పిలిపించి నిశ్చితార్థం, వివాహం జరిపించారు. అతడు రైల్వే అత్యవసర పరీక్షలు ప్యాసయి స్టేషన్ మాస్టరయ్యాడు.

ప్రస్తుతం షోలాపూర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పదవికి సెలెక్టయ్యాడు. ఇంకా పదహైదు సంవత్సరాల సర్వీసులో రెండు మూడు పై పదవులు లభించవచ్చు.

"ఒరేయ్! నీవు సకాలంలో మంచి సలహా ఇచ్చావురా, సంస్కృతం వల్లింపు ఇంగ్లీషుకు తగిలించాను. సంస్కృతం రానందిగాని, ఇంగ్లీషు రాక ఛస్తుందా?" అని నవ్వాడు. "మీ గొప్పతనం కాదండీ, మంచి నీళ్ల బిందెలు మోసిన మహాత్యం! మెడ, మెదడులోని కండరాలు, కణాలు కదిలి తెలివి బయటపడింది" అన్నది భార్య. ఆమె మెట్రిక్ ప్యాసయింది. అందరం విరగబడి నవ్వాము.

"అంతా నీ అదృష్టం, స్వయంకృషి, నా సలహా లేకపోయినా నీవు పాఠశాల వదిలే వాడివే. కాలం, తోసుకుపోతుంది" అన్నాను. "అది కాదు అన్నగారూ, మీ మంచి మాట అమృత గుళికలాగ పనిచేసింది కదా!" అన్నది అతని భార్య.

III

మరొక తుమ్మమొద్దు. ఏ.వి.సుబ్రహ్మణ్యం. రాయవెల్లూరు వాడు. తెలుగు కూడవచ్చు. ఆజానుబాహుడు. నాకన్నా రెండు మూడేళ్ళు పెద్దవాడు. రాతిబసవన్నకన్నా నల్లరాయి. ధూమశకట ముద్దిశ్య లేఖో లిఖ్యతామ్ – రైలును గురించి వ్యాసం వ్రాయండి – అని ప్రశ్న ఇచ్చారు. నేను సంస్కృత వ్యాసరచనలో కాలేజీకే మొనగాడినని పేరు, అప్పటికే సాక్షి, వదరు బోతు, ఇతర వ్యాసాలు చదివి విషయం సేకరించి దాదాపు వంద వ్యాసాలు మంచి శైలిలో వ్రాశాను. మూడు పుటలు వ్రాయడమంటేనే తలప్రాణం తోకకు వచ్చేది. సుబ్రహ్మణ్యం పత్తు పక్కం – పదిపుటలు వ్రాశానన్నాడు. నాకు ఆశ్చర్యమయింది. "ధూమశకటం గిడ్ గిడ్ ఇతి గచ్ఛతి" అని వ్రాశాడు. గిడ్ గిడ్ పది పుటలు. మొదటిది, చివరిది మాత్రం పదాలు. ఉపాధ్యాయులు క్లాసులో నిలబెట్టి తిట్టారు. సిగ్గులేదా? గాడిదలాగా పెరిగావు. రాకపోతే ఊరికే ఉండు. అంతేకాని గిడ్‌గిడ్ అని పది పుటలు పాడుచేస్తావా? ఇలా అరగంట వషట్కారాలు.

సాయంత్రం ఏకాంతంగా నా సలహా అడిగాడు "నీకు కాశీ విశ్వవిద్యాలయంలో మహామహోపాధ్యాయ చిన్నస్వామి శాస్త్రిగారు బంధువన్నావు గదా! పోయి ఆయన కాళ్ళమీద పడు, గంగాజలాలు నీ అవివేకాన్ని పోగొడుతాయి. విశ్వేశ్వరుడు కరుణిస్తాడు" అన్నాను. స్వయంగా కొని తెచ్చుకున్న అవమానం మరి. ఉండలేకపోయాడు. మరుసటిదినం నుంచి కనిపించలేదు.

రెండు దశాబ్దాల పైచిలుకే గడిచింది. నేను నా మిత్రులు వడ్లమూడి సత్యనారాయణ గారు, ఆయన కుమార్తె సంబంధం కోసం గుంతకల్లు దగ్గరి ఉరవకొండకు బయలుదేరాము. మద్రాసు – బొంబాయి మెయిలు ఎక్కాము. అంతకుముందే బండి ఎక్కి సామాను సర్దుకుంటున్న ఒక వ్యక్తి మాటలు వినిపిస్తున్నాయి. వేషం పండిత వేషం. "మాకీ కాశీకి పోవాల ఉంది. బొంబాయి నుండి వేరే గాడీ పట్టుకుంటాం. మాదీ ఇక్కడే వేలూరు. మగర్ (కాని) చాలాకాలం కాశీలో ఉన్నాం. తెలుగులో గల్తీలు ఉంటయ్..." అని మాట్లాడేస్తున్నాడు. బండి కదిలింది. అతడు సామాను సర్ది ఇటు తిరిగాడు.

"మీరు సుబ్రహ్మణ్యం కదూ?" అన్నాను మనిషిని చూడగానే. "అడడా! రామచెంద్రా ఎంగె వందే. ఎంగె పోరే?" (ఎక్కడికి వచ్చావ్? ఎక్కడికి వెళ్తున్నావ్?) అన్నాడు. నాకు మాట్లాడే అవకాశమే ఇవ్వకుండా కలగాపులగపు తెలుగులో "నేనిప్పుడు పాత గిడ్‌గిడ్ ఇతి గచ్ఛతి సుబ్రహ్మణ్యం కాదు, బెనారెస్ విశ్వవిద్యాలయంలో సంస్కృత రీడర్‌ను తెలుసా? మీమాంసావ్యాకరణ, తర్కవేదాంత శాస్త్రాల్లో ఆచార్య పరీక్షలలో ప్రథమున్ని సుమా! నాలుగైదు శాస్త్రవ్యాఖ్యాన గ్రంథాలు వ్రాశాను. అదృష్టముంటే ప్రొఫెసర్ అవుతాను" అంటున్నాడు.



నేను మధ్యన అడ్డుకొని "సుబ్రహ్మణ్యం! అంతా గంగాజల ప్రభావం" అన్నాను.

"నిజమే సుమా" – అంటూ తన కథ చెప్పాడు. ఊరికే పోతే తిడతారని బండెక్కాడట. పది రూపాయలకన్న ఎక్కువ డబ్బు లేదు. జాలార్‌పేటలో దిగాడు. అక్కడి నుంచి కాశీకి పోయే ఒక వృద్ధదంపతుల పరిచయమయింది. సుబ్రహ్మణ్యం బ్రాహ్మణవటువు కదా! స్వచ్ఛంగా ఉన్నాడు. వృద్ధురాలు అడిగింది. "నాయనా ఎక్కడికి వెళ్ళుతున్నావు?" అని. "కాశీకి వెళ్ళుదామనుకుంటున్నాను" అన్నాడు ఇతడు. "అయితే మాకు సహాయకుడుగా ఉండు, రైలు ఛార్జీలు మేము పెడతాము. యాత్ర పుణ్యం దక్కుతుంది" అంటూ, "కాశీలో ఏం పని?" అని అడిగింది ముసలమ్మ. "సంస్కృతం చదవడానికి, చిన్నస్వామి శాస్త్రిగారి సన్నిధికి" అన్నాడు ఇతడు. వృద్ధుడు శాస్త్రిగారి పేరు విన్నాడు గనుక సుబ్రహ్మణ్యాన్ని విశ్వసించాడు. అదృష్టం తోసుకొని వచ్చింది. కాశీ చేరిన పిదప వాళ్ళ అవసరం తీరే వరకు వెంట ఉండి, చిన్నస్వామి శాస్త్రిగారి ఇంటికి వెళ్ళి ఆయనకు సాగిలపడి ప్రవర చెప్పుకున్నాడు సంప్రదాయానుసారం. అప్పుడు చలికాలం ప్రారంభం. "దినమూ తెల్లవారుజామున గంగాస్నానం చేసిరా. మా ఇంట్లో మా పిల్లలతోపాటు ఉండు. ఇది నీకు నెల రోజుల పరీక్ష. నీవు నెగ్గినట్టు నాకు విశ్వాసం కలిగితే చదువు చెప్పడం తర్వాత" అన్నారు శాస్త్రిగారు. సుబ్రహ్మణ్యం ఆ పరీక్షలో నెగ్గాడనీ, విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే సంస్కృత కళాశాలలో చేరి మహా విద్వాంసుడయ్యాడని చెప్పనక్కరలేదు. అక్కడే అధ్యాపకోద్యోగమూ ఇప్పించారు గురువుగారు.

అంతటి చింత మొద్దులూ, తుమ్మ మొద్దులూ మంచి దారుశిల్పి చేతిలో పడి దేవతా మూర్తులయిన కథ ఇది.

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది ప్రశ్నలకు ఆలోచించి సొంతమాటల్లో సమాధానాలు చెప్పండి.

అ) "మొద్దబ్బాయిలూ మహామేధావులే" అని పాఠం పేరు విన్నప్పుడు మీలో కల్గిన అనుభూతులను తెల్పండి.

ఆ) "మొద్దబ్బాయిలు" అనేవారు ఎవరూ ఉండరు. ఎవరికైనా తగిన అవకాశాలు కల్పిస్తే, ప్రోత్సహిస్తే, సాధనద్వారా గొప్పవాళ్ళుగా మారుతారు" ఈ విషయం గురించి మీ అభిప్రాయాలు చెప్పండి.

2. పాఠం చదవండి. పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.

క్ర.సం.	విషయం	ఆ విషయం ఉన్న పేరా సంఖ్య / పంక్తి సంఖ్య
1.	రాతిబసవని వివరాలు	
2.	రాతిబసవడు కల్సినవారి వివరాలు తెలిపే పేరా	
3.	పాఠంలో హాస్య సంఘటన వివరించే పేరా	

3. కింది వాక్యాలను ఎవరు ఎవరితో అన్నారో పాఠం ఆధారంగా రాయండి.

అ) "బతుకు ముఖ్యం. సంస్కృతం కాదు, తర్వాత ఇష్టం ఉంటే చదువుకో."

ఆ) "రాముడూ బావగారిని రమ్మని రాయరా."

ఇ) "మొదట టిక్కెట్ ఇవ్వండి. బండి వెళ్ళిన తర్వాత మాట్లాడుకుందాం."

ఈ) "రాకపోతే ఊరికే ఉండు. అంతేకాని గిడ్‌గిడ్ అని పదిపుటలు పాడుచేస్తావా?"

4. గాంధీ బోధనల్లోని కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

నేను నాలో ఉన్నట్లు చెప్పుకునే ఏకైక సుగుణం సత్యం, అహింస. మానవాతీత శక్తులున్నట్లు నేను చెప్పుకోజాలను. అటువంటి వాటిని నేను కోరుకోను. సిసలైన మతం సంకుచితమైన పిడివాదం కాదు. అది భగవంతునిలో విశ్వాసముంచుట, భగవంతుని సన్నిధిలో జీవించుట. అనగా భావిజీవితంలో, సత్యంలో, అహింసలో విశ్వాసం కలిగి ఉండుట అని అర్థం. ఆత్మగతమైన ఈ విషయాలపట్ల నేడు ఒకరకమైన నిర్లక్ష్య భావన నెలకొని ఉంది. ఆలోచనలో సత్యం, వాక్కులో సత్యం, కార్యచరణలో సత్యం ఉండాలి. సత్యం లేనిచోట సిసలైన జ్ఞానం ఉండదు.

అ) గాంధీ తనలో ఏయే సుగుణాలు ఉన్నాయని చెప్పాడు?

ఆ) గాంధీజీ సత్యం గురించి ఏమన్నాడు?

ఇ) సిసలైన మతం ఎలా ఉంటుంది?

ఈ) పై పేరాలో గాంధీ చెప్పిన మూడు ముఖ్య విషయాలేవి?

5. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) రామచంద్ర తన మిత్రుడు రామాచార్లకు ఏమని సలహాఇచ్చాడు?

ఆ) రాతిబసవడు అసలు పేరేమిటి? ఆయన విద్యాభ్యాసం ఎలా జరిగింది?

ఇ) సుబ్రహ్మణ్యం మహావిద్వాంసుడు ఎలా అయ్యాడు?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) సంస్కృతంలో వ్యాసం రాయమంటే 'గిడ్‌గిడ్' అని పది పుటలు రాసిన సుబ్రమణ్యం మహావిద్వాంసుడు ఎలా అయ్యాడు?

ఆ) "అవసరమైనప్పుడు చెప్పే మంచి మాట ఎంతో మంచి చేస్తుంది" పాఠం ఆధారంగా దీన్ని మీరు ఎలా సమర్థిస్తారు?

ఇ) "నా స్వభావంలో మంచి ఉంది. ఎవరేమి చెప్పినా శ్రద్ధగా వింటాను" అని తిరుమల రామచంద్రగారు చెప్పారుకదా! దీనివల్ల కలిగే మేలు ఏమిటి?

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) ఈ పాఠం ఆధారంగా తిరుమల రామచంద్ర గారి గురించి మీరేమి తెల్సుకున్నారు?

ఆ) రాతిబసవడు (రామాచార్లు), చెక్కబసవడు సుబ్రమణ్యం జీవితాలు మారిపోవడానికి కారణాలు ఏమిటి? వారి నుండి విద్యార్థులు గ్రహించాల్సిన విషయాలు ఏవి?

3. కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా జవాబులు రాయండి.

మీ తరగతిలో చదువులో వెనుకబడినవారిని నిరుత్సాహపడకూడదని ప్రోత్సహిస్తూ మిత్రునికి ఒక లేఖ రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది పదాలు చదవండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.

చింతాకాంతుడు　　ఇంటిల్లిపాది　　ఆచూకి　　అజ్ఞాతవాసం

2. పాఠం ఆధారంగా కింది ఖాళీలలో సరైన పదాలు రాయండి.

అ) కళాశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులు _____ పుచ్చుకొని ఉద్యోగాన్వేషణకు వెళ్ళారు.

ఆ) అతివృష్టితో ఆస్తిపాస్తులు కోల్పోయిన వారి పట్ల _____ చూసి సహాయంచేయాలి.

ఇ) క్రమశిక్షణారాహిత్యంతో ప్రవర్తించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుని మాటలు _____.

ఈ) దొంగల _____ కోసం పోలీసులు కుక్కల సహాయంతో గాలించారు.

ఉ) విద్యావంతులు ఇతరులపై ఆధారపడకుండా _____ తో ఎదిగే ప్రయత్నం చేయాలి.

వ్యాకరణాంశాలు

1. కింది ఖాళీలను పూరించండి.

	సంధిపదం	విసంధి	సంధిపేరు
అ)	చేరినట్లు	_____ + _____	_____
ఆ)	_____	క్లేశాలు + అన్నీ	_____
ఇ)	_____	సుయోధన + ఆది	_____
ఈ)	వారెవరు	_____ + _____	_____
ఉ)	చెప్పవలసినదేమి	_____ + _____	_____
ఊ)	కలిగినప్పుడు	_____ + _____	_____
ఋ)	కృష్ణార్జునులు	_____ + _____	_____
ౠ)	_____	చెప్పను + అవసరంలేదు	_____

2. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసం పేరు తెలపండి.

	సమాసపదం	విగ్రహవాక్యం	సమాసం పేరు
అ)	యోగక్షేమాలు	i)	క)
ఆ)	పంచపాండవులు	ii)	ఖ)
ఇ)	ఆకలిదప్పులు	iii)	గ)
ఈ)	నూర్గురు కుమారులు	iv)	ఘ)
ఉ)	రాగద్వేషాలు	v)	ఙ)

3. కింది పదాలను పరిశీలించండి.

ఆ + చోట – ఆ + చ్చోట – అచ్చోట

ఈ + మనుజులు – ఈ + మ్మనుజులు – ఇమ్మనుజులు

ఏ + విధం – ఏ + వ్విధం – ఎవ్విధం

సంధి పదం ఏ విధంగా రూపొందిందో పరిశీలించారు కదా! ఇందులో మూడు విధానాలున్నాయి. గమనించండి.

i) ఆ, ఈ, ఏ లు అనే మూడింటితో పూర్వ పదముంది. ఆ, ఈ, ఏ లను 'త్రికములు' అని అంటారు.

ii) త్రికముతో సంధి విడదీసినప్పుడు పరపదంలోని తొలి అక్షరం ద్విత్వాక్షరంగా మారుతుంది.

ఏ + విధం – ఏ + వ్విధం

iii) ద్విత్వాక్షరంపైన ఉన్న అంటే పూర్వపదంలోని దీర్ఘాక్షరం హ్రస్వాక్షరంగా మారుతుంది.

ఏ + వ్విధం – ఎవ్విధం

పై మూడు వివరణలను సూత్రరూపంలో కింది విధంగా చెప్పవచ్చు

i) ఆ, ఈ, ఏ లు త్రికములు.

ii) త్రికము మీది అసంయుక్తాక్షర హల్లు ద్విత్వమవుతుంది.

iii) ద్విత్వము మీది త్రికము హ్రస్వమౌతుంది.

ఇలా త్రికముల (ఆ, ఈ, ఏ)లతో సంధికార్యం ఉంటుంది కాబట్టి అచ్చోట, ఇమ్మనుజులు, ఎవ్విధం లాంటి పదాలు 'త్రికసంధికి చెందినవిగా గుర్తించాలి.

♦ **కింది పదాలలో త్రికసంధికి చెందిన పదాలను గుర్తించండి. వాటిని విడదీయండి.**

రామాజ్ఞ, అత్తఱి, మీరేమి, ఇబ్భంగి, ఎవ్వారు, మేమంతా, ఇమ్మారు.

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ చిన్నప్పుడు సరిగా చదవకపోయినా, తరువాత కష్టపడి పైకివచ్చిన ప్రముఖుల వివరాలు సేకరించండి. వారి జీవితాల నుండి గ్రహించాల్సిన విషయాల గురించి నివేదికరాసి ప్రదర్శించండి.

సూక్తి

పరిశ్రమ, తెగువ, ధైర్యం, బుద్ధి, బలం,
పరాక్రమం – ఈ ఆరూ ఉన్నచోట
దైవం తోడ్పడుతుంది.

3 నవోదయం

– పల్లా దుర్గయ్య

చదవండి – ఆలోచించండి – చెప్పండి

కోడి కూత కూసింది
చీకటి పరుగెత్తింది
తొలిపొద్దు పొడిచింది
జగమంతా లేచింది
చైతన్యం పొడసూపింది
వేకువతో లోకమంత వెలిగింది

ప్రశ్నలు

1. పై కవిత దేని గురించి తెలుపుతున్నది?
2. తొలిపొద్దు అంటే మీకేమర్థమైంది?
3. 'చైతన్యం' ఎప్పుడు పొడసూపుతుంది?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

వెలుగనేది చీకటిని చీల్చి సకల ప్రాణులను నిద్రలేపుతుంది. ప్రతి మనిషి జీవితంలో కష్టాలు తొలగి ఏదో ఒక సమయాన వెలుగు రేఖలు ప్రసరిస్తాయి. అలాంటి వెలుగురేఖలనందించే ఉదయాన్ని గురించి తెల్పడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యభాగం పల్లా దుర్గయ్య గారి 'పాలవెల్లి' అనే గ్రంథం లోనిది.

ఈ పాఠం వచన కవితా ప్రక్రియకు చెందింది. మాత్రాగణ, ఛందోనియమాలు లేకుండా రచించే శక్తివంతమైన వాక్యాల కూర్పే వచన కవిత. ఆంగ్లంలో దీనిని 'ఫ్రీవర్స్' అంటున్నాం.

విద్యార్థులకు సూచనలు

- *పాఠం చదివి అర్థం తెలియని పదాల కింద గీతలు గీయండి.*
- *తెలియని పదాలకు అర్థాలను పాఠ్యపుస్తకం చివర ఉన్న పదపట్టిక లేదా నిఘంటువు ద్వారా తెలుసుకుని రాయండి.*
- *పాఠంలో మీకర్థంగాని విషయాల గురించి మీ ఉపాధ్యాయునితో చర్చించండి.*

కవి పరిచయం


డా॥ పల్లా దుర్గయ్య

జననం : 1916 (24.05.1916) మరణం : 19.12.1983

జన్మస్థలం : మడికొండ (వరంగల్ జిల్లా)

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1942లో ప్రప్రథమంగా తెలుగులో ఎం.ఏ పట్టా పొందిన వీరు సంస్కృతాంగ్లాంధ్రభాషావేత్త, జ్యోతిశ్శాస్త్రవిశారదులు. సంప్రదాయసిద్ధమైన పాండిత్యము, చక్కని ప్రతిభ వీరి కవితావ్యాసంగానికి దోహదపడ్డాయి. భావగాంభీర్యం, అనర్గళధార, నర్మహాస్యం, తెలుగునుడికారం, వీరి కవిత్వమంతా కన్పిస్తుంటాయి. 'ప్రబంధవాఙ్మయ వికాసము' వీరి సిద్ధాంత గ్రంథము. ఉస్మానియా విశ్వవిద్యాలయములో అధ్యాపకులుగా పనిచేసి, నిజాం కళాశాలనుండి ఆచార్యులుగా, 1976లో ఉద్యోగ విరమణ చేశారు.

గంగిరెద్దు (కావ్యం), ప్రబంధవాఙ్మయ వికాసం, (సిద్ధాంత వ్యాసం), చతురవచోనిధి (విమర్శ), అల్లసానిపెద్దన(విమర్శ) పెద్దన కవితావైభవం, వీరి ఇతర రచనలు.



I

1. తెలుగు వాకిళ్ళలో
తొలికోడి కూసింది
తెలుగుకన్నియ తలుపు
తెఱచి చూసింది.

2. చిమ్మచీకటి రాత్రి
శిథిలమై పోయింది
తూర్పువాకిట మరల
తొలిప్రొద్దు పొడిచింది.

3. వేడివెచ్చని వెలుగు
వేయికరముల తెలం
గాణ మాగాణముల
కౌగిలించింది.

II

4. కలువ కనుమూసింది
కమలమ్మ మురిసింది
గాలి ఈలలువేసి
కమ్మగా పాడింది.

5. కన్నెతీవియ నాట్య
కౌశలము చూపింది
పూలబాలిక మధువు
పుక్కిలించింది.

6. మావిగున్న మదించి
తావి గుప్పించింది
గండుకోయిల మధుర
గళము విప్పింది.

7. గతదినమ్ములలోని
కతలన్ని చెప్పింది
భావికాలములోని
భాగ్యమును పొగడింది.

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

అ) నవోదయం అంటే మీరేమనుకుంటున్నారు? ఎందుకని అలాభావిస్తున్నారు?

ఆ) పాఠం ద్వారా మీకేం తెలిసిందో మీసొంతమాటల్లో చెప్పండి.

2. పాఠం చదివి కింది భావాన్నిచ్చే గల పంక్తులు ఎక్కడున్నాయో గుర్తించి గీతగీయండి.

అ) కోయిల తీయనైన పాట పాడింది.

ఆ) తూర్పున సూర్యోదయమైంది.

ఇ) పూవు అనే బాలిక తేనెను పుక్కిలించింది.

3. కింది కవితను చదవండి, జవాబులను రాయండి.

అ) చీకటి తెర తొలగునులే
ఇక నీ వాకిట సిరి వెలుగునులే

రేపన్నది వచ్చునులే
ఆపన్నుల మెచ్చునులే
కన్నుల తడి నొత్తునులే
చిన్నగ నొడి కెత్తునులే ॥ చీకటి ॥

నవశకమే విరియునులే
నవ్యాభ్రము కురియునులే
న్యాయంబిల నిలుచునులే
నవజీవనం పిలుచునులే ॥ చీకటి ॥

- నార్ల వేంకటేశ్వరరావు

i) పై కవితను రాసింది ఎవరు? కవితలోని అంత్యప్రాస పదాలేవి?

ii) సిరి ఎప్పుడు వస్తుందని కవి భావించాడు?

iii) రేపన్నది వచ్చునులే..... మెచ్చునులే అనే పాదాల భావమేమి?

iv) ఈ కవితకు శీర్షికను నిర్ణయించండి.

ఆ) పాఠం చదవండి. కూసింది, చూసింది లాంటి పదాలను పాఠంలో గుర్తించండి.

4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నకు జవాబు రాయండి.

అ) నవోదయంతో ఏమేమి జరిగాయాని కవి తెలిపాడు ?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) "తెలుగు వాకిళ్ళలో తొలికోడి కూసింది." అనే వాక్యంద్వారా మీరేం గ్రహించారు ?

ఆ) 'చిమ్మచీకటి రాత్రి శిథిలమైపోయింది' అని కవి అనడంలో ఉద్దేశం ఏమిటి?

2. కింది ప్రశ్నకు పదేసి వాక్యాల్లో జవాబు రాయండి.

అ) నవోదయం అనే శీర్షిక ఈ పాఠానికి తగినవిధంగా ఉందా? కారణాలతో వివరించండి.

3. కింది ప్రశ్నకు సమాధానాన్ని సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) పాఠంలోని నాలుగు, ఐదు, ఆరు ఖండికలను చదవండి. వీటి ఆధారంగా సూర్యోదయాన్ని వర్ణిస్తూ తెలిపేలా కవిత / గేయాన్ని రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది పదాలకు అర్థాలు రాసి సొంతవాక్యాలు రాయండి.

అ) శిథిలమైపోవడం ఆ) మాగాణం ఇ) నాట్యకౌశలం

ఈ) మధురగళం ఉ) భావికాలం

2. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.

అ) కరము ఆ) కౌశలం ఇ) దినము ఈ) చీకటి

3. కింద వాక్యాలను చదవండి, పాఠం ఆధారంగా గీతగీసిన ప్రకృతి / వికృతి పదాలను రాయండి.

అ) పిల్లలు కథలంటే ఇష్టపడతారు.

ఆ) పెళ్ళికాని ఆడపిల్లలను కన్నియలని అంటారు.

ఇ) రాతిరి తొందరగా నిద్రపోవటం మంచిది.

ఈ) ప్రతిరోజు కుక్కుటము కూత తోటే మేల్కొంటాను.

వ్యాకరణాంశాలు

1. కింది పేరాలోని ఉత్తమ, మధ్యమ, ప్రథమ పురుష వాక్యాలను వేరు చేసి రాయండి.

మా అమ్మ నన్ను పిలిచింది. వెళ్ళాను. నవోదయం పాఠం చదివావా? అని అడిగితే చదవలేదన్నాను. మిత్రుడు నరసింహతో కలిసి చర్చిస్తాను. వాడికి అన్నీ పదాల అర్థాలు తెలుసు. వాళ్ళ అక్కయ్యనడిగి తెలుసుకొన్నాడట. ఐతే మరి నువ్వెప్పుడు వెళ్తావు? నీకు కూరగాయలు తీసుకొచ్చి ఇచ్చి వెళ్తానమ్మా! సరే, బాగా చదువు బట్టీ పట్టకు. అర్థం చేసుకొని అవగాహనతో చదువుకో.

2. కింది వాటిని జతపరచండి.

అ)	దయచేసి చెప్పండి	( )	i) ప్రశ్నార్థక వాక్యం
ఆ)	మీరిక వెళ్ళండి	( )	ii) సందేహార్థక వాక్యం
ఇ)	చెడు పనులు చేయరాదు	( )	iii) ఆశ్చర్యార్థక వాక్యం
ఈ)	మీరు చదువుతున్నారా?	( )	iv) నిషేధార్థక వాక్యం
ఉ)	మీ మాటలు భలేగా ఉన్నాయి!	( )	v) ప్రార్థనార్థక వాక్యం
ఊ)	మీ కుటుంబం చల్లగుండనీ	( )	vi) సామర్థ్యార్థక వాక్యం
ఋ)	ఇవన్నీ మీరు చేయగల్గుతారా!	( )	vii) విధ్యర్థక వాక్యం
ౠ)	మేమంతా చదివితినే ముందుకెళ్తాం	( )	viii) ఆశీరర్థక వాక్యం
ఎ)	నేను పాట పాడల్నా	( )	ix) హేత్వర్థక వాక్యం
ఏ)	అతడు శాస్త్రవేత్తకాగలడు	( )	x) అనుమత్యర్థక వాక్యం

♦ **కింది కవితను పరిశీలించండి.**

బుడి బుడి నడకల పిల్లలం
చిట్టి పొట్టి మాటల జల్లులం
కల్మషమెరుగని మల్లెలం
ఆనందపు హరివిల్లులం

చదివారు కదా! పై కవితలో ఒకే విధమైన హల్లులు పంక్తి చివరన మళ్ళీ మళ్ళీ వచ్చాయి. ఇలా పాదాంతం (పంక్తిచివరన) లో అనుప్రాస పదాలువస్తే అది 'అంత్యానుప్రాస' అలంకారమౌతుంది.

పై కవితలో పిల్లలం,జల్లులం,
మల్లెలం, విల్లులం

అనేవి అంత్యానుప్రాసలుగా వచ్చాయి. కావున అందులో ఉండే అలంకారం అంత్యానుప్రాసాలంకారం ఔతుంది.

"అనుప్రాస పదాలు పదాంతంలో, పాదాతంలో, వాక్యాంతంలో ఉన్నట్లైతే అది అంత్యాను ప్రాసాలంకారం"

- **కింది ఉదాహరణలో అంత్యానుప్రాసాలంకారం ఉందా? లేదా? ఎందుకు?**

  వానలు కురవాలి

  చెరువులు నిండాలి

  పంటలు పండాలి

  జగమంతా నడవాలి

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- పాఠశాల గ్రంథాలయం నుండి కొన్ని బాలగేయాలను సేకరించి, సంకలనంగా తయారుచేయండి.



జ్ఞానవృద్ధులైన వారిని నమస్కరిస్తూ, వారికి సేవలు చేస్తుండే వారికి - ఆయుష్షు, విద్య, కీర్తి, బలము ఈ నాలుగు వృద్ధి చెందుతాయి.

4 సంజయ రాయబారం

– ఉషశ్రీ

చదవండి – ఆలోచించండి – చెప్పండి

"మహాశయులారా! ద్రుపదమహారాజు సూచన సముచితంగా ఉంది. నీతికోవిదులు కూడా ఈ మాటల్ని హర్షిస్తారు. ఇటు పాండవులూ అటు కౌరవులూ ఉభయులూ మనకు సమానులే. వారికీ వీరికీ నష్టం కష్టం కలగని దారి మనం అనుసరించాలి" అంటూ శ్రీకృష్ణుడు ద్రుపదునివైపు తిరిగి ఇలా అన్నాడు. మీరు వయస్సులో, జ్ఞానంలో మాకంటే పెద్దలు. ధృతరాష్ట్రుడు కూడా మిమ్ము గౌరవభావంతో చూస్తాడు. కృపద్రోణులకు మీతో స్నేహం ఉంది. అందుచేత సముచిత సందేశంతో మీరు దూతను పంపండి. దుర్యోధనుడు మన సూచనానుసారం ధర్మపథాన నడిచినట్లయితే ప్రజాక్షయం ఉండదు. ఉభయ వంశాల మధ్య సౌహార్ద్రం వెల్లివిరిస్తుంది.

ప్రశ్నలు

1. పై పేరాలోని విషయాన్ని ఎవరు ఎవరికి చెబుతున్నారు?
2. ఇది ఏ సందర్భంలోనిది?
3. రాయబారం అంటే ఏమిటి?
4. రాయబారానికి వెళ్ళేవారు ఏ విధంగా మాట్లాడాలి?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

ద్యూత క్రీడ (జూదం)లో ధర్మరాజు ఓడిపోతాడు. ఒప్పందం ప్రకారం 12 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసానికి వెళతారు. ఇది పూర్తిచేసిన అనంతరం ముందే అనుకున్నట్లు తమ రాజ్యభాగాన్ని తిరిగి తమకు ఇచ్చివేయాలని ద్రుపదుని పురోహితుణ్ణి పాండవులు రాయబారానికి పంపారు. ద్రుపద పురోహితుడు హస్తినాపురానికి వెళ్ళి "పాండవుల రాజ్యభాగాన్ని వారికిచ్చి ఉభయులూ సుఖశాంతులతో వర్ధిల్లేలా చూడండి" అని చెప్పాడు. దీనికి ప్రతిగా పాండవులవద్దకు ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి రాయబారిగా పంపాడు.

పాఠ్యభాగ వివరాలు

ప్రస్తుత పాఠం ఉషశ్రీ తెలుగులో రాసిన భారతం (మొదటి భాగం) ఉద్యోగ పర్వం లోనిది. భారత, రామాయణాలను ఇతిహాసాలు అంటారు. ప్రస్తుత పాఠం ఇతిహాసకథ. ఇతిహాసమంటే జరిగినకథ (ప్రాచీనకథ) రాయబార ఘట్టానికి చెందిన కథ ఇది.

విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని చిత్రం చూడండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థం కాని పదాలను గుర్తించండి. వాటి అర్థాలు 'పదాలు – అర్థాలు' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

కవి పరిచయం

ఆధునిక కాలంలో భారతాన్ని రచించిన వాళ్ళు ఎందరో ఉన్నారు. వారిలో ఉషశ్రీగారు ప్రత్యేక కోవకు చెందినవారు. కథ చెప్పటంలో వారి బాణీయేవేరు. వీరిభారతం ఆకాశవాణిలో ధారావాహికంగా ప్రసారం కావించబడి అశేష పాఠకుల ఆదరణను చూరగొన్నది. వీరి పూర్తిపేరు పురాణ పండ సూర్య ప్రకాశ దీక్షితులు. వీరు 1928లో తూర్పుగోదావరి జిల్లా ఆలమూరులో జన్మించారు. రామాయణ, భారత భాగవతాలను వచనంలో రచించారు. ప్రవచనాలు చేశారు. వీరు 1990లో మరణించారు.

సంజయా!

పాండవులు ఉపప్లావ్యం చేరినట్లు తెలిసింది. నువ్వు రేపు బయలుదేరి వెళ్ళి వారి క్షేమ సమాచారాలు తెలుసుకు రావాలి. అక్కడకు వెళ్ళగానే ధర్మరాజును దర్శించాలి. ఆదర వచనాలతో వారి యోగక్షేమాలు నేను అడిగినట్లు చెప్పాలి.



నాయనా! క్లేశాలన్నీ సహించి క్షేమంగా ఉన్నట్టు తెలిసి సంతోషించాను. మేము కూడా క్షేమంగా ఉన్నాం.

సాధు స్వభావాలూ, పరోపకార పరాయణులూ అయిన మీకు రాకూడని కష్టాలు వచ్చాయి, అని చెప్పు.

మరొక్కమాట సంజయా ! ఇంత జరిగినా వారికి మన మీద క్రోధం లేదు. ఎన్నడూ మోసం చేసి ఎరుగరు. సాహస పరాక్ర -మాలు ప్రదర్శించి సంపదలు సాధించారు. అవన్నీ గౌరవభావంతో నా అధీనంలో ఉంచారు. ధర్మవిరుద్ధంగా ఏనాడూ వారు ప్రవర్తించలేదు; శీతోష్ణాలనూ, ఆకలిదప్పులనూ లక్ష్యం చెయ్యకుండా, నిద్రనూ అలసత్వాన్నీ దూరంగా ఉంచి విచక్షణాపరులై ధర్మకర్మలు చేస్తున్నారు.

ఇంతకాలం ప్రవాసంలో ఉన్నా, ఈనాడు వారి మిత్రులందరూ వారి దగ్గరికే చేరారు; అంటే స్నేహబంధాన్ని వారు ఎలా రక్షించుకుంటూ వస్తున్నారో గ్రహించు. స్వాగత, సమ్మానాలు అందుకోవడానికి అర్హులు వారు. అయినా మన కర్ణ, సుయోధనాది మందబుద్ధులు వారిని అవమానాల పాలు చేశారు.

నా దుర్యోధనుని బుద్ధి రాగ ద్వేషాలకు లొంగి కాలవశమై మూర్ఖంగా నడుస్తున్నది.

వీడు సుఖంగా సర్వభోగాలు అనుభవిస్తూ వారి సంపదలను కూడా హరించాలనుకుంటున్నాడు. అదేదో ఘనకార్యం; అని వాడి ఊహ.

అక్కడ చూస్తే

భీమార్జున నకుల సహదేవులతో కృష్ణుడు, సాత్యకీ ధర్మజుని మాటమీద నడుస్తారు.

గాండీవం ధరించి కదిలితే ప్రపంచాన్ని జయించగలడు సవ్యసాచి. మేఘగర్జనలా ధనుష్టంకారం చేసి మిడతలదండులా బాణాలు వదిలే ఆ వీరుని ముందు నిలువగల వారెవరు. అలానే జగత్రయాన్ని నడపగలవాడు వాసుదేవుడు. వారిద్దరూ అటు ఉన్నారు.

ఉద్దండ గదాదండం ధరించి నిలబడే భీముని ముందెవడాగగలడు. యుద్ధం జరిగితే వాడొక్కడే నా కొడుకులందరినీ నేల కూలుస్తాడు. అటువంటి వారితో వైరం పెంచుకున్నారు వీరు.

నకుల సహదేవులిద్దరూ అర్జునుని శిక్షణలో ఆరితేరారు. శత్రుసంహారం సాగించగల యోధులు.

మన సేనలో యోధులు లేకపోలేదు; సంఖ్యాబలం కూడా మనదే ఎక్కువ. కాని, వారి ముందు మనవారు ఆగరు.

మందబుద్ధి నా దుర్యోధనుడు వారితో పోరాటానికి సిద్ధపడుతున్నాడు. కృష్ణార్జునుల ఏకరథారూఢులై వస్తే యింక చెప్పవలసిన దేమున్నది.

ధర్మరాజు అజాతశత్రువు, ధర్మపరాయణుడు, లజ్జా వినయాలంకార భూషితుడు. కనుకనే జూదంలో మోసం జరిపి మనం పరాభవించినా నియమానికి కట్టుబడి వీరిని విడిచి పెట్టాడు.

అందుచేత, నువ్వు ఉపప్లావ్యం వెళ్ళి వారి కుశలం అడిగి నేను శాంతినే కోరుతున్నాను, అని గట్టిగా చెప్పు.

అక్కడి వారందరినీ పేరు పేరునా నేను అడిగినట్లు చెప్పు. భరతవంశ శ్రేయస్సు ప్రధానంగా అక్కడ మాట్లాడవలసిన మాటలు నీకు నేను చెప్పనవసరం లేదు. ఏ దశలోనూ క్రోధాన్ని దరిజేర నివ్వకు, అని సాగ నంపాడు.

సంజయుడు పాండవుల దగ్గరకు వచ్చాడు. ముందుగా ధర్మరాజును దర్శించి నమస్కరించి:

ధర్మనందనా! మీ అందరినీ పేరు పేరునా కుశలం అడగమని ఆజ్ఞాపించాడు. అనగా ధర్మరాజు :

సంజయా!

నీ రాక మాకెంతో సంతోషం కలిగిస్తున్నది. నిన్ను చూస్తే మాకు ధృతరాష్ట్ర మహారాజును చూచినంత తృప్తిగా ఉంది.

ధర్మాధర్మకోవిదుడు మా పితామహుడు భీష్ములవారు క్షేమమా! ఆయనకు మాయందు ఆదరభావం తగ్గలేదు కదా?

ధృతరాష్ట్ర నందనులందరూ సుఖంగా ఉన్నారా! తన మంత్రాంగంతో దుర్యోధనుని నడిపించే కర్ణుడు కుశలంగా ఉన్నాడు కదా?

మా కుటుంబ వృద్ధ నారీజనం, వారి పరివారం క్షేమంగా ఉన్నారా!

దుర్యోధనుడు తన మంత్రుల పరిజనుల రక్షణ పోషణల విషయమై శ్రద్ధ వహిస్తున్నాడా!

మా గురువులు కృప ద్రోణులూ, ఆచార్యనందనుడు అశ్వత్థామ మాయందు అభిమానంతో ఉన్నారా?

దేశంలో చోరభీతి, శత్రుభయం కలిగినప్పుడు వారు నకుల సహదేవులను స్మరిస్తున్నారా?

ఘోషయాత్రా సమయంలో వారికి జరిగిన పరాభవం నుంచి మా భీమార్జునులు రక్షించిన విషయం మరువలేదు కదా!

సంజయా! మంచిమాటలతో దుర్యోధనాదులు దారికి రాకపోతే మరొక మార్గాన మా రాజ్యం మేము సాధించుకోగలం, అన్నాడు, ధర్మరాజు.

సంజయుడు : ధర్మనందనా! నీనోట అసత్యం రాదు. అన్నీ వాస్తవాలే పలికావు. అక్కడ వారందరూ కుశలమే. ఇంతవరకూ మీ విషయంలో వారు అన్యాయంగా ద్రోహబుద్ధితో ఉన్నారు. మీరు అందుకు భిన్నంగా వారిపట్ల సద్భావంతో నడుస్తున్నారు.

మీవంటి మంచివారిని హింసించిన ధృతరాష్ట్రుని లోకం నిందిస్తూనే ఉంది.



విశేషం ఏమిటంటే–

తనకు తానై ఆయన తన కొడుకులకు దుష్టబుద్ధులు బోధించడంలేదు. లేకపోగా వారి చెడుతలుపులు విని విచారిస్తున్నాడు.

మన భవిష్యత్తు ఎలా ఉంటుందనేది ఇంతవరకూ ఎవరూ ఎరిగిన వారు లేరు. నీవంటి సత్పురుషుడు క్లేశాల పాలబడతాడని ఎవరూహించారు.

మీ రందరూ ఇంద్ర సమ పరాక్రములు. అయినా స్వార్థ చింతతో స్వధర్మం విడిచి పెడుతున్నారు. కురు పాండవ శిబిరాలలో దేశ దేశాల యోధవీరులున్నారు. వీరందరూ సుఖంగా ఉండే మార్గం మీరు చెప్పాలి.

మీ మిత్రులూ, ఆప్తులూ వింటుండగా మా మహారాజు చెప్పిన మాటలు వినిపిస్తాను.

ధర్మరాజు : సంజయా! అందరూ ఇక్కడే ఉన్నారు. వాసుదేవుడు కూడా ఉన్నారు. వినిపించు మీ ప్రభువు సందేశం.

మహనీయులారా!

మా మహారాజు శాంతినే కోరుతున్నాడు.

మీరు సరళస్వభావులు, ధర్మసంపన్నులు, దయార్ద్రహృదయులు, ఔదార్యం, లజ్జా మీ భూషణాలు. క్రూరత్వాన్ని దరిజేర నివ్వరు. ఏనాడూ మీరు చెడుకార్యాలు చేయలేదు.

పాపానికి అవకాశం కలిగించి, నరకానికి బాటలు వేస్తూ సర్వనాశనానికి దారితీసే యుద్ధాన్ని ప్రాజ్ఞు డెవడూ కోరడు. సజ్జనులుగా కీర్తిపొందిన మీరు యుద్ధానికి సుముఖంగా ఉంటారని నేను అనుకోను.

దేవేంద్రుడు వచ్చినా మిమ్ము ఎదిరించి నిలబడలేడు.

దుర్యోధనుని దగ్గర అపారమయిన సైన్యం ఉంది. వారిని జయించడం సామాన్యం కాదు. జయాపజయాలను ఎవరూ ముందుగా నిర్ణయించలేరు.

వయోవృద్ధులు ద్రుపదులవారు, లోకజ్ఞుడు వాసుదేవుడూ ఇక్కడ ఉండడం చాలా సంతోషం. వారుభయులూ నిశితంగా ఆలోచించి ఈ ఉభయవంశాల శ్రేయస్సుకు తగిన రీతిలో వీరిని నడుపుతారని నమ్ముతాను.

మా ప్రభువుతోపాటు, మీ పితామహుడు కూడా శాంతినే కోరుతున్నాడు. ధర్మ నందనా! అదే మీకు కళ్యాణప్రదమని భావిస్తున్నాను, అన్నాడు.

సంజయా! నీ మాటలు చాలా విచిత్రంగా ఉన్నాయి. మేము యుద్ధానికి సుముఖంగా ఉన్నామనే అభిప్రాయం నీ కెందుకు కలిగిందో తెలీదు. నీ మనస్సులో యుద్ధభీతి ఎలా ప్రవేశించింది. సర్వనాశనానికి దారితీసే సంగ్రామం కంటే నిఖిల జన కళ్యాణహేతువైన శాంతియే శ్రేయస్కరం.

యుద్ధం చెయ్యకుండా మా పని నెరవేరుతుందంటే అంతకంటె కావలసింది లేదు. శ్రమ పడకుండా ఫలం దక్కుతుందని తోస్తే నడ్డివంచి అవస్థపడే వాడెవడు!

ధర్మబద్ధంగా, ప్రజా శ్రేయస్కరంగా ఉండే కార్యాలే మేం చేస్తాం. సుఖ, భోగాలు లభించినా, అవి ధర్మంగా వస్తేనే స్వీకరిస్తాం.

ఇంద్రియవాంఛలు తీరడానికి శ్రమించే వారికి దుఃఖమే ప్రాప్తిస్తుంది. విషయ సుఖాల ఆలోచనతోనే విచారం ఆరంభమవుతుంది. అది లేని వానికి ఏ బాధా లేదు.

నెయ్యి పడేకొద్ది అగ్ని ప్రజ్వలిస్తూనే ఉంటుంది. అలానే యీ సుఖాలు ఎక్కువయే కొద్దీ వాటిమీద వ్యామోహం పెరుగుతుంది.

సంజయా! ఒక్క విషయం మరచిపోకు. యుద్ధంలో విజయం పుణ్యాత్ములకే లభిస్తుంది.

సామాన్యులలో పెరిగే భోగతృష్ణ మీ దుర్యోధనుడికి చాలా ఉంది. ఆ విషవలయంలో మీ మహారాజు చిక్కుకుని మమ్మల్ని శాంతంగా, సౌమనస్యంతో ఉండమని సందేశం పంపుతున్నాడు.

మన వ్యవహారాలు మనం ఎలా చూసుకుంటామో, ఇతరులు అలా చూసుకోవడం దోషమా!

దుష్టబుద్ధితో మా సర్వసంపదలూ హరించాడు దుర్యోధనుడు. అది తెలిసి కూడా ఆ కొడుకును వదలలేక బాధపడుతున్నాడు. మీ ప్రభువు విద్వాంసుడయిన విదురుడు చెప్పే హిత బోధలు తల కెక్కడం లేదు.

ఈర్ష్య, క్రోధం, పరుషభాషణం, మిత్రద్రోహం, అయోగ్యత ఇన్ని అవగుణాలు మూర్తీభవించిన వాడని తెలిసికూడా ఆ కొడుకును విడవలేక పురుషార్థాలకు నీళ్ళు విడిచి పెట్టాడు మీ ప్రభువు.

లోభబుద్ధితో ఉన్న ధృతరాష్ట్రునితో సంధి జరుగుతుందనే ఆశ నాకు లేదు. దుర్యోధనునికి మా రాజ్యభాగం ఇచ్చే తలపు పుడుతుందని అనుకోను.

నా తమ్ములు నలుగురూ నిలబడి ఉండగా దేవేంద్రుడు వచ్చినా మా రాజ్యం మరొకరికి దక్కదు.

దుర్యోధనాదులు మాకు చేసిన అవమానాలూ, కలిగించిన క్లేశాలు నువ్వెరుగనివి కావు. అయినా నేను వారిని క్షమించి, సోదరదృష్టితోనే చూస్తున్నాను. ఇప్పటికయినా మా రాజ్యం మాకు అర్పించాలి. ఇంద్ర ప్రస్థంలో మేము ఉంటాం. అందుకు అంగీకరించారా అందరం సుఖశాంతులతో ఉంటాం. అంతే, అన్నాడు.

సావధానంగా విని సంజయుడు :

ధర్మనందనా! లోకవిఖ్యాతిపొందిన నువ్వు ధర్మవిరుద్ధమార్గాన ఏనాడు నడవలేదు. జీవితం అశాశ్వతం. కాని కీర్తి ఉన్నదే అది శాశ్వతం.

కీర్తిని కాపాడుకునే మార్గం మీరు విడిచి పెట్టకూడదు. కౌరవులు మీరాజ్యభాగం మీకివ్వరనే అనుకుందాం. అయినప్పుడు సంగ్రామం వంటి పాపకర్మలు మీవంటివారు చేయదగినవి కావు. రాజ్యలోభంతో ద్వేషభావం పెంచుకుని యుద్ధానికి దిగడం ఉచితం కాదు. అంతకంటె సుఖంగా అరణ్యాలలో ఉండడం మంచిది. సంగ్రామాలు ద్వేషాగ్నిని రగిలిస్తాయే తప్ప చల్లార్చవు.

ఒక్కొక్కప్పుడు మూర్ఖులు, పాపాత్ములూ, యుద్ధంలో విజయం పొందుతారు. ధర్మ సంపన్నులు దైవోపహతులు కావచ్చు. ఎంత క్రోధం వచ్చినా మీరు ధర్మం తప్పరు.

కోపం వచ్చిన వానికి ఎన్ని దురవస్థలు –

తీపి వస్తువు చేదుగా ఉంటుంది.

నిరంతరం శిరోవేదన వేధిస్తుంది.

కీర్తిని నాశనం చేస్తుంది.

నిజానికి మీరందరూ క్షమాగుణ సంపన్నులు.

యుద్ధమే జరిగితే – పితామహుడు భీష్ములవారు ఆచార్యుడు ద్రోణులు ఆయన నందనుడు అశ్వత్థామ వీరందరూ మీ కెదురుగా నిలుస్తారు. వారి సంహారము మీకు సంతోషకరమా?

కృప, శల్య, భూరిశ్రవన, వికరణ, వివింశతి ప్రభృతుల వెంట కర్ణ, దుర్యోధనాదులను నేలపాలు చేసి సుఖం అనుభవిచగలరా?

ఒకవేళ ఈ భూమండలం అంతా స్వాధీనమయినా మీరు జరామరణాలు లేకుండా శాశ్వతంగా పాలించగలరా? ఇవన్నీ మీకు తెలియనివి కావు.

కాకపోయినా ఏదో ప్రారబ్ధం ఆవహించి మీకు యుద్ధ వాంఛ కలిగించింది!

మీ మిత్రులే మీకు ఈ ఊహ కలిగిస్తే అంతా వారికే విడిచి వానప్రస్థానికి వెళ్ళడం మంచిది. అందువల్ల వంశనాశన పాపం తప్పుతుంది, అన్నాడు.

వింటూ ధర్మరాజు :

సంజయా! అన్నిటికంటె ధర్మం శ్రేష్ఠమయినదనే సత్యాన్ని అంగీకరించావు. బావుంది సంతోషం. నేనిప్పుడు ధర్మం చేస్తున్నానా అధర్మం చేస్తున్నానా! అనేది బాగా ఆలోచించి నిర్ణయించాలి.

ఎందుకంటావా?

ఒకప్పుడు ధర్మం అధర్మంగా, అధర్మం ధర్మంగా కనిపిస్తుంది. విద్వాంసులు తప్ప ఈ సూక్ష్మాన్ని గ్రహించలేరు. ధర్మం కూడా అన్నివేళల అందరికీ ఒకే విధంగా ఉండదు.

ఆపద్ధర్మం ఎరుగుదువుకదా! జీవితం నడవడం కష్టమయినప్పుడు సత్కర్మకు లోపం రాకుండా ఏ పని చేసినా దోషంలేదు.

కాని నిరంతరం ఆపద్ధర్మానే అనుసరించకూడదు. ఆపదలలో పడినప్పుడు దానిని గ్రహించనివాడు మూర్ఖుడు. నా తాత తండ్రులు నడిచిన ధర్మమార్గం నేను విడవను. ఆ దారిలో ఏది లభించినా ధర్మంగా ప్రాప్తించినట్లే స్వీకరిస్తాను.

వాసుదేవు డిక్కడే ఉన్నాడు. నేను యుద్ధోన్మాదంతో ఉన్నానని భావిస్తే ఆయన నన్ను మందలించవచ్చు.

ఆయనకంటె మాకు ఆప్తుడు లేడు. ఆయన మాటను మేమంతా తలవంచి పాలిస్తాం, అన్నాడు.

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది అంశాలలో ఏదైనా ఒకదాన్ని సమర్థిస్తూ మాట్లాడండి.

అ) యుద్ధం పనికిరాదు.

ఆ) అవసరమైనప్పుడు యుద్ధం చేయవచ్చు.

2. పాఠం చదవండి. పాఠంలో ఎవరి స్వభావం, గుణగణాలు ఎలాంటివో గుర్తించండి. వాటిని కింది పట్టికలో రాయండి.

వ్యక్తులు	స్వభావం, గుణగణాలు
ధర్మరాజు	
భీష్ముడు	
విదురుడు	
ధృతరాష్ట్రుడు	
దుర్యోధనుడు	

3. కింది అంశాలలో ఏదైనా ఒకదాన్ని సమర్థిస్తూ మాట్లాడండి.

అ) సంజయా! పాండవులు ఉపప్లావ్యం చేరినట్టు తెలిసింది. నువ్వు రేపు బయలుదేరివెళ్ళి వారి క్షేమసమాచారాలు తెలుసుకురావాలి.

ఆ) నీ రాక మాకెంతో సంతోషం కలిగిస్తున్నది. నిన్ను చూస్తే మాకు ధృతరాష్ట్ర మహారాజును చూసినంత తృప్తిగా ఉంది.

ఇ) మీ మిత్రులూ ఆప్తులూ వింటుండగా మా మహారాజు చెప్పిన మాటలు వినిపిస్తాను.

ఈ) నెయ్యిపడేకొద్దీ అగ్ని ప్రజ్వలిస్తూనే ఉంటుంది. అలానే ఈ సుఖాలు ఎక్కువయ్యే కొద్దీ వాటి మీద వ్యామోహం పెరుగుతుంది.

4. కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

ధర్మరాజు వేదవేదాంగాలు అధ్యయనం చేసి రాజసూయాది సత్క్రతువులు సాగించినవాడు. చతురంగబల సమన్వితుడు అయినా శాంతంగా తమరాజ్యం తమకు లభిస్తే యుద్ధం అవసరం లేదు అంటున్నాడు. తాతతండ్రులు

నేర్పిన క్షాత్ర ధర్మాన్ని పాలించడం కోసమే అది కోరుతున్నాడు. ఇంతకూ నువ్వు యుద్ధం యుద్ధం అంటున్నావే! యుద్ధం క్షాత్ర ధర్మం కాదంటావా శత్రువులకు భయపడి పారిపోవడం వీరధర్మమా! అదేదో నువ్వు చెబితే వినాలని కుతూహలపడుతున్నాను. ప్రజలు ధర్మమార్గం తప్పకుండా చూడవలసిన ప్రభువు తాను ముందుగా ధర్మవర్తనుడు కావాలి. ధర్మవ్రతులనే న్యాయాధిపతులుగా నియోగించాలి. క్రూరులను దండించాలి. కౌరవులు చెయ్యని క్రూరకార్యం లేదు.

అ) పై పేరా ఏ సందర్భంలోనిది? ఈ మాటలను బట్టి వారు ఎవరివైపు మాట్లాడినారనుకుంటున్నావు?

ఆ) ధర్మరాజు ఏం కోరుకొంటున్నాడు?

ఇ) ప్రభువు ఎలా ఉండాలి?

ఈ) "ధర్మవర్తనుడు" అనే పదానికి అర్థం ఏమిటి?

ఉ) యుద్ధం క్షాత్ర ధర్మం అవుతుందా? ఎందుకు?

5. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) ధృతరాష్ట్రుడు సంజయునితో పాండవుల గురించి ఏమని చెప్పాడు?

ఆ) ధృతరాష్ట్రుడు రాయబారానికి వెళ్తున్న సంజయునితో ఎలా ప్రవర్తించాలని చెప్పాడు?

ఇ) ధర్మరాజు సంజయుని ద్వారా ఎవరెవరి యోగక్షేమాలను ఏమని తెలుసుకొన్నాడు?

ఈ) ధర్మరాజు యుద్ధం గురించి తన అభిప్రాయాలను ఏమని చెప్పాడు?

ఉ) సంజయుడు యుద్ధం గురించి ధర్మరాజుతో ఏమన్నాడు?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) రాయబారమంటే ఏమిటి? యుద్ధనివారణ కోసం రాయబారిగా వెళ్ళేవారికి ఉండాల్సిన లక్షణాలు ఏవి?

ఆ) ధర్మం అంటే ఏమిటి? ఆపద్ధర్మం అంటే ఏమిటి? అన్నింటికంటే ధర్మం శ్రేష్ఠమైనదని ధర్మరాజు ఎందుకు అన్నాడు?

ఇ) జీవితం నడవడం కష్టమైనప్పుడు సత్కర్మకు లోపం రాకుండా ఏపని చేసినా దోషం లేదు. దీన్ని మీరు సమర్థిస్తారా? ఎందుకు?

ఈ) పాఠంలోని ఈ వాక్యాలు చదవండి. "కోపం వచ్చిన వారికి ఎన్ని దురవస్థలు. తీపి వస్తువు చేదుగా ఉంటుంది. నిరంతరం శిరోవేదన వేధిస్తుంది. కీర్తిని నాశనం చేస్తుంది" వీటిద్వారా మీరేం గ్రహించారు?

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) "సంజయుని రాయబారంలోని విషయాల ఆధారంగా పాండవులు, కౌరవుల స్వభావాల గురించి తెల్పండి.

ఆ) పాండవులు, కౌరవుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడానికి కారణాలు ఏమై ఉంటాయి?

3. కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) "సంజయ రాయబారం" ఘట్టాన్ని సంభాషణల రూపంలో రాసి ప్రదర్శించండి.

ఆ) "యుద్ధకాంక్ష" మంచిది కాదని, దీనివల్ల కలిగే నష్టాలను వివరిస్తూ శాంతిని కాంక్షించాలని తెలిపేలా దినపత్రికకు ఒక లేఖ రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. పాఠం ఆధారంగా కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి. వీటితో సొంతవాక్యాలు రాయండి.

అ) శాశ్వతం ఆ) అపకీర్తి ఇ) పుణ్యకర్మలు ఈ) అనుచితం

ఉ) అసత్యం ఊ) అపజయం

2. కింది పదాలతో సొంతవాక్యాలు రాయండి.

అ) రాగద్వేషాలు ఆ) ఘనకార్యం ఇ) ఆరితేరారు

ఈ) జయాపజయాలు ఉ) హితబోధలు ఊ) లోభబుద్ధి

వ్యాకరణాంశాలు

1. కింది పుంలింగ, స్త్రీలింగ, నపుంసక లింగ వాక్యాలు కలిపి ఉన్నాయి. వాటిని వేరుచేసి పట్టిక రూపంలో రాయండి.

నేనేమన్నానో తెలియదు. అతడు రానే వచ్చాడు. అమ్మకూడా అతని వెంట వచ్చింది. వారిద్దరూ నన్ను బుజ్జగించారు. అతను నాకు మంచి మిత్రుడు. నా మిత్రుడు నేను కలిసి అమ్మ వెంట గంగాస్నానానికి వెళ్ళాం. గంగానది ప్రశాంతంగా ప్రవహిస్తోంది. స్నానం చేశాం. అమ్మ గంగమ్మకు పూజ చేసింది. నా మిత్రుడు నేను కలిసి గంగకు హారతినిచ్చాం. స్త్రీలందరూ దీపాలు వెలిగించి నీళ్ళల్లో వదిలి పెడ్తున్నారు. గంగా ప్రవాహం శోభాయమానంగా ఉంది.

ఉదా॥

పుల్లింగం	స్త్రీలింగం	నపుంసక లింగం
అతడు రానేవచ్చాడు	అమ్మ కూడా అతని వెంట వచ్చింది	నేనేమన్నానో తెలియదు

♦ **కింది పదాలు గమనించండి.**

అ) అతి + అద్భుతం – అతి + య్ + అద్భుతం – అత్యద్భుతం

ఆ) అతి + ఉత్సాహం – అతి + య్ + ఉత్సాహం – అత్యుత్సాహం

ఇ) అణు + ఆయుధం – అణు + వ్ + ఆయుధం – అణ్వాయుధం

ఈ) మాతృ + ఆజ్ఞ – మాతృ + ర్ + ఆజ్ఞ – మాత్రాజ్ఞ

ఉ) వస్తు + ఐక్యం – వస్తు + వ్ + ఐక్యం – వస్త్వైక్యం

పై పదాలను గమనించారు కదా!

పూర్వ పదాల్లో చివర ఇ, ఉ, ఋ లు ఉన్నాయి.

పర పదాల్లో తొలి అక్షరం (అ, ఉ, ఆ, ఐ) అంటే అచ్చులు ఉన్నాయి.

అంటే భిన్నమైన అచ్చులు కలుస్తున్నాయి.

ఇ + అ – య్

ఉ + ఆ – వ్

ఋ + ఆ – ర్

ఆదేశంగా వస్తున్నాయి. య్ (య), వ్ (వ), ర్ (ర) లను 'యణ్ణులు' అని అంటారు. ఇలా యణ్ణులు ఆదేశంగా వచ్చే సంధిని యణాదేశ సంధి అని గుర్తించాలి.

పై వివరాలన్నింటిని కలిపి సూత్రరూపంలో కింది విధంగా చెప్పవచ్చు.

'ఇ, ఉ, ఋ లకు భిన్నమైన అచ్చులు పరమైనప్పుడు య, వ, ర లు ఆదేశంగా వస్తాయి."

♦ **కింది పద్యాల్లోని యణాదేశ సంధి పదాలను గుర్తించండి. వాటిని విడదీయండి.**

దేవాలయం, ఇవ్వేళ, ఇత్యాదులు నీవేమి? పిత్రాజ్ఞ, మధ్వరి, అమ్మమ్మ, అత్యాశ, అంత్యేష్టి.

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

అ) "మహాభారతం"లోని పాఠ్యాంశం చదివారు కదా! మీ పాఠశాల గ్రంథాలయాల్లో పిల్లల కోసం రాసిన మహాభారతం చదవండి. దాంట్లో మీకు నచ్చిన పాత్ర గురించి నివేదిక రాసి ప్రదర్శించండి.

ఆ) "సంజయ రాయబారం" పాఠాన్ని నాటకీకరణ చేయండి.



మహాభారతం ఆర్ష విజ్ఞాన సర్వస్వం.
ఇది ధర్మతత్త్వజ్ఞుల దృష్టిలో – ఒక మహాధర్మశాస్త్రం
ఆధ్యాత్మికతత్త్వవేత్తల దృష్టిలో – ఒక మహాధర్మశాస్త్రం
సత్కవీశ్వరుల దృష్టిలో – సమస్త సాహితి భాండాగారం
– నన్నయ

5 కల్యాణం

– తరిగొండ వెంకమాంబ

చదవండి – ఆలోచించండి – చెప్పండి

సమాజానికి మూలం కుటుంబవ్యవస్థ. కుటుంబానికి మూలం పెళ్ళి. భారతీయసంస్కృతిలో కుటుంబవ్యవస్థకు, పెళ్ళికి ముఖ్యస్థానాలున్నాయి. వివాహాల వల్ల కుటుంబాలు విస్తరించడం, సంబంధబాంధవ్యాలు పటిష్టం కావడం జరుగుతుంది. ఐతే వివాహాలు ఆయా మత, కుల, వర్గ ప్రాంత సంప్రదాయాలకు అనుకూలంగా జరుగుతుంటాయి. వీటి ద్వారా సంస్కృతి-సంప్రదాయాలు ఒక తరం నుండి మరొక తరానికి చేరవేయబడుతుంటాయి.

ప్రశ్నలు

1. సమాజం ఎలా ఏర్పడుతుంది?
2. సమాజానికి మూలస్థానం ఏది?
3. ఒక తరం నుండి మరో తరానికి చేరవేయబడేవేవి?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

భారతీయ సంస్కృతిలో పెళ్ళిళ్ళు జరిగే విధానంలో అక్కడక్కడ స్వల్ప మార్పులున్నను మూల సంస్కృతి ఒక్కటే. సనాతన భారతీయ సంస్కృతిలో పెళ్ళి జరిగే విధానాన్ని, ఆ సాంస్కృతిక ప్రతిబింబాన్ని చూపడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యభాగాన్ని తరిగొండ వెంగమాంబ రాసిన 'రమాపరిణయం'లోని శ్రీవేంకటేశ్వర స్వామి పెళ్ళిఘట్టం.

ఇది ద్విపద ప్రక్రియకు చెందిన పాఠ్యాంశం. ద్విపదలో రెండు పాదాలే ఉంటాయి. ఇది పాడుకోడానికి వీలైనది. ప్రాస నియమం పాటించబడును. ప్రాసలేనిద్విపదను మంజరీద్విపద అంటారు.

విద్యార్థులకు సూచనలు

- అర్థం కాని పదాల కింద గీతగీసి, వాటిని పదపట్టికలో అన్వేషించండి.
- ఇంకా తెలియని పదాలకు అర్థాలను ఉపాధ్యాయులనడిగి తెలుసుకోండి.
- *పాఠంలోని బొమ్మల ద్వారా పాఠంలోని కథాంశాన్ని ఊహించండి.*

కవి పరిచయం

తరిగొండ వెంగమాంబ తిరుపతికి పశ్చిమాన 100 కి.మీ దూరంలో ఉన్న తరిగొండ గ్రామానికి చెందినది. ఈమె 17వ శతాబ్దానికి చెందిన కవయిత్రి. ఈమె తెలుగు మీరాబాయిగా ప్రసిద్ధి చెందింది.

తరిగొండ వెంగమాంబ సనాతన సంప్రదాయ కుటుంబానికి చెందిన స్త్రీ ఐనప్పటికీ సాంఘికదురాచారాలపైన తిరుగుబాటు చేసింది. శ్రీ వేంకటేశ్వర స్వామికి పరమభక్తురాలై జీవితమంతా స్వామి సన్నిధిలోనే గడిపింది. చెంచునాటకం(యక్షగానం), భక్తిగీతసుధాలహరి (గేయం), శ్రీ వేంకటాచల మహాత్మ్యం, తరిగొండ నృసింహశతకం, రమాపరిణయం, భాగవతం(ద్విపద) మొదలగు గ్రంథాలను రచించి స్వామికి అర్పించారు.

ఈమె రచన సరళశైలిలో, పాఠకుల హృదయాలకు హత్తుకొనేరీతిలో సాగుతుంది.

పెండ్లి ఏర్పాట్లు

పరఁగ శ్రీ పార్వతీ – భారతీ ప్రముఖ
తరుణులు పెండ్లి ము – త్తైదువుల్‌గాఁగ,

వరుసగా నందు వి – వాహ కృత్యములు
పొరిఁబొరి నా కశ్య – పుఁడు నెఱవేర్ప,

మంగళస్నానాది – మహిత కృత్యములు
సాంగంబుగాఁజేసి, – సకలోత్సవములు

నలువొప్పఁగాను పు – ణ్యాహవాచనము,
విలసిత స్నాతక, – వేద వ్రతములు

చేసి, కాశీయాత్ర – శ్రీహరి చనఁగ,
వాసిగాఁ దోయధి – వచ్చి ప్రార్థించి

'కపటనాటక! నీవు – కాశిపోనేల?
ఇపుడు నా సుతను నీ – కిచ్చెద'ననుచు

మగుడి తోడ్కొనిపోయి – మందిరమందు
జగదీశ్వరుని నిల్పె – సంప్రీతి నపుడు.



స్వామి కల్యాణం

అనుపమంబైన క – న్యావరణంబు
మునివరుల్ జరుపఁగా, – మురిసి సాగరుఁడు

పనిఁబూని భక్తితోఁ – బంకజాక్షునకు
మనము రంజిల్లఁగా – మధుపర్క మిచ్చి,

నవ్య భూషణములు, –. నవ్య వస్త్రములు,
దివ్య గంధంబులు, – దివ్యమాల్యములు

కమలాక్షునకు, రమా – కన్యకామణికిఁ
బ్రమదంబుతో సమ – ర్పణమొప్పఁ జేసి,

ఘనముగా నా రమా – కన్య నా హరికి
తన వధూయుక్తుఁడై – దానంబు చేసె.

కరమొప్ప నా రమా – కన్యకామణినిఁ

గరుణించి హరి కర – గ్రహణంబు చేసి,

నిరుపమంబగు దర – నిభకంఠమందు
సురుచిరమంగళ – సూత్రంబుఁ గట్టె;

సరసతమీఱ శ్రీ – సతిశిరంబందుఁ
దఱుచైన వేడ్కతోఁ – దలంబ్రాలు వోసె;

జలజాక్షు శిరముపై – జలరాశి కన్య
పొలుపొందఁ దలంబ్రాలు – పోసె; నీరీతి

నక్షతారోపణ – మ్మైన పిమ్మటను
లక్షణవతియైన – లక్ష్మితోఁగూడ

సలలిత వేంకటా – చల వాసుఁడనఁగ
నలువొప్పు తరిగొండ – నారసింహుండు

అలరుచు లాజహో – మాదికృత్యములు
వలనొప్ప వేర్వేఱ – వరుసగా నడపె.

సారాంశం

శ్రీ వేంకటేశ్వరుని వివాహానికి పార్వతీదేవి, సరస్వతీదేవి మొదలుగాగల ముఖ్యులందరు ముత్తైదువులుగా వచ్చారు. వివాహకార్యక్రమాన్ని విధివిధానంగా కశ్యపుడు నేరవేరుస్తున్నాడు. నూతన వధూవరులు మంగళస్నానం ఆచరించారు.

శుభకార్యాలకు ముందుగా చేయాల్సిన పుణ్యాహవాచనాన్ని చేశారు. గౌరీవ్రతాన్ని చేయించారు. పెళ్ళి చేసుకోవాలనే సంకల్పంతో వధువును వెతుక్కోవటానికి కాశీకి వెళ్ళే జగదీశ్వరుణ్ణి(శ్రీహరిని) 'నీవు కాశీకి వెళ్ళకు, నా కూతురు నిస్తాన'ని చెప్పి సముద్రుడు తీసుకెళ్ళి మందిరంలో కూర్చోపెట్టాడు.

కన్య-లక్ష్మీదేవికి సంబంధించిన స్తుతిని మునులు చేస్తూండగా సముద్రుడు సంతోషించాడు. వధూవరులకు నూతన వస్త్రాలనిచ్చాడు. ఆభరణాలనిచ్చాడు. చందనగంధాన్ని, వివిధ రకాల పుష్పాలనిచ్చాడు. తన కూతురైన రమ (లక్ష్మి)ను హరి (వేంకటేశ్వరస్వామి)కి కన్యాదానం చేశాడు. పాణిగ్రహణం చేయించాడు. హరి, రమ మెడలో మంగళసూత్రాన్ని కట్టాడు.

రమాదేవి తన భర్త హరి శిరస్సుపైన, హరి తన భార్య రమాదేవి శిరస్సుపైన తలంబ్రాలు పోసుకొన్నారు. చాల ఆనందంగా ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమం తర్వాత లక్ష్మీదేవితో కలసి ఆ వేంకటేశ్వరుడు లాజహోమం లాంటి కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాడు.

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

అ) ఈ పాఠాన్ని రాగంతో పాడండి.

ఆ) నాటితో పోల్చితే నేటి పెండ్లిళ్ళలో మార్పులు చోటుచేసుకొంటున్నాయి? ఎందుకు? కారణాలు వివరించండి?

2. పాఠాన్ని చదవండి. సరైన క్రమంలో రాయండి.

అ) సురుచిర మంగళ సూత్రంబుఁగట్టె

ఆ) తన వధూయుక్తుడై దానంబు చేసె

ఇ) వలనొప్ప వేర్వేఱ - వరుసనా నడపె

ఈ) మనము రంజిల్లగా మధుపర్కమిచ్చి

ఉ) గరుణించి హరికర గ్రహణంబు చేసి

3. కింది ద్విపదను చదవండి, ప్రశ్నలకు జవాబులు రాయండి.

విని, తన పరివార వితతుల తోడ
తనరార శోభన ద్రవ్యముల్‌గొనుచు
నలువొప్ప తరిగొండ నరసింహుడైన
సలలిత వేంకటాచలనివాసునకు
హెచ్చిన భక్తితో నెదురుగా వచ్చి
యచ్చుగాఁదగు పూజలచట గావించి
అందుండి బ్రహ్మరుద్రాదులతోడ
పొందుగా హరి నాత్మపురమునకపుడు
తోడుకొనిపోయి బంధుజనంబుతోడ
విడుదులలోనుంచె వేడ్కతోనంత.

ప్రశ్నలు :

1. ఈ ద్వీపదలో పూజింపబడినవారు ఎవరు?
2. హరి వెంట ఎవరెవరు వెళ్ళారు?
3. బంధుజనాలను ఎక్కడకు తీసుకెళ్ళారు?
4. హరి పూజకు ఏం తీసుకెళ్ళారు?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబు రాయండి.

అ) మీరు చూసిన వివాహఘట్టాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

2. కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా ప్రశంసాత్మకంగా జవాబు రాయండి.

అ) ఈ పాఠం ద్విపదలో ఉందికదా! ఈ పాఠ్యాంశ భావాన్ని తీసుకొని కథా రూపంలో రాయండి.

ఆ) పెళ్ళిళ్ళ సంస్కృతి ఎందుకు గొప్పదో తెలుపుతూ వివాహ-సంస్కృతిని ప్రశంసిస్తూ వ్యాసం రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది ప్రకృతి వికృతులను జతపరచండి.

అ)	శ్రీ	( )	i) బత్తి
ఆ)	రాశి	( )	ii) సిరి
ఇ)	భక్తి	( )	iii) కన్నె / కన్నియ
ఈ)	కన్య	( )	iv) రాసి

2. కింది వాక్యాల్లోని గీతగీసిన పదాలకు అర్థాలను రాసి సొంతవాక్యాల్లో రాయండి.

అ) స్త్రీలకు ఆభరణాలు అంటే చాలా ఇష్టం.

ఆ) మేమంతా ప్రమదంతో విహారయాత్రకు వెళ్ళాం.

ఇ) భోజనం చేసిన వెంటనే కరములను చక్కగా కడుక్కోవాలి.

ఈ) ప్రాలు ఉడికితే అన్నం అవుతుంది.

ఉ) హరి సతి పేరు రమ.

వ్యాకరణాంశాలు

1. కింది పదాల్లోని గుణసంధి, త్రికసంధి పదాలను గుర్తించి, విడదీసి రాయండి.

అ) ఇచ్చోట　　ఆ) సకలోత్సవములు　　ఇ) మహోన్నతుడు

ఈ) పురుషోత్తముడు　　ఉ) ఎవ్వారు　　ఊ) మహేంద్ర

ఋ) అగ్గజేంద్రము　　ౠ) మహర్షి

2. కింది వృత్యను ప్రాసాలంకార వాక్యాలను గుర్తించి రాయండి.

అ) నల్ల పిల్లి మెల్లగా బల్లకిందికి వెళ్ళి చల్లని చల్ల త్రాగింది.

ఆ) వారు వీరే వీరు రారే రాకపోరే.

ఇ) కుర్రవాడు గుర్రంమీద ఎక్కి విర్రవీగుతుండగా జర్రున జారి కిందపడెను.

ఈ) అతల వితల సుతల మహాతల రసాతల తలాతల పాతాళ లోకాలున్నాయట.

3. ఛందస్సు

హ్రస్వాక్షరాలు లఘువు (**I**) లని

దీర్ఘాక్షరాలు గురువు (**U**)లని చదువుకున్నారు కదా!

వీటి సహాయంతో గణాలు ఎలా ఏర్పడుతాయో తెలుసుకుందాం.

గణం అంటే సముదాయం, గుంపు మొదలైన అర్థాలున్నాయి.

ప్రస్తుతానికి అక్షరాల సముదాయం, లేదా అక్షరాల గుంపునే గణం అని అందాం. ఒక్కో గణంలో రెండుకుపైబడిన అక్షరాలు ఉంటాయి. ఇప్పుడు రెండక్షరాలతో ఏర్పడే గణాన్ని, మూడక్షరాలతో ఏర్పడే గణాల గురించి చూద్దాం!

లఘువు గురువులను అక్షరాలపైన గుర్తించాలి. అలా గుర్తించిన గణాలకున్న ప్రత్యేకమైన పేర్లను గుర్తుంచుకోవాలి. అవేంటో ఒకసారి చూడండి.

I U	U I	I U
మదిన్	రమా	ధనం

ఇవి రెండక్షర గణాలే. వీటిలో **I U** మాత్రమే ఉన్నాయి.

ఇలా **I U** మాత్రమే ఉండే రెండక్షరాల గణానికి 'వ' గణం అని పేరు. (దీనినే లగం అని అంటాం)

ఇక మూడక్షర గణాలను చూద్దాం.

U I I
సారము

U I I
వారధి　　వీటిలో మొదటి అక్షరం గురువుగాను మిగిలిన రెండు లఘువులుగాను ఉన్నాయి. దీనిని 'భ'గణం అని అంటాం.

వివిధ గణాలకు సంబంధించిన కింది పట్టికను పరిశీలించండి.

గణము	గణరూపం	గురులఘువివరణ	గణంపేరు
U I I సారము	U I I	మొదటిఅక్షరం గురువు చివరి రెండు లఘువులు	'భ' గణం
I U I తలారి	I U I	మధ్యాక్షరం గురువు చివరి రెండు లఘువులు	'జ' గణం
I I U శరభం	I I U	అంత్యాక్షరం గురువు మొదటి రెండు లఘువులు చివర గురువు	'స' గణం
I U U సదంశం	I U U	మొదటి అక్షరం లఘువు చివరి రెండు గురువులు	'య' గణం
U I U దాక్షిణం	U I U	మధ్యాక్షరం లఘువు తొలి, చివరి అక్షరాలు గురువులు	'ర' గణం
U U I మాయావి	U U I	చివరి అక్షరం లఘువు మొదటి రెండు అక్షరాలు గురువులు	'త' గణం
I I I వనము	I I I	మూడు అక్షారాలూ లఘువులే	'న' గణం
U U U వీరంతా	U U U	మూడు అక్షరాలూ గురువులే	'మ' గణం

భ – జ – స లు గురువు మార్పును సూచించే గణాలు.

య – ర – త లు లఘువు మార్పును సూచించే గణాలు.

'న' గణం గురువు లేని గణం 'మ' గణం లఘువులేని గణం.

కింది పదాలకు గురులఘువులు గుర్తించి, అవి ఏ గణాలో రాయండి.

కందులు, మాయావి, జలజ, అఖిలం, వారేరీ, తక్షణం, సురూపం, కలాపి

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- మీ కుటుంబాల్లో జరిగే పెళ్ళి విధానాన్ని మీ పెద్దలద్వారా తెలుసుకొని రాయండి.

సూక్తి

భారతీయ వివాహ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం.
"భారతీయ సంస్కృతి సంప్రదాయలకు ముగ్ధుడుకాని
విదేశీయుడు లేడంటే అతిశయోక్తి లేదు.

6 పిసినారి

– కాళ్ళకూరి నారాయణ రావు

చదవండి – ఆలోచించండి – చెప్పండి

గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యంలో సంచలనం సృష్టించింది. ఆనాటి సమాజంలో నెలకొన్న కన్యాశుల్కమనే దురాచారాన్ని రూపుమాపడానికి ఈ నాటకం ఎంతగానో తోడ్పడింది. 'కళ కళ కోసమే' కాదని దానికొక సాంఘిక ప్రయోజనం, బాధ్యత ఉందని కన్యాశుల్కం నిరూపించింది.

ప్రశ్నలు

1. పై పేరా దేని గురించి చెబుతుంది?
2. పై పేరాలోని ప్రధానవిషయం ఏమిటి?
3. అలాంటి సాంఘిక ప్రయోజనం కలిగించిన నాటకం మరొకటి మీకు తెలుసా?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

నాటకం శక్తివంతమైన కళా ప్రక్రియ సామాన్య జనులలో ఒక విషయాన్ని గురించి అవగాహన కలిగించడానికి నాటకం మంచి ప్రసార సాధనం. రచయితలు ఆనాటి కాలంలో వ్యాపించియున్న దురాచారాలను రూపుమాపి సంఘసంస్కారం కోసం నాటకాలను రచించారు. కాళ్ళకూరి నారాయణరావు గారు వరకట్న దురాచారాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో వారు రాసిన 'పరవిక్రయం' నాటకం అమిత ప్రజాదరణను పొందింది. ఈ గొప్ప నాటకంలోని ఒక చిన్న భాగాన్ని పరిచయం చేస్తూ నాటకాలపై అభిరుచిని పెంపొందింపజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

పాఠ్యభాగ వివరాలు

"కావ్యేషు నాటకం రమ్యమ్" అని ప్రసిద్ధి చెందిన ప్రక్రియ నాటకం. పాత్రధారులు తగిన ఆహార్యంతో రంగస్థలంపై ప్రదర్శించే కళ ఇది. నాటకంలోని భాగాలను "అంకాలు" అంటారు. పౌరాణికకథలను, చారిత్రక గాథలను, సామాజిక అంశాలను నాటకాలుగా ప్రదర్శించవచ్చు.

1920 నాటికి వరకట్నం అనే దురాచారం సమాజంలో గడ్డుసమస్యగా పరిణమించింది. ఆడపిల్లలకు పెళ్ళిచేయడం తల్లిదండ్రులకు పెద్దభారంగా మారిపోయింది. ఈ సత్యాన్ని గ్రహించిన కాళ్ళకూరివారు వరవిక్రయం (1923) రచించి ఈ సమస్యను అన్ని కోణాల నుండి చర్చించారు. ఈ నాటకంలో పెండ్లికొడుకు తండ్రి సింగరాజు లింగరాజుకు కట్నంపైగల అత్యాశను, పిసినారితనాన్ని కళ్ళకుగట్టినట్లు వర్ణించిన తీరు ఈ పాఠ్యాంశంలో కనిపిస్తుంది.

విద్యార్థులకు సూచనలు

- *పాఠం చదవండి – అర్థంకాని పదాల కింద గీతగీయండి.*
- *వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెల్సుకోండి.*

కవి పరిచయం

శ్రీ కాళ్ళకూరి నారాయణరావు 1871 ఏప్రిల్ 28వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా మచ్చపురిలో జన్మించారు. సమాజంలో నెలకొన్న మూఢాచారాలపై, దుష్ట సంప్రదాయాలపై పోరాటం చేశారు. అందుకు రచనను ఆయుధంగా స్వీకరించారు. వేశ్యావృత్తి, వరకట్నం, మద్యపానం అనే దురాచారాలు రూపుమాపడానికి చింతామణి, వరవిక్రయం, మధుసేవ నాటకాలను రచించారు. వీరు బహుగ్రంథకర్త. నవలలు, కథలు, విమర్శ గ్రంథాలు మొదలగునవి వెలువరించారు. వీరి ఆదర్శం రచనల్లోనేగాక నిజజీవితంలోనూ ఆచరించి చూపారు. జగద్గురు శంకరాచార్యులు వీరిని "మహాకవి" బిరుదంతో సత్కరించారు.

పాత్రలు

లింగరాజు – పెంపుడు తండ్రి

బసవరాజు – పెండ్లికుమారుడు

ఘంటయ్య – వంటమనిషి

పెళ్ళిళ్ళ పేరయ్య

(ప్రవేశము : లింగరాజు గారి వ్యాపారపు గది)

లింగరాజు (ఆయాసముతోఁ బ్రవేశించే) ఇస్! అబ్బా!

చ. పిడుకలు వంటకట్టెలును, బీటలు, చేటలు, లెక్కచూచి, యే
ర్పడ, పోయి బొగ్గులం గొలిచి, పాదుల కాయల నెంచి, దూడపా
ల్విడిచిన దాఁక నిల్వఁబడి; వాకిటి కొబ్బరిచెట్ల కాయలన్
గడన మొనర్చి : యిప్పటికిఁ గాలిడఁ గల్గితి నింటి లోపలన్.

ఇఁక స్థిమితముగా గూరుచుండి. యీఁ పూటతో గాల దోషము పట్టు కాగితము లేమయినఁగలవేమో చూడవలెను. వాయిదా నోటీసులు వ్రాయవలెను. ఈ పూట, కోర్టులో హీరింగు లేమున్నవో చూడవలెను. దేనిపట్ల రవంత యేమఱినను దెబ్బతినక తప్పదు! పని వచ్చినచో ప్రాణములనైనఁ బోనీయఁదగును గాని పయిన సొమ్ము పోనీయఁగూడదు! ప్రాణములలో నేమున్నది? గాలియేగా! పైకమట్టిదా! ప్రపంచ మంతయు దానిలో నున్నది! కనుకనే, "ధనమూల మిదం జగ"త్తన్నాడు.



సీ. కులలోప, గుణలోపములు మాపుకొనుటకు
ధనము ప్రధాన సాధనము నేఁడు
వరకట్నములకు సభాకట్నములకును
ధనము ప్రధాన సాధనము నేఁడు
మున్సిపల్, లోకలు బోర్డున్ యెన్నికలకు
ధనము ప్రధాన సాధనము నేఁడు
మడులు మాన్యములుఁ గొంపలు వచ్చిపడుటకు
ధనము ప్రధాన సాధనము నేఁడు

అట్టి ధనమును దన పాడు పొట్ట కొఱకొ,
బట్ట కొఱకో, లంక పొగాకు చుట్ట కొఱకొ,
వెనుక ముందులు చూడక వెచ్చ పెట్టు
వారు నిజముగ మతిలేని వారు కారె!


భాగ్యము పెరుఁగుటకు బహుప్రజ్ఞలు కావలెను.

సీ. తలలు మాఱిచియొ, మూటలు విప్పియో,కొల్ల
గొట్టియో సిరి కూడఁబెట్టవలయు
ఆస్తులనెల్ల భార్యల పేర వ్రాయించి
మాయ దివాలాలు తీయవలయు
వడ్డీకి వడ్డి, యా వడ్డీకిఁ బై వడ్డి
పెంచి గిజా యనిపించవలయు
రాత్రులు మేల్కొని రామకీర్తనలను
పాడుచు గొంపఁ గాపాడవలయు

అప్పుగొన్నవారి యాస్తులెల్లను వచ్చి
పడెడుదనుక నిద్ర విడువవలయు
దొంగ లెక్కలుంచి దొరల కంటను దుమ్ము
గొట్టి పన్ను మాన్పు కొనగవలయు

పెక్కు మాటలేల.....

సీ. పరువుఁ, బ్రతిష్ఠయు, బాటింపగారాదు
పొట్టకేమియుఁ గర్చుపెట్టరాదు
బంధువు లేతేరఁ బల్కరింపఁగ రాదు
వేఱు విస్తరి యింట వేయరాదు
కష్టజీవులఁజూచి కటకటపడరాదు
త్రిప్పక తన యప్పు తీర్పరాదు
దారకేనియు పెట్టె తాళ మీయగరాదు
వేయి కల్లలకేని వెఱవరాదు



ఇన్ని విధముల గాపాడుకున్న ధనము
దక్కనేరదు! ధనముచేఁ దక్క నింటఁ
బెత్తనము లేదు! బయటను బేరు లేదు.
పలుకుబడి లేదు! బ్రతికిన ఫలము లేదు.

వెఱ్ఱి వెంకటాయలు? పత్రికలన్నియుఁబరిశోధన లనియుఁ సంఘ సంస్కరణము లనియు, సహాయ నిరాకరణ ములనియు, స్వరాజ్యమనియు, చట్ట బండలనియు, పనిలేని గొడవలు పయిఁబెట్టుకొందురు. కాని వడ్డీలు పెరుగుటకు వాటమైన సాధన మొక్కరును జూడరు?

ఆ. కలుపు పెరుగునట్లు; కంచెలుం బాదులు
పెరుగునట్లు నాచు పెరుఁగునట్లు!
వడ్డి పెరిఁగెనేని వహ్వా! యదృష్టము
పండె ననఁగ నిండ్లు నిండిపోవె!

వాస్తవమునకు వడ్డీకి సాటియైనది మఱి యున్నదా? (అంతలో స్మృతి నభినయించి) అన్నన్నా యెన్నడూ లేని దీపూట ప్రాతఃకాల లక్ష్మీప్రార్థనము మాట పరాకు పడితిని గదా! (అని చెంపలు వైచుకొని, యినుపపెట్టె యెదుట నిలిచి చేతులు జోడించి)

దండకము : భగవతీ! భాగ్యలక్ష్మీ! ప్రణామంబు! నీ దాసదాసానుదాసుండ, నీ పాదముక్తుండ, నీ దివ్యరూపంబె నిత్యంబు భావింతు, నీ దివ్యనామంబె నిక్కంబుగా నిద్రలోఁ గూడఁజింతింతు, నా దిక్కు నా మ్రొక్కు నా యండ నా దండ నీవే సుమా! భార్యయుం, గీర్యయుం, బిడ్డలుం, గిడ్డలున్, దేవుడుం, గీవుడున్, మోక్షముం, గీక్షమున్ సర్వమున్నీవె! సత్యంబు! నీకై నిరాహారినై యుందు, నీకై నిశల్ నిద్రమాన్కొందు, నీకై శరీరాభిమానంబు వర్జింతు, నీకై యసత్య ప్రమాణంబు

లెన్నేనియున్ గావింతు నీ యాన! ఈ పెట్టెయే నీ పవిత్రాలయం, నేనె నీ యర్చకుండన్, యథార్థంబుగా నాదు ప్రాణంబులె నీదు పూజాసుమంబుల్, శరీరంబె నైవేద్య కుంభంబు, నా యింటనే యుండి, నా పూజలం గొంచునే యింటికి నంపినం బోయి యా యిల్లు మట్టంబు గావించి నా యింటికిం దెచ్చి నా కిచ్చు చుండంగదే కన్నతల్లీ! నమస్తే నమస్తే నమః.

ఘంటయ్య : (ప్రవేశించి) బాబూ! పది కావచ్చింది. వంట సామానిస్తారా!

లింగరాజు: నీ వంట వల్ల కాదుగాను! నీ కింత తిండియేవ యేమిరా! ధనుర్మాసము దప్పళమున కెవరైన పిలుతురేమో కాసింత సేపు కనిపెట్టఁగూడదా!

ఘంటయ్య : సరే, మీయిష్టం. రాతిరి పద్దులు రాసుకుంటారా?

లింగరాజు: అదిగో ఆ మాటన్నావు సరి! (అని డసుకుపెట్టె దగ్గఱఁగూరుచుండి పద్దుల పుస్తకము పైకిఁ దీసి) ఏది చెప్పు, బియ్యమెన్ని?

ఘంటయ్య : మణిమెడు తక్కువ మానెడు.

లింగరాజు: (వ్రాయుచు) వంటకట్టెలు?

ఘంటయ్య : మూడు.

లింగరాజు: పిడకలు?

ఘంటయ్య : రెండు.

లింగరాజు: నిప్పు పుల్ల!

ఘంటయ్య : నిన్న మధ్యాహ్నము చీల్చిన పుల్లలో నిలువ బాపతు సగము.

లింగరాజు: ఉప్పు?

ఘంటయ్య : ఉద్ధరిణెడు

లింగరాజు: చింతపండు?

ఘంటయ్య : నిన్న మధ్యాహ్నము పులుసు కోసము పిసగ్గా నిల్వఉన్న తుక్కు.

లింగరాజు: ఉట్టేమి చేసినావు?

ఘంటయ్య : వుంచా నీ పూటకు.

లింగరాజు: మిరపకాయలు?

ఘంటయ్య : మూడు.

లింగరాజు: మాగాయ?

ఘంటయ్య : అమ్మగారి కో టెంకా, అబ్బాయిగారి కో ముక్కాను.

లింగరాజు: గంజి?

ఘంటయ్య : గరిటెడు మీకు, అరగరిటెడు అబ్బాయిగారికి పోశాను.

లింగరాజు: మిగిలిందీ?

ఘంటయ్య : చద్దన్నాల్లో సరిపెట్టాను.

లింగరాజు: నీవో?

ఘంటయ్య : బజార్లోంచి బంగాళదుంపల కూర తెచ్చుకున్నాను.

లింగరాజు: ఏడిచినట్లే యున్నది. కాని యెన్నడు నీలాంటి విఁక నింటికి గొని రాకు! ఆ వాసన తగిలి అబ్బాయి కూడా పాడుకాఁగలడు. తెలిసినదా! ఇదిగో కరివేపచెట్టు మీఁద కాకి గూడు పెట్టింది. యింతలో డొంకినితో దానిని బడద్రోసి యీపూఁట పొయిలోనికి సిద్ధము చేసికో, కరివేపమండ రాలినచో కడుపు చీల్చెదను సుమా!

ఘంటయ్య : రామరామా! పక్షిగూడు పడగొట్టడం పాపం కదండీ?

లింగరాజు: పాపమేమిటి నీ బొంద! ఖరసంవత్సరంలో మా ఇంటి వంటంతయూ కాకిగూళ్ళతోనే వెళ్ళిపోయింది.


ఘంటయ్య : ఇదేమిటండీ! ఇంత ఘోరమెక్కడా చూళ్ళేదు. ఇల్లాంటి పనులు మాత్రం ఇంకెప్పుడూ చెప్పకండే (నిష్క్రమించును)

లింగరాజు: దరిద్రపుఁ గుంకలకు ధర్మపన్నములు మెండు. ఆ వాజె వన్నెల విసనకఱ్ఱ యగుటం బట్టి వంటకుంకలను బెట్టుకొనక వల్లపడకున్నది. కుర్రవానికి వివాహమై, యా కుర్రది కాఁపురమునకు వచ్చువఱకు నీకుంకకుద్వాసన చెప్పుటకు వీలు లేదు.

బసవరాజు : (ప్రవేశించి) నాన్నా! అమ్మకు మొన్న బండికట్టినవాడు అద్దెకొఱకు వచ్చి యఱచుచున్నాడు.

లింగరాజు : ఇంటిలో లేరని చెప్పకపోతివా? బాబూ! పదునాఱేండ్లు పయింపడినవి ఇప్పటికైనా నీకీపాటి యూహ పుట్టలేదేమిరా?

బసవరాజు : ఉండగా లేరని చెప్పుట కూహ యెందులకు నాన్నా? అబద్ధమాడఁగూడదని మా టీచర్లనేక పర్యాయములు చెప్పినారు.



లింగరాజు: మీ టీచర్లట్టి మెట్ట వేదాంతములు కూడాఁ జెప్పుచున్నారుగా సరే, యిక నేమి చదువు సంగతి చక్కగానే యున్నది!

బసవరాజు : ఫవుంటెను పెన్నుకుఁ బయిక మిచ్చెదవా?

లింగరాజు : బాబూ! కానీకిఁగలము వచ్చుచుండగా ఫవుంటెను పెన్ను యెందులకు పనిలేక? అంతగా మనసైనచో అలుకపాన్పు మీద అన్నిటితో పాటు ఫవుంటెను పెన్ను గూడా నత్తవారినడిగి పుచ్చుకొనవచ్చును. గాని బండివానికేదో చెప్పి పంపివేయుడు.

బసవరాజు : అది మాత్రము నావల్లకాదు! (అని నిష్క్రమించును.)

లింగరాజు : ఆ వన్నెల విసనకఱ్ఱ సంగతి యీ విధముగా నున్నది. యీ! పాడకట్టె సంగతి యీ విధంగా నున్నది! పాడు టీచర్లు కుఱ్ఱవాండ్రను పాడుచేయు చున్నారు! పయిగా కలము క్రిందను, కాగితముల క్రిందను కర్చుపడుచున్న డబ్బునకు లెక్కయే లేదు! వివాహ మగువరకును వీనిని మాన్పించుటకు వీలులేక చూచుచున్నాను. ఇదేమి ప్రారబ్దమో యీ దినములలో కాలేజీకి వెళ్లుచున్నవానికి గాని కట్నముల బిగువు లేకున్నది! ఈ కసుగాయ కుంకను కట్నముల కొఱకు గాకఁ గతుకుల కొఱకుఁబెంచు చున్నానా! నా మొదటి పెండ్లికి రెండు వేలు, రెండవ పెండ్లికి నాల్గువేలు, మూడవ పెండ్లి కెనిమిదివేలు, మొత్తము పదునాలుగువేలు వచ్చినవి. ఈ కుంకకుం గూడ నిదేవిధముగా వచ్చుననియాశ. ఇదేమిపాపమో ఇంతవరకు వేయి, రెండు వేలు ఇచ్చెదమనెడివారే కాని, పట్టుమని పదివేలీయగలవారగపడలేదు! నియోగ మంత కంతకు నిర్భాగ్యయోగ మయి పోవుచున్నది! ఎవరు చెపుమా వచ్చుచున్నది! చవట కుంక తలుపు దీసి చక్కబోయినాడు కావలయును! బండివాడో పరదేశ బ్రహ్మణుడో యైయుండును. కానిమ్ము, గది తలుపు మూసి యేమియు నెత్తికొనిపోకుండ కంతల గుఁడాఁగని పెట్టెదను. (అని లేచును)

పేరయ్య : (అంతలో ప్రవేశించి) మహదైశ్వర్యాభివృద్ధిరస్తు! మనో వాంఛా ఫల సిద్ధిరస్తు! రాజద్వారే రాజ భవనే, రాజ సభే, రాజ సమీపే, సర్వదా దిగ్విజయమస్తు!

లింగరాజు: ఏమీ! పేరయ్యయే! ఏదో పనిమీద వచ్చినట్లున్నావే?

పేరయ్య : ప్రభువుల వద్దకు పనిలేన్దే రాగలమా?

లింగరాజు: అట్లయినఁ గూర్చుండి అదేమోచెప్పుము (అని కూర్చుండును)

పేరయ్య : (కూర్చుండి తనలో) వీడి దగ్గఱ ముక్కు సూటిగా పోగూడదు. ముందీదారి త్రొక్కుతాను. (పయికి) చెప్పుటకేముంది? పస్టుక్లాసును పద్దు మీద బదులు కావలసి వచ్చాను.

లింగరాజు: ఎవరికి? ఏ పాటి?

పేరయ్య : యెవరికో తర్వాత చెపుతాను, బదులు కావలసింది పాతికవేలు.

పేరయ్య : వడ్డీ యేమయిన వాటముగ వేయించగలవా?

లింగరాజు: వడ్డీకేం? వాజబీ ప్రకారం పుచ్చుకోండి.

లింగరాజు: వడ్డీకి వాజబీ యేమిటి? ఆసామిని బట్టియు, ఆస్తిని బట్టియు, అవసరమును బట్టియు నుండును. నీ తోడు, రూపాయ తొమ్మిదణాలకాని చొప్పున నిన్ననే ముప్పది వేలిచ్చాను.

పేరయ్య : అయితే కుదరదు. ముప్పావలా అంటే ముద్దు పెట్టుకొని ఇచ్చేవారున్నారు. సెలవు! (అని లేవబోవును)

లింగరాజు : ఆగు! ఆగు! తొందరపడకూడదు. ఆస్తి మాట చెప్పవేమి?

పేరయ్య : ఆస్తికేం! అవల్ రకం ఆస్తి, అరవై ఎకరాల సర్వదుంబాలాయానాం భూమీ, పదియెకరాల బత్తాయి నారింజతోట అరెకరాల అంటు మామిడితోట, తొమ్మిదెకరాల తుమ్మబీడు. ఇదే ప్రథమ తనఖా, ఇక విడుపించుకొనేది కూడా కాదు.

లింగరాజు: సరే పావలార్థణా చొప్పున పయిసలు చేయుము.

పేరయ్య : పావలార్థణా లేదు. గీవలార్థణా లేదు. నా కమీషను దగ్గర సలుపులు పెట్టకపోతే రూపాయివరకూ రుద్దుతాను.

లింగరాజు: నీ కమీషను మాటకేమి? నీవెక్కడికి బోదువు? నేనెక్కడికి బోదును? ముందు కాగితములు తెమ్ము చూతము.

పేరయ్య : కాగితాలకేం? రేపీపాటికి కాకిచేత రప్పిస్తాను. (అని లేవబోయి మరలఁ జతికిలబడి) అన్నట్లు అడగడం మరచాను. అబ్బాయికి ఇంకా వివాహము చేశారు కారు. సమయము కాకనా? సంబంధాలు రాకనా?


లింగరాజు: సంబంధాలు రాకేమి! సమాధానము చెప్పలేక చచ్చిపోవుచున్నాను. అన్నట్లు నీవు పెండ్లింట్ల బేరగాడవు గదా! నీ యెరుకలో జక్కని సంబంధమేదయినా నున్నదా?

పేరయ్య : చక్కందో గిక్కందో నాకు తెలియదు. మీకు సానుకూల పడుతుందో లేదో అంతకంటే తెలియదు. పడితే మాత్రం బంగారాని కెత్తు కెత్తయిన సంబంధం నొకటి సర్వసిద్ధంగా ఉంది.

లింగరాజు: ఎవరు వారు?

పేరయ్య : పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారికి ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తెకు పదమూడవ యేడు. ముఖం ముద్దురోడుతూంటుంది. కళ్లు చూస్తే కడుపు నిండ వలసిందే. చక్కగా చదువుతుంది.

లింగరాజు: సరేకాని కన్నకు గావలసినవి చదువు, చక్కదనము గావు.



గీ. **తిండి యొక ప్రక్క వెలితిగాఁ దినఁ గవలయు,**
చెప్పకయె యింటిపనులెల్ల జేయవలయు
ఊరికే కొట్టినను పడి యుండవలయు,
ఇట్టి కన్యను వెతికి గ్రహింపవలయు.

పేరయ్య : అలాగైతే మీరు చెప్పిన లక్షణాలన్నీ అచ్చంగా ఆ పిల్ల వద్దనే ఉన్నాయి. మూడు మెతుకులకంటె ముట్టదు. లేచింది మొదలు పరుండే వరకూ లేడి పిల్లలాగు పనిచేస్తుంది.

లింగరాజు: ఇంతకును కట్న మేపాటి యీయగలరు?

పేరయ్య : అదిగో అక్కడే ఉంది తంటా! ఆ పిల్లలిద్దరికీ వంటిని వెయ్యేసి రూపాయలు బాల తొడుగులున్నాయి. అయిదేసి వందలు వచ్చే మాతామహుడిచ్చిన మాన్యాలున్నాయి. అందువల్ల కట్నం లేకుండా చేసుకుంటామని కావలసినంతమంది కాళ్ళకాడికి వచ్చి తిరిగి పోతున్నారు.

లింగరాజు: అయితే పేరయ్యా! ఆ పిల్ల యొంటిని అచ్చంగా బంగారపు తొడుగుండుగాక, అరువది పుట్ల మాన్యముండుగాక, గౌరవము కోరువాఁ డెవ్వఁడైనఁ గట్నం లేని సంబంధముల కిష్టపడునా?

పేరయ్య : అలాగైతే, గౌరవార్థమని మెడలు విరిచే కాస్తో కూస్తో ఇచ్చేలాగు చూడాలి, ఏ మాత్రం అనమంటారు.

లింగరాజు: అసలు ఆయనకున్న ఆస్తియేమో చెప్పినావు కావు.

పేరయ్య : ఆయనకున్న ఆస్తియేమిటో అందఱూ యెఱిగినదే. పదిసంవత్సరాలు రెవిన్యూ యినిసిపేటరు పనిచేశారన్నమాటే. కాని పయిసా పుచ్చుకొని యెరుగరు. మధ్య నానుకోపరేషాన్ని నమ్మి ఆ వుద్యోగానికీ కూడ హస్తోదకాలిచ్చి హాయిగా రాట్నం ముందు పెట్టుకొని కూర్చున్నాడు. అయితే పిత్రీయం బాపతు పదియెకరాల భూముంది. పన్నులు పోగా పదియెకరాల వల్లా పదిపదులు నూరుబస్తాలు వస్తాయి. వారు కాపురం వున్న మేడవుంది.

లింగరాజు: అట్లయినచో, నటువంటి పెద్ద మనుష్యులను మనమంత యిబ్బంది పెట్టుట న్యాయము కాదు. ఆ మేడవారుంచుకొని ఆ పది యెకరముల పొలమును మనకు వ్రాసి యిచ్చి అందము కొఱకు వేయిన్నూట పదహార్లు రొక్కము, వెండి చెంబు, వెండి కంచము, వెండి పావకోళ్లు, ఐదుదినములు నైదు పట్టుతాబితాలు ఇటువంటివి మాత్రమిమ్మనుము. నా భారీతనము బాగుగా నున్నదా?

పేరయ్య : బాగేమిటి బంగారం తునక లాగుంది! కాకపోతే కార్యమయిన మర్నాటి నుంచి వారు అన్నమో రామచంద్రాయని ఆ వీథిని, యీ వీథిని అడుక్కుతినవలసి మాత్రం వుంటుంది! బాబూ! మీ బేరము కుదిరే బేరము కాదు. సెలవు పుచ్చుకుంటా (అని లేవబోవును).

లింగరాజు: (రెక్క పట్టుకొని) ఆగు. ఆగఁవోయ్! అన్నిటిలో నొక్కటే తొందరా! నీ యభిప్రాయమేమిటి?

పేరయ్య : వేయిన్నూట పదహార్ల కయితే వెంటనే కుదురుస్తాను. అంతకు పయినైతే ఆ సంబంధం మీకు దక్కదు.

లింగరాజు: సరికాని ఈ పిల్లవాని క్రింద నాకెంత సొమ్మయిందో యెఱుఁగుదువా! తృప్తిగా వారివల్ల రాఁబట్టి తృణమో కణమో నా వల్ల దినవలెనే గాని నీ సొమ్మే పోయినట్లు నిగెడెదవేమి? పురుషోత్తమరావు గారు నాకంటె బూర్వపుఁజుట్టమా యేమిటి నీకు!

పేరయ్య : అలాగన్నారు గనుక అసలు సంగతి మనవి చేస్తాను. వినండి. ఆయన కట్నంలేని సంబంధం ఖాయం చెయ్యాలని ఆలోచిస్తున్నారు. నా బలవంతం మీద మహాపెడితే రెండు వేల కంటె పెట్టరు. అందుచేత మనం

కొంచెం మాఱు త్రోవ తొక్కాలి. ఆయనతో కట్నం మాటేమి కచ్చితముగా చెప్పక మంచిరోజు చూచి మాట్లాడే నిమిత్తం మన యింటికి తీసుకువస్తాను. సరిగా ఆ సమయానికీ వివాహాల వీరయ్యగాడువచ్చి, వేలంపాటలోకి దించేలాగు ఏర్పాటు చేస్తాను. ఆ పాటలో పంతులుగారి కావేశం యెక్కించి, మూడువేల వరకు పాడిస్తాను. నాకే మిస్తారో సెలవివ్వండి!

లింగరాజు: ముష్టి మూడువేల కోస మిన్ని ముచ్చటలా! ఆ మూడు వేలలోనే నీ ముడుపా! చాలు చాలు! అధమపక్షమైదువేలయినా లేకున్నా మనకా సంబంధ మక్కఱలేదు.

పేరయ్య : అబ్బ! లింగంరాజు గారూ! అసాధ్యులు గదా! సరే చచ్చో ముతమారో అయిదువేలూ అనిపిస్తాననుకోండి అందులో, అయిదువందలు నావి, మిగతావి మీవి, ఇష్టమేనా?

లింగరాజు: అదిగో అదే పనికిరాదు! అందులో అఱకాని బొత్తికాఁగూడదు. నీ యైదువందలు నీవు పయిగా రాబట్టుకొనవలసినదే.

పేరయ్య : సరే, నా తంటాలు నేనే పడతాను. వీరయ్యగాణ్ణి పంపుతాను. గాని వాడూ మీరూ ముందు కాస్త కూడబలుక్కోండి. పని జరిగాక వాడికి పదిరూపాయలు మాత్రం పారవెయ్యండి.

లింగరాజు: దానికేమీ! తరువాత నీవో నేనో లేదనిపింతము లెమ్ము.

పేరయ్య : అన్నట్లు ఆభరణాల సంగతి చెప్పారు కారు. ఆభరణాల మాట చెవిని పడితేనే గాని ఆడుంగులకు వేడే పుట్టదు.

లింగరాజు: వెఱ్ఱివాడా! మా పిల్లలకు మేము వెలితి చేసుకుందుమా? అప్పు డడావడి పడవలసివచ్చునని అయిదువేల రూపాయల నగలు చేయించి సిద్ధముగా నుంచినాను.

పేరయ్య : సరే యింకేమి! నాకిప్పటికి శలవు. (అని లేచి నిష్క్రమించును.)

లింగరాజు: అన్ని విధములచేత నీబేర మనుకూలమయినదే. పది యెకరముల భూమియుఁ బదివేలు, బాలతొడుగు వేయి, కట్నము అయిదువేలు, మొత్తము పదునారు వేలు! లాంఛనము లనియు, గీంఛనము లనియు లాగుట కింకను లక్ష్యమార్గములున్నవి. ఆ మీఁద నలుకపాన్పున్నది. ఆ వెనుక నాషాఢపట్టీ యున్నది.

గీ. స్వామి కృపచేత నిది కొనసాగెనేని
లాటరీలోనఁబలె మంచి లాటువచ్చు;
ఇంటి పనులెల్ల నేర్చిన గుంట కాన
వెంటనే వంటవానిని గెంటవచ్చు.

(తెరపడును)

ఇది ద్వితీయాంకం

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. అ) లింగరాజు వంటి అత్యాశపరులు మీకెవరైనా తెలుసా? పిసినారుల వల్ల ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వివరించండి.

ఆ) లింగరాజు యినుపపెట్టె ఎదుట నిలిచి లక్ష్మీదేవిని ప్రార్థించిన విధానం రాయండి.

2. పాఠ్యాంశం ఆధారంగా ఈ కింది వాక్యాలు ఎవరు ఎవరితో ఏ సందర్భంలో అన్నారో రాయండి.

అ) కనుకనే, "ధనమూల మిదం జగత్త"న్నాడు.

ఆ) రామరామా! పక్షిగూడు పడగొట్టడం పాపం కదండీ?

ఇ) బాబూ! మీ బేరము కుదిరే బేరము కాదు.

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) లింగరాజు తన పద్దుల పుస్తకంలో రాసిన వంటసామాన్ల వివరాలు రాయండి.

ఆ) లింగరాజు తన కొడుకు చేసుకునే కన్యకు ఉండవలసిన లక్షణాలను ఏ విధంగా వర్ణించాడు?

ఇ) లింగరాజు ఏ విధమైన బేరమునకు సానుకూలత వ్యక్తం చేసినాడు?

4. కింది గద్యం చదివి ప్రశ్నలకు జవాబులివ్వండి.

బ్రహ్మశ్రీ పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారికి సింగరాజు లింగరాజు వ్రాసియిచ్చిన రసీదు. మీ కుమార్తె చిరంజీవి సౌభాగ్యవతి కాళిందిని నా కుమారుడు చిరంజీవి బసవరాజునకు చేసికొనుటకు, అందులకై మీరు మారు కట్నము క్రింద నైదువేలు యైదు వందల రూపాయల రొక్కము, రవ్వల యుంగరము, వెండి చెంబులు, వెండి కంచము, వెండి పావకోళ్ళు, పట్టుతాబితాలు, వియ్యపురాలు వియ్యంకుల లాంఛనములు యథావిధిగా నిచ్చుటకును, ప్రతిపూట బెండ్లి వారిని బ్యాండుతోఁ బిలుచుటకును రాకపోకలకు బండ్లు, రాత్రులు దివిటీలు నేర్పాటు చేయుటకును, రెండుసారులు పిండివంటలతో భోజనములు, మూడుసారులు కాఫీ, సోడా, యుప్మా, యిడ్డెను, దోసె, రవ్వలడ్డు, కాజా, మైసూరుపాకాలతో ఫలహారములు చొప్పున మా యిష్టానుసారమైదు దినములు మమ్ము గౌరవించుటకును అంపకాలనాడు మాకు పట్టుబట్టలు, మాతో వచ్చువారికి కుప్పాడ బట్టలు నిచ్చుటకును నిర్ణయించుకొని బయానా క్రింద పదిరూపాయిలిచ్చినారు గనుక ముట్టినవి.

ప్రశ్నలు :

అ) లింగరాజు తన కొడుకు బసవరాజు పెళ్ళికి ఎంత కట్నం తీసుకున్నాడు?

ఆ) మగపెండ్లి వారికి ప్రతిపూట ఏ విధంగా మర్యాదలు చేయాలనే ఒప్పందం కుదిరింది?

ఇ) అంపకాలనాడు తమకు ఏం ఇవ్వాలని సింగరాజు కోరాడు?

ఈ) బయానా కింద సింగరాజుకు ఎంత ముట్టింది?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. ఈ కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) "ధనమూలం మిదం జగత్" అనే మాటలోని వాస్తవం ఎంత? చర్చించండి.

ఆ) అమితమైన ధనాశ కలవారి దురాలోచనలు ఎలా ఉంటాయి?

ఇ) వరకట్నం విషయంలో తల్లిదండ్రులు ఎలా ఆలోచిస్తారో రాయండి.

2. కింది ప్రశ్నలకు పది వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) వరవిక్రయం నాటకంలోని లింగరాజు స్వభావాన్ని వర్ణించండి.

ఆ) వరకట్న దురాచార నిర్మూలన కోరుతూ ప్రజలలో ఆలోచనలు రేకెత్తించి చైతన్యపరిచేలా ఒక కరపత్రం తయారుచేయండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) వరవిక్రయం పాఠ్యభాగాన్ని మీ పాఠశాల వార్షికోత్సవంనాడు నాటకంగా ప్రదర్శించండి.

ఆ) వరకట్న దురాచారాన్ని రూపుమాపిన సంఘ సంస్కర్తల్లో మీకు తెలిసిన ఎవరైనా ఒకరిని అభినందిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాల అర్థాలను పదపట్టిక ఆధారంగా రాయండి.

అ) నీకై నిరాహారినై యుందు (_____)

ఆ) ఉద్వాసన చెప్పుటకు వీలులేదు (_____)

ఇ) బండివాడో పరదేశ బ్రాహ్మణుడో యై యుండును (_____)

ఈ) తృణమో కణమో నావల్ల దినవలెనేగాన (_____)

2. గీత గీసిన పదానికి సరైన ప్రకృతి/వికృతిని పాఠంలోంచి గుర్తించండి.

అ) ఈ రోజు రాత్రికి నేను ఊరికి వెళ్తున్నాను.

ఆ) ఆ కన్నియకు పెళ్ళిసంబంధాలు చూస్తున్నారు.

3. గీత గీసిన కింది పదాలకు పర్యాయపదాలను పదపట్టిక ఆధారంగా రాయండి.

అ) మనో వాంఛా ఫల సిద్ధిరస్తు!

ఆ) అలకపాన్పు మీద అన్నింటితోపాటు ఫవుంటెను పెన్ను అడగాలి.

వ్యాకరణాంశాలు

1. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి అవి ఏ సమాసాలో గుర్తించండి.

అ) నా యిల్లు ఆ) బంగారం తునక ఇ) వేలంపాట

అవ్యయీభావ సమాసం

2. కింది సమాసపదాలను, విగ్రహవాక్యాలను గమనించండి.

యథాశక్తి	–	శక్తిననుసరించి
ప్రతిదినము	–	దినము దినము
ఆపాదమస్తకం	–	పాదం నుండి మస్తకం వరకు

పై సమాసపదాల్లో శక్తి అనే పదానికి ముందు 'యథా', దినమునకు ముందు 'ప్రతి', పాదమస్తకానికి ముందు 'ఆ' వచ్చాయి కదా. వీటిని (యథా, ప్రతి, ఆ) 'అవ్యయాలు' అంటారు. లింగము, వచనము, విభక్తి లేనివి అవ్యయాలు. పై ఉదాహరణల్లో 'అవ్యయాలు పూర్వపదాలుగా' వచ్చాయి. ఇలా రావడాన్ని 'అవ్యయీభావసమాసం' అంటారు. ఇది పూర్వ పద అర్థమే ప్రధానంగా కలది. ఇప్పుడు మనం సూత్రీకరించుకుంటే 'అవ్యయం పూర్వపదంగా కలది అవ్యయీభావసమాసం'.

♦ **కింది సమాసపదములకు విగ్రహవాక్యాలను రాయండి.**

అ) మధ్యాహ్నం ఆ) ఆసేతుశీతాచలం

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ వరకట్న దురాచారాలపై దినపత్రికలలో వచ్చిన వార్తలను సేకరించండి. వీటి ఆధారంగా ఒక నివేదికను తయారుచేసి ప్రదర్శించండి.

సూక్తి

లోభియొక్క బ్రతుకు కుక్కతోకవలె నిరుపయోగమైనది సుమా!
ఎట్లనగా కుక్కతోక సిగ్గును దాచుటకూ పనికిరాదు. ఈగలను
త్రోలుటకూ ఉపయోగపడదు. అట్లే లోభిధనం తనకుగాని,
పరులకుగాని ఉపయోగపడదు. – వేమనపద్యభాగం

7 మనిషీ ! మనిషీ !

– ఇస్మాయిల్

చదవండి – ఆలోచించండి – చెప్పండి

ఆధునిక కాలంలో మనిషి అవసరాలకు, సౌకర్యాలకు అనుగుణంగా అనేక వస్తువులు మార్కెట్‌లో ఊరిస్తున్నాయి. మనిషి వాటిని సమకూర్చుకుని విలాసవంతంగా బతకాలని నిరంతరం ప్రయత్నం చేస్తున్నాడు. ఆ ప్రయత్నంలో భాగంగా జీవితాన్ని ఒక పరుగుపందెంగా మార్చుకున్నాడు. ఈ పరుగులో ప్రకృతిని ఆస్వాదించడం సాటిమనిషితో స్నేహభావంతో మెలగడం మరచిపోయాడు. మనుషులమధ్య దూరం పెరిగిపోయింది. ఆ దూరాన్ని తొలగిస్తూ జీవితాన్ని ఆస్వాదించాలనే జీవనసత్యాన్ని కవితాత్మకంగా చెపుతారు కవులు.

ప్రశ్నలు

1. పై పేరాలోని ప్రాధాన్యాంశం ఏమిటి?
2. నేటి మనిషి ఏ విధంగా బతుకుతున్నాడు?
3. మనిషి కోసం కవి ఏవిధంగా తపనపడతాడు?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

సరళమైన పదాలతో, ప్రకృతిలో మనకు తెలిసిన విషయాలతో ఉపమానాలతో, మనుషులకు సందేశమిస్తుందీ కవిత. మనుషుల మధ్య మానవీయ సంబంధాలను పెంపొందింపజేయడం, సాటి మనుషుల పట్ల అనుకూల దృక్పథాన్ని, అవగాహనకు కల్గించడమే ఈ పాఠం ఉద్దేశం.

పాఠ్యభాగ వివరాలు


వచన కవితను ఆంగ్లంలో 'FreeVerse' అంటారు. ఫ్రీవర్స్ అనగా స్వేచ్ఛా కవిత్వం. పద్యగేయాల్లో ఉండే ఛందస్సు, మాత్రాగణాలు లేకుండా వాక్యం కిందవాక్యం భావయుక్తంగా, వ్యావహారిక భాషలో రాసే విధానాన్ని వచనకవితగా పిలుస్తున్నాం.

విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని అర్థం తెలియని పదాలకు అర్థాలను పదపట్టికలో వెదకండి, మీమిత్రులతో చర్చించండి. ఇంకా తెలియని అర్థాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠంలోని బొమ్మల ఆధారంగా పాఠం కవిత భావాన్ని ఊహించండి.

కవి పరిచయం

1928న తూర్పుగోదావరి జిల్లాలో జన్మించిన ఇస్మాయిల్ అనుభూతివాద కవులలో ప్రసిద్ధుడు. తత్వశాస్త్ర అధ్యాపకుడిగా కాకినాడ కళాశాలలో పనిచేశారు. చిలుకలువాలిన చెట్టు, మృత్యువృక్షం, రాత్రివచ్చిన రహస్యపువాన, చెట్టు నా ఆదర్శం అనే కవితా సంపుటాలు వెలువరించారు. 'చెట్టుకవి'గా సహృదయులచేత పిలుచుకోబడ్డాడు. సరళమైన పదాలలో సంక్షిప్తమైన శైలితో సున్నితమైన భావాలతో ఆధునిక కవిత్వంలో శాశ్వతస్థానాన్ని పొందారు. 2003 నవంబర్ 25న పరమపదించారు.



I

మనిషీ మనిషీ,
ఎత్తుగా ఆకాశంలో
ఎగిరే డేగని చూడు
సరిహద్దుల్లేవు దానికి
గిరిగీసుకుని కూచోదు
భూచక్రాన్ని గుండ్రంగా
చుంచుకాగ్రంపై తిప్పుతుంది
స్ఫుటంగా తీక్షణంగా వీక్షించే
సూర్యనేత్రం దాని ఆదర్శం.

మనిషీ మనిషీ,
పిట్టలకు ఎగరటం నేర్పిన
చెట్టుని చూడు
ఏ భాషలో పుష్పిస్తుందది?

II

మనిషీ మనిషీ,
వరిమళ్ళల్లో ఈదే
చిరు ఆకాశాల్నీ చిట్టిపరిగల్నీ చూడు
ఆనందపు రంగులు
చైనా వియత్నాం జపాన్ పొలాల్లో
ఎక్కడైనా
అవే కద,

మనిషీ మనిషీ,
ఉప్పు ఏ భాషలోనైనా
ఉప్పగానే ఉంటుంది.

సారాంశం

ఓ మనిషీ! ఎటువంటి సరిహద్దులేని ఆకాశంలో ఎత్తుగా ఎగిరే డేగను చూడు. అది ఎక్కడికైనా స్వేచ్ఛగా ప్రయాణిస్తుంది. నేనిక్కడివరకు మాత్రమే ఎగిరివస్తాననే నియమం పెట్టుకోదు.

భూమిని చక్రంలా గుండ్రంగా తిప్పుతున్నట్లుగా ఆకాశం అంచుల వరకు ఎగురుతుంది. ప్రపంచానికంతా ఒకే రీతిలో వెలుగులు పంచే సూర్యుడే ఆ డేగకు ఆదర్శం! మనిషి కూడా క్రమ శిక్షణను పాటిస్తూ స్వేచ్ఛగా ఆకాశమంత సమున్నతంగా ఎదగాలి. ఎదుటివారికి సాయపడుతూ ఆదర్శంగా నిలబడాలి.

ఓ మనిషీ! పక్షుల జననానికి, నివాసానికి వేదికగా నిలబడే చెట్టు ఎన్ని పక్షులకో ఎగరడం నేర్పుతుంది. అటువంటి చెట్టు ఏ భాషాప్రాంతంలోనైనా ఒకే విధంగా పూస్తుంది. ఎటువంటి తేడాలు, భేదాలు లేకుండా పరిమళాల్ని వెదజల్లుతుంది. మనిషికూడా చెట్టులా నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలి. పువ్వులా మనిషి కుల, మత, ప్రాంత భాషాభేదాలు లేకుండా సాటిమనుషులతో సహజంగా మెలగాలి.

ఓ మనిషీ! ఆకుపచ్చని వరిమళ్ళ నీళ్ళలో ఈదుతున్నట్లుగా కనిపించే ఆకాశం, రాలిన పరిగలతో ఆహ్లాదపు ఆనందాల రంగుల్ని వెదజల్లేది. చైనా, వియత్నాం, జపాన్ దేశపు పొలాలేకాదు ఎక్కడైనా ఇవే అందాలతో మనలకు కనువిందు చేస్తాయి. మనిషీ నీవు కూడా ఆ ప్రకృతిలా ఆహ్లాదాన్ని అందించేలా బతకాలి.

ఓ మనిషీ! ఉప్పును ఏ భాషలో పలికినా ఉప్పుగానే ఉంటుంది. మరో రుచిలో ఉండదు. అలాగే ఓ మనిషీ నీవు ఏ భాషలో మాట్లాడినా మనుషులతో సుహృద్భావంతో మధురంగా మాట్లాడాలి!

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1 కింది అంశాల గురించి మాట్లాడండి.

అ) ఆకాశంలో ఎగిరే పక్షులను చూసినప్పుడు నీకు ఏమనిపిస్తుంది?

ఆ) నీకు బాగా నచ్చిన మనిషి ఎవరు? ఎందుకో వివరించండి?

2. పాఠాన్ని చదివి, కింది భావాలకు సరిపోలిన కవితా పంక్తులను గుర్తించి రాయండి.

అ) సూర్యుడు ఎందరికో ఆదర్శం _____

ఆ) పంచదార ఏ భాషలోనైనా తియ్యగానే ఉంటుంది _____

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) డేగను ఆదర్శంగా తీసుకుని కవి ఎందుకు చెప్పాడు?

ఆ) కవికి ఆనందపు రంగులు ఎక్కడ కనిపించాయి?

ఇ) చెట్టును చూపిస్తూ కవి ఏమని ప్రశ్నించాడు?

ఈ) ఇస్మాయిల్ రాసిన ఈ కవితగురించి మీ అభిప్రాయం రాయండి.

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నకు పదేసి వాక్యాల్లో రాయండి.

అ) 'మనిషీ మనిషీ' కవిత సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి?

ఆ) ఈ కవిత ఆధారంగా మనిషి ఏవిధంగా ఉండాలని నీవు భావిస్తున్నావో వివరించండి?

2. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) మనిషీ మనిషీ కవితలోని ముఖ్య విషయం ఏమిటి?

ఆ) "చెట్టు పిట్టలకు ఎగరటం నేర్పింది." అంటే మీరు ఏమి గ్రహించారు?

ఇ) సూర్యుణ్ణి ఆదర్శంగా తీసుకోవాలని కవి ఎందుకు చెప్పాడు?

3. సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) 'మనిషీ మనిషీ' కవిత సరళ పదాలతో చదవగానే అర్థమయ్యే రీతిలో ఉందికదా! అలాగే ఈ కవిత రాసిన కవి ఇస్మాయిల్‌ను ప్రశంసిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింద గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.

అ) లోకాలకు వెలుగు నిచ్చు భగవంతుడు సూర్యుడు.

ఆ) అన్ని ఇంద్రియాలలో నేత్రం ప్రధానం.

ఇ) పచ్చని చెట్టు పరిసరాలను ప్రభావితం చేస్తుంది.

ఈ) మన ప్రతిభ వినీలఆకాశంలో రెపరెపలాడాలి.

ఉ) పుష్పం యొక్క పరిమళం దాచలేము.

2. కింది వికృతి పదాలకు ప్రకృతి పదాలు పాఠంలో గుర్తించి రాయండి.

వికృతి	ప్రకృతి
బాస	-
ఆకసం	-

వ్యాకరణాంశాలు

1. కింది వాటిలో సామాన్య, సంశ్లిష్ట వాక్యాలను గుర్తించండి.

అ) వినీత్ గ్రంథాలయానికి వెళ్ళి, పుస్తకం తెచ్చాడు. _____

ఆ) అమ్మ గుడికి వెళ్ళివచ్చింది. _____

ఇ) సీతారామలక్ష్మణులు పడవనెక్కి గంగానదిని దాటారు. _____

ఈ) బాలు మైదానానికి వెళ్ళాడు. _____

2. కింది పదాలకు, పాదాలకు గణాలను గుర్తించండి.

అ) మనిషీ ఆ) ఎత్తుగా ఇ) స్ఫుటంగా ఈ) ఇస్మాయిల్

ఉ) గడనమొనర్చి యిప్పటికిఁగాలిడఁ గల్గితినింటిలోపలన్

అతిశయోక్తి అలంకారం

♦ **కింది ఉదాహరణను గమనించండి.**

' ఆ పట్టణంలోని భవనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి'.

ఇందులోని వాస్తవాన్ని చూద్దాం. భవనాలు ఎక్కడైనా ఆకాశాన్ని తాకుతాయా? తాకవు కదా? కాని తాకినట్లు చెప్పాడిక్కడ. అంటే భవనాలు చాలా ఎత్తుగా ఉన్నాయని చెప్పడమే కవి ఉద్దేశ్యం. అయితే ఆ భవనాలు ఉన్న స్థితికన్నా ఎక్కువచేసి చెప్పాడు.

ఇలా ఉన్నదానికంటే అతిశయంగా (ఎక్కువగా) చెప్పడాన్ని 'అతిశయోక్తి అలంకారం' అంటారు.

♦ **కింది పంక్తుల్లోని అతిశయోక్తి అలంకారాన్ని వివరించండి.**

ఎత్తుగా ఆకాశంలో
ఎగిరే డేగని చూడు
భూచక్రాన్ని గుండ్రంగా
చుంచుకాగ్రంపై తిప్పుతుంది.

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ 'మనిషి లేదా మానవత్వం లేదా మానవీయసంబంధాలు ప్రధానాంశంగా తీసుకుని రాసిన కవితలను సేకరించి సంకలనం చేయండి.



జీవితం కరిగిపోయే మంచు
ఉన్నదాంట్లో నలుగురికీ పంచు

8 జానపద నృత్య సంగీతాలు

– దేవులపల్లి రామానుజరావు

చదవండి – ఆలోచించండి – చెప్పండి

తెలుగు సీమలోని పల్లెపట్టులు అందాల దీవులు. తెలుగు ప్రజల సాంస్కృతిక జీవితంలో గమనించదగిన విశేషాలలో వేషభాషలు ముఖ్యమైనవి. ప్రధానంగా రైతు వేషభాషల్లో ప్రత్యేకత ఉంటుంది. పల్లెటూరి సామెతలు, లోకోక్తులు, మనకు తెలియని చక్కని తెలుగు మాటలు ఎన్నింటినో రైతు సంభాషణలో మనము బాగా పోల్చుకోవచ్చు. రైతులను తలచుకోగానే అతని కోరమీసాలు, దండికడియాలు, చెవులపోగులు, తలపాగా, దాన్ని తలకు చుట్టే పద్ధతి, ఆయనకట్టే ధోవతులు, దాని అంచులు జ్ఞప్తికి వస్తాయి. ఇవన్నీ రైతు అభిరుచికి నిదర్శనాలు. రైతులకు ప్రత్యేకమైన వినోదాలు ఉన్నాయి. తోలుబొమ్మలాటలు, వీధినాటకాలు వీటిలో ముఖ్యమైనవి. తీరిక సమయాల్లో పగటిపూట కథలు చెప్పించుకోవడం, ఆనందించడం సుప్రసిద్ధమైన సంగతి. ఈ విధంగా గౌతమీ కృష్ణవేణులకు ఆవాసమై పాడిపంటలకు నిలయమైన తెలుగు సీమలోని పల్లెపట్టులలో కళాసౌందర్యం అడుగడుగునా గోచరిస్తుంది. తెలుగు భాష ఎంత మధురమైందో, వారి సామాజిక జీవనం అంత సుందరమైనది.

ప్రశ్నలు

1. పై పేరాలో ఏయే విషయాలు ఉన్నాయి?
2. రైతులు మన సంస్కృతికి ప్రతిరూపం అని ఎలా చెప్పగలరు?
3. గ్రామీణ ప్రజల జీవనంలో కళలు, సంగీతానికి గల స్థానమేమిటి?
4. పల్లెపట్టులు మన కళలకు నిలయమని ఎలా చెప్పగలరు?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

భారతావనిలోని అన్ని ప్రాంతాలవలెనే తెలుగుసీమ జనాభాలోని మిక్కిలి ఎక్కువభాగం గ్రామ ప్రాంతాలలో నివసిస్తున్నది. వీరి జీవితంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కళలు అనగా సంగీతం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం... వంటివి భాగమై ఉన్నాయి. ఇప్పటికీ మన తెలుగు సంస్కృతి పల్లెపట్టులోని ప్రజల వల్లనే పదిలంగా తరతరాలకు చేరుతున్నది. ఈ పల్లెపట్లుల్లో నివసించే ప్రజల జీవనంలో సంగీతం, నృత్యం ఎలా పెనవేసుకొన్నాయో తెల్సుకోవడము. ఆ జానపదుల గొప్పదనమేమిటో తెల్సుకోవడమే పాఠ్యాంశ ఉద్దేశం.

పాఠ్యభాగ వివరాలు

ప్రస్తుత పాఠ్యాంశం ప్రసంగ వ్యాసం. ప్రముఖులు ఇచ్చిన ఉపన్యాసాలను పత్రికలలో అచ్చువేసినట్లైన దానిని ప్రసంగవ్యాసం అంటారు. దేవులపల్లి రామానుజరావుగారు జానపదుల కళామయ జీవితాన్ని గురించి చేసిన ప్రసంగాలకు 'జ్ఞానపదులు – జానపదులు' పేరిట యువభారతి వారు ప్రచురించారు జానపదుల నృత్యసంగీతాల గురించి దేవులపల్లివారు చేసిన రేడియో ప్రసంగమే ప్రస్తుత పాఠ్యాంశం.

విద్యార్థులకు సూచనలు

- తెలియని పదాల అర్థాలను పదపట్టికలో అన్వేషించండి, మిత్రులతో చర్చించండి, ఇంకా తెలియని పదాల అర్థాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠంలోని బొమ్మలను పరిశీలించి అవి ఏ జానపద కళారూపాలో గుర్తించండి.


కవి పరిచయం

దేవులపల్లి రామానుజరావు వరంగల్ పట్టణానికి సమీపానగల దేశాయిపేట గ్రామంలో 1917లో జన్మించారు. మదరాసు విశ్వవిద్యాలయ అనుబంధంగా ఉన్న నిజాం కళాశాల నుండి 1939లో బి.ఎ.పట్టా పుచ్చుకొన్నారు. 1944లో నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో డిగ్రీ సంపాదించారు. వీరు పాత్రికేయులుగా, పత్రికా సంపాదకులుగా పనిచేశారు. ఆంధ్రసాహిత్య అకాడమి ప్రథమకార్యదర్శి. ఆంధ్రసాహిత్య పరిషత్తు రథసారధి. ఉన్నత విద్యనభ్యసించి కూడా ప్రభుత్వ ఉద్యోగాల జోలికి పోకుండా, న్యాయవాదవృత్తిపై కూడా శ్రద్ధపెట్టకుండా పూర్తిగా సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలలో మునిగిపోయారు. పచ్చతోరణం, సారస్వత నవనీతం, ఉపన్యాసతోరణం, తెనుగు సాహితి, వేగుచుక్కలు మొదలగు ఇరవై గ్రంథాలను రచించారు. వీరు సాహితీరంగంలోగానీ, విద్యారంగంలోగానీ రాజకీయ రంగంలోగానీ అనేక పదవులను నిర్వహించి వాటికే వన్నెతెచ్చారు.

పుస్తకాలు చదివి సంపాదించిన విజ్ఞానము లేక ఆధునిక నాగరికతతో సంపర్కము లేక పల్లెపట్టులలో నివసించే ప్రజానీకాన్ని మనము జానపదులని పిలువవచ్చును. ఈ జానపదుల జీవితాన్ని కొంచెము పరిశీలిస్తే అందులో సారస్వతానికి, కళలకు, విశేషించి నృత్యానికి, సంగీతానికి సముచిత ప్రాధాన్యము కలదని వెల్లడియౌతుంది. పాటలు, గేయాలు, కథలు మొదలైన అపారమైన సారస్వతము వీరి నాలుకల మీద నాట్యమాడే దృశ్యాలను ఎన్నింటినైనా మనము పల్లెటూళ్ళలో పరికించ వచ్చును. కాని ఈ శతాబ్దంలో కొన్నాళ్ళ నుండి అనేక కారణాల వల్ల ప్రజాసారస్వత మని చెప్పదగిన ఈ పాటలు, గేయాలు, జానపదుల పలుకుబళ్ళలో ప్రాధాన్యాన్ని కోల్పోతున్నట్లు కనిపిస్తున్నది.

జానపదుల సారస్వతములోనే కాక వారి నృత్య సంగీతాలలో కూడ ప్రత్యేకత, విశిష్టత కనిపిస్తున్నవి, అలంకార శాస్త్రాలు, లక్షణ గ్రంథాలు నిర్ణయించిన ప్రమాణాలకు పట్టుపడనివారి సాహిత్యమువలెనే, వారి నృత్య సంగీతాలు గూడ లాక్షణిక గ్రంథాలకు అతీతమై యున్నవి, భరతుడు తన నాట్యశాస్త్రములో ఈ జానపదుల నృత్యాన్ని గూర్చి కొంత ప్రస్తావించినప్పటికిని, తరువాత, అలంకారికులు వాని ఉనికినే గమనించినట్లు కానరాదు. జానపదుల సారస్వతములో మనదేశ సంస్కృతి ప్రతిబింబించినట్లే వారి నృత్య సంగీతాలలో కూడ మన దేశీయ సంప్రదాయాలు ప్రతిఫలించుతున్నవి. జానపదుల రుచులను, అభిరుచులను తెలియజేసే అద్దమువంటివి ఈ నృత్యసంగీతాలని నిస్సందేహంగా చెప్పవచ్చును. సారంగపాణి పదాలవంటివి జానపద వాఙ్మయానికి, నృత్యసంగీతాలకు గూడ ఆటపట్టులై ఉన్నవి. జానపద వాఙ్మయంలో వలెనే, నృత్యసంగీతాలలో కూడా భారత భాగవత రామాయణాల ప్రభావము ప్రముఖంగా కనిపిస్తుంది. పురాణగాథల పరిచయము అడుగడుగునా తొంగిచూస్తుంటుంది.

తెలుగు సీమలో యక్షగానాలు క్రమక్రమంగా నాటకాలుగా పరిణమించి వ్యాప్తిలోకి వచ్చినవి. ఈ యక్షగానాలను మొట్టమొదలు జనులు వీధులలో వేషాలుగట్టి వినిపించేవారు. కేవలము వినిపించడమే కాదు పాడుతూ ఆడేవారని కూడ తెలుస్తున్నది. ఈ విధంగా జానపదుల నృత్యసంగీతాలే ఈ యక్షగానాలకు జన్మస్థానాలని తోస్తున్నది. పగటివేషాలలో, బొమ్మలలో, యక్షగానాలలో, నాటకాల క్రమపరిణామం మనకు కనుపిస్తున్నది.




కురువంజి అనే నృత్యసంప్రదాయాన్ని జానపద నృత్యమనే చెప్పవచ్చును. కురువలు అనే ఆటవికజాతి వారు తిరుపతి, శ్రీశైలము మొదలైన పుణ్యక్షేత్రాలలో యాత్రికుల వినోదము కోసము నృత్యము చేస్తుండేవారు. జానపదులు వర్ధిల్ల జేసిన ఈ నృత్యానికి మొదలు కురవంజులనే పేరు కలిగింది. గ్రామ ప్రాంతాలలో ఇటీవల వరకు కథలు చెప్పించే అలవాటు ఉండేది. ఈ కథలలో బొబ్బిలికథ, బాలనాగమ్మకథ మొదలైనవి సుప్రసిద్ధాలు. రసాత్మకాలైన ఈ కథలను చెప్పే సందర్భంలో జానపద నృత్య సంగీతాలకు ప్రత్యేక ప్రాధాన్యము ఉంటుంది. పల్లెటూళ్లలో కోలాటము, చెమ్మచెక్కలు, మొదలైనవి బాలికలకు అత్యంత ప్రియమైన ఆటలు. ఈ ఆటలలో భజనకీర్తనలు పాడుతూ– "గొల్లవారి వాడలకు కృష్ణమూర్తీ నీవుయేమి

పనులు కొచ్చినావు కృష్ణమూర్తీ పాలకొరకు వచ్చినానే గొల్లభామా మంచి పాటుబోసి నన్నబంపు గొల్లభామా"అని నృత్యము చేస్తున్న దృశ్యము మిక్కిలి మనోహరమైంది. ఇదే విధంగా ఒప్పులకుప్పా, ఒయారిభామా మొదలైన ఆటలలో జానపద నృత్యం ప్రతిబింబిస్తుంది. వెన్నెల రాత్రులలో ముందు పల్లెటూళ్లలో యువతీయువకులు వేసే కోలాటాలు, నృత్యసంగీతాలకు ఆటపట్టులు.



జానపదులు సంగీత ప్రియులు. తోటలలో, పొలాలలో, చెలకలలో, మంచెల మీద కూర్చుండి రాగమాలాపించే రైతు, సాయంకాలము గోధూళి సమయాన ఇంటికి పశువులను తీసుకొని పోతూ పాటపాడే యువకుడూ, పొలములో విత్తనాలు వేస్తూ, కలుపుదీస్తూ, కోతలుకోస్తూ, ఇండ్లలో పిండి విసురుతూ, వడ్లుదంచుతూ, రకరకాల పాటలు పాడే ఆడపడుచులూ, జానపదుల జీవితంలో సంగీతము ఏవిధంగా చొచ్చుకొని పోయిందో బుజువు చేస్తున్నారు. పండుగ పబ్బాల సందర్భంలో వరసగల వారితో పరిహాసాలు ఆడేవేళలలో,



మంగళహారతులు ఇచ్చే సమయాలలో, తొట్లెలో పసిపాపను ఊపుతూ నిద్రబుచ్చే సందర్భాలలో హృదయాలు కదలి శ్రావ్యంగా ఆలపించే పాటలు జానపదుల సంగీతంలో ముఖ్యభాగం కాక యింకేమి? జానపదుల సంగీతాన్ని దేశీ సంగీతమని చెప్పడం కలదు. ఈ దేశీ సంగీతము జనసామాన్యానికి మిక్కిలి హృదయంగమమైనది. గుణములో ఉత్తమశ్రేణికి చెందిన జానపదుల పాటలలో వైవిధ్యము చాలా యెక్కువగానే కనుపిస్తున్నది. జీవితంలో అనేక సన్నివేశాలను ఈ పాటలు చిత్రించుతున్నవి. ఈ పాటలను, పదాలు, మంగళహారతులు, పాటలు అని మనము స్థూలముగా విభజించవచ్చును. పదాలలో ప్రభాతపదాలు, వెన్నెలపదాలు, కోకిలపదాలు, చిలుకపదాలు, గొబ్బిపదాలు మొదలైన వానిని లెక్కించవచ్చును. పాటలలో లాలిపాటలు, జోలపాటలు, ఏలపాటలు, దరువులు సుద్దులు అప్పగింత పాటలు మొదలైన వానిని చేర్చవచ్చును; గొల్లసుద్దులు ప్రఖ్యాతి గాంచిన పాటలు.

ఈవిధంగా ఇవన్నీ జానపదుల సరసజీవితానికి చాలా మంచి ప్రతిబింబాలు. తోలుబొమ్మలాటలు, భాగవతాలు జానపదులు ప్రేమతో పోషించి వర్ధిల్లజేసిన కళాసంప్రదాయాలు.


ఈ పాటలుపాడే పద్ధతి గూడ ప్రత్యేకమైంది. జానపదుల సంగీతానికి శాస్త్రీయమైన నియమాలు కల్పించడం కష్టసాధ్యము; వీనికి రాగతాళాలు నిర్ణయించడం మిక్కిలి ప్రయాసతో కూడుకొని సంగీత శాస్త్రంలో నిష్ణాతులైన ప్రజ్ఞావంతులు చేయవలసినపని. బొబ్బిలికథ, పల్నాటివీరుల కథలను చెప్పడంలో, వివిధ సంగీతరీతులను అనుసరిస్తుంటారు. వీనిని బాగుగా పరిశీలించవలసి ఉన్నది.

ఈ జానపద సంగీతాన్ని, నృత్యాన్ని తమ సొమ్ముగా చేసికొనిన తెగలవారు తెలుగు సీమలో కొందరున్నారు. కాని క్రమక్రమంగా వీరిసంఖ్య తగ్గిపోతున్నది. ఈ విధంగా ఈ పాటలు పాడేవారికి తగిన ప్రోత్సాహమూ, పోషణా లేకపోయినందు వలన కాబోలు, భిక్షాటనము చేయవలసిన దుస్థితికి వీరు గురియౌతున్నారు. వీరికి బిచ్చము గూడ తగినంత దొరకని దుస్థితి మిక్కిలి దుస్సహమైనది. దేశద్రిమ్మరులై, ఊరూరా తిరుగుతూ, జీవనోపాధిని కల్పించుకుంటున్న వీరిని ఆశ్రయించి ఉన్న సంగీత నృత్యాలు నశించిపోకుండా కాపాడవలసిన అవసరము ఎంతో ఉన్నది. బాలసంతులు, బుడబుక్కలవారు, జంగములు, దాసరులు, భాగవతులు, పిచ్చుక గుంటులు, వీరముష్టులు మొదలైన ఈ తెగలవారు ఈనాడు చాల తక్కువగా కనుపిస్తున్నారన్న విచారకరమైన సత్యాన్ని మనము గమనించవలసి ఉన్నది. ఈ తెగలలో అజ్ఞాతవాసము జేస్తున్న సాహిత్యాన్ని, సంగీత నృత్యాలను సకాలములో కాపాడక పోతే, కొంత కాలము తరువాత అదృశ్యం కాగల ప్రమాదము గోచరిస్తున్నది.

ఈ జానపదులు సంగీత నృత్యాలలో ఉపయోగించే సాధనాలు, వాద్యాలు కొన్ని ప్రత్యేకమైనవి వున్నవి. వీరి ఉపయోగం కూడా ఈరోజు చాలా తక్కువగా కనిపిస్తున్నది. గజ్జెలు కట్టుకొని నృత్యము చేయడం, కొమ్ము ఊదడం, పిల్లనగ్రోవి పాడడం, నాగస్వరము వాయించడం మొదలైనవి జానపదుల ప్రత్యేకతలు చిరుతలు చేతులలో నుంచుకొని, తాంబూర పట్టుకొని, ఇంటింటికి వచ్చే హరిదాసు, ఈనాడు పల్లెటూళ్లలో చాలా తక్కువగా కనిపిస్తుంటాడు. అందెలు, తాళాలు, కొమ్ము, జమిడికలు సాధనలో రకరకాల వాద్యాలను ఉపయోగించడం గమనింపవలసి ఉన్నది.



చదువు సంధ్యలు రాకపోయినంతమాత్రాన వ్రాతపూతలు తెలియనంత మాత్రాన, ఆధునిక అభిరుచులను కలిగి లేనంత మాత్రాన, నేటి నాగరికతా ప్రభావానికి లోనుగాక పోయినంత మాత్రాన జానపదుల జీవితాలు రసహీనమై, శుష్కమైనవి కావు. ఉన్నత విద్యావంతుల హృదయాలవలెనే జానపదుల హృదయాలు గూడ, వివిధ సన్నివేశాలలో రసార్ద్రములు కావడం జరుగుతుండును. ఈ విధంగా జరిగినప్పుడు మెరుపును చూచి పింఛము విప్పే నెమలివలె, మామిడి చివుళ్లతిని



మత్తిల్లి పాడే కోకిల వలె, సంగీత నృత్యాలలో వారి జీవితాలు ఉప్పొంగుతుండును. కళా సౌందర్యానికి ఆటపట్టయిన సందర్భాలు జానపదుల జీవితాలలో పుష్కలంగా ఉన్నవి. దానిని చక్కగా ఆకళించుకొని, అందులోని ఉత్తమ కళాసంప్రదాయాలను, చిరస్థాయిగా చేయవలసిన కర్తవ్యాన్ని మనము మరచిపోగూడదు.

(రేడియో ప్రసంగము - 1959)

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. "జానపదుల జీవితానికి నృత్యం, సంగీతాలతో అవినాభావ సంబంధం ఉంది" దీనిపై మీ అభిప్రాయాలను చెప్పండి.

2. పాఠం చదవండి. పట్టికలో సూచించిన పేరాలు చదవండి. ఆ పేరాలలోని విషయం ఆధారంగా శీర్షికను నిర్ణయించండి.

పేరా సంఖ్య	పేరాకు శీర్షిక
4వ పేరా	
5వ పేరా	
9వ పేరా	

3. కింది పేరా చదవండి. పేరా ఆధారంగా మీరు ప్రశ్నలు తయారుచేయండి.

మన పల్లెల్లోని ఆటలకూ పాటలకూ వీడరాని చుట్టరికమున్నది. తెలుగు పల్లెల్లో రకరకాల ఆటలు చూడవచ్చు. ఇవి మనస్సుకు ఉల్లాసం కలిగించేవేడుకలు. ఇందులో సమస్త జనులను ఆకర్షించే తోలుబొమ్మలాట సుప్రసిద్ధమైనది. తోలుబొమ్మలాట వలెనే బహుళప్రచారం పొందినవి యక్షగానాలు అనే వీధినాటకాలు. ఈ నాటకాలు ఆడేవారిని జక్కులు అనిపిలుస్తుంటారు. భాగవతంలోని శ్రీకృష్ణలీలలు మొదలైన వానిని ఆడేవారిని భాగోతులని కూడా పిలుస్తుంటారు. ఎన్నోవందల సంవత్సరాల నుండి యక్షగానాలు, తోలుబొమ్మలాటలతోపాటు భాగోతాలు మన పల్లెటూర్ల ప్రజలను రంజింపచేస్తున్నాయి. ఇవన్నీ తెలుగువారి కళాభిరుచికి మంచి నిదర్శనాలు.

4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అ) దేవులపల్లిగారు చేసిన భాషాసేవ ఏమిటి?

ఆ) జానపదుల నృత్య సంగీతాలలోని ప్రత్యేకతలు, విశిష్టతలు ఏమిటి?

ఇ) జానపదులు సంగీతప్రియులని ఎలా చెప్పగలరు?

ఈ) జానపదుల సంగీత సాధనాలు ఇతర సంగీత సాధనాల కంటే ఎందుకు భిన్నమైనవి?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) ప్రజాసారస్వతమనదగిన జానపదుల పాటలు, గేయాలు కనుమరుగైతున్నవని రచయిత ఎందుకుఅన్నాడు?

ఆ) జానపద కళల వల్లేనే భారత భాగవత రామాయణాలు ప్రజలందరికీ చేరినాయని మీరెలా చెప్పగలరు?

ఇ) జానపద సంగీతాన్ని దేశీసంగీతమని ఎందుకన్నారు?

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

జానపద నృత్య సంగీతములలోని గొప్పదనాన్ని వివరిస్తూ వ్యాసం రాయండి.

3. సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

జానపదకళలను ఆదరించడం, గౌరవించడం అంటే మన సంస్కృతిని మనం కాపాడుకొన్నట్లే! ఇందుకోసం మనం ఏంచేయాలో తెలిపేలా ఒక ప్రసంగ వ్యాసాన్ని తయారుచేయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది పదాలతో సొంతవాక్యాలు రాయండి.

(అ) ఆటపట్టులు (ఆ) వ్యాప్తిలోకి (ఇ) చొచ్చుకొనిపోవు (ఈ) ప్రఖ్యాతిగాంచు

2. కింది పదాలను వివరించండి.

అ) జానపదులు : _____

ఆ) పురాణగాథలు : _____

ఇ) అప్పగింత పాటలు : _____

వ్యాకరణాంశాలు

1. కింది వాక్యంలో ఏ అలంకారముందో గుర్తించి లక్షణం రాయండి.

అ) సంజయా! నిన్ను చూస్తే మాకు ధృతరాష్ట్ర మహారాజును చూచినంత తృప్తిగా ఉంది.

ఆ) మెరుపునుచూసి పింఛము విప్పే నెమలివలె, మామిడి చివుళ్ళు తిని మత్తిల్లి పాడే కోకిలవలె, సంగీత నృత్యాలతో వారి జీవితాలు ఉప్పొంగుతుండును.

2. కింది పదాలను విడదీసి ఏ సంధులో గుర్తించండి.

అ) అత్యంత　　ఆ) రసార్ధము　　ఇ) ఆస్తులనెల్ల

ఈ) చద్దన్నము　　ఉ) ఇంకెప్పుడు　　ఊ) హాస్తోదకం

విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం

కింది ఉదాహరణను గమనించండి.

'తెల్లకలువ' తెల్లనయిన కలువ. ఇక్కడ కలువ పూవును గురించి చెప్పడం జరిగింది. అది ఎలా ఉంది? 'తెల్లగా'. తెల్లగా అన్నది విశేషణం (ప్రత్యేకత). 'కలువ' నామవాచకం (విశేష్యం). విశేషణ, విశేష్యాలతో ఉండే సమాసాన్ని కర్మధారయమంటారని ఇంతకుముందే తెలుసుకున్నాం కదా! అయితే పై ఉదాహరణలో 'తెల్ల' అనే విశేషణం పూర్వపదంగా వచ్చింది కదా! ఇలా వస్తే 'విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం' అంటాం. దీన్ని సూత్రీకరించుకుంటే.

'విశేషణం పూర్వపదంగా విశేష్యం ఉత్తరపదంగా ఉండే సమాసాన్ని విశేషణ పూర్వపద కర్మధారయ సమాసమంటారు'.

♦ **కింది సమాసపదములకు విగ్రహవాక్యాలను రాయండి.**

అ) ఉత్తమకళ　　ఆ) ఉన్నతవిద్య　　ఇ) నల్లబల్ల　　ఈ) మంచి బాలుడు

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

♦ మీ ప్రాంతంలోని లేదా మీ జిల్లాలో పేరుపొందిన ఏదైనా ఒక జానపదకళ గురించి వివరాలు సేకరించి నివేదిక రాయండి. దాన్ని ప్రదర్శించండి.



మనిషి నిద్రలో కనేది కల
మనిషిని నిద్రనుండి మేల్కొలిపేది 'కళ'

9 శతక మాధురి

చదవండి - ఆలోచించండి - చెప్పండి

నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల?
చదువ పద్యమరయు చాలదా ఒక్కటి?
విశ్వదాభిరామ వినురవేమ!

ప్రశ్నలు

1. *పై పద్యభావాన్ని చెప్పండి?*
2. *అలాంటివే మరికొన్ని నీతి పద్యాలు చెప్పండి.*
3. *నీతిని బోధించే శతక పద్యాలను మనం ఎందుకు నేర్చుకోవాలి?*

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

వివిధ శతకాల్లోని నీతులను తెలియజేసి, విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించి, ఉత్తములుగా తీర్చిదిద్దడం, అలాగే పద్యాలను నేర్చుకోవడం ద్వారా అమోఘమైన పదజాలం విద్యార్థుల సొంతంచేసే ప్రయత్నమే ఈ పాఠ్య ఉద్దేశం.

పాఠ్యభాగ వివరాలు

వందకు పైగా పద్యాలు గల రచన శతకం. ప్రతి పద్యం చివర మకుటం ఉంటుంది.ఎంపిక చేసుకున్న ఛందంలోనే శతకమంతా నడుస్తుంది. శతకాలు ప్రధానంగా నీతి, భక్తి వైరాగ్యాలను బోధిస్తాయి. వివిధ శతకాలనుండి తీసుకున్న పద్యాలతో ఈ పాఠ్యాంశం రూపొందించబడ్డది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం చదవండి అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- తెలియని పదాలకు అర్థాలను పాఠ్యపుస్తకం చివర ఉన్న పదపట్టిక లేదా నిఘంటువు ద్వారా తెలుసుకుని రాయండి.
- పాఠంలో అర్థంకాని పదాలు, పాదాలను గూర్చి మిత్రులతో చర్చించండి.

కవి పరిచయం

కవుల పేర్లు	కాలం	రచన
పక్కి అప్పలనర్సయ్య	16వ శతాబ్దం	కుమారశతకం
		కుమారీ శతకం
పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి	17వ శతాబ్దం	కాళికాంబ సప్తశతి
		కాలజ్ఞానం మొ॥నవి
కంచర్లగోపన్న (రామదాసు)	17వ శతాబ్దం	దాశరథీశతకం
భర్తృహరి(మూలం)	7వ శతాబ్దం	సుభాషిత త్రిశతి
అనువాదం-ఏనుగు లక్ష్మణకవి	18వ శతాబ్దం	సుభాషిత రత్నావళి
కాకుత్స శేషప్పకవి	18వ శతాబ్దం	నరసింహ శతకం

I



కం. వృద్ధజన సేవ చేసిన,
బుద్ధి విశేషజ్ఞుఁడనుచుఁ బూతచరితుఁడున్
సద్ధర్మశాలి యని బుధు
లిద్ధరఁ బొగడెదరు ప్రేమ యొసగ కుమారా!




ఆ.వె. గురుని మనసు నందు గుఱిపెట్టి తలపెట్ట
తప్పులన్ని తొలగి ధన్యుడగును
ధన్యుడైన లోకమాన్యుడై తరియించు
కాళికాంబ! హంస! కాళికాంబ!

II

ఆ.వె. జీవులకును "మాతృదేవోభవ" యటంచు
శ్రుతులు, స్మృతులు పలికె శుద్ధముగను
మాతృమూర్తి మించు మఱి దైవమే లేదు
కాళికాంబ! హంస! కాళికాంబ!





ఉ. బొంకని వాఁడె యోగ్యు డరి బృందము లెత్తిన చోటఁ జివ్వకుం
జంకనివాఁడె జోదు, రభసంబున నర్థికరంబు సాఁచినం
గొంకని వాఁడెదాత, మిమ్ముఁగొల్చి భజించిన వాఁడెపో నిరా
తంక మనస్కుడెఁన్నగను దాశరథీ కరుణా పయోనిధీ!

– దాశరథీ శతకం

తే.గీ. సంపదలు గల్గు తఱి మహాజనుల హృదయ
మభినవోత్పల కోమలం బగుచు వెలయు;
నాపదలు వొందునపుడు మహామహీధ
రా సంఘాత కర్కశంబై తనర్చు

– ఏనుగు లక్ష్మణ కవి



III



సీ॥ అడవి పక్షుల కెవ్వడాహార మిచ్చెను?
మృగ జాతి కెవ్వడు మేతఁ బెట్టె?
వన చరాదులకు భోజనమెవ్వడిప్పించె?
చెట్ల కెవ్వడు నీళ్ళు చేది పోసె?
స్త్రీల గర్భమునందు శిశువునెవ్వడు పెంచె?
ఫణులకెవ్వడు పోసెఁ బరగపాలు?
మధుపాళికెవ్వడు మకరందమొనరించెఁ?
బసుల కెవ్వడొసంగెఁ బచ్చిపూరి?

తే.గీ॥ జీవకోట్లను బోషింప నీవెగాని,
వేఱె యొకదాత లేడయ్య వెదకి చూడ?
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

– నరసింహ శతకం

భావాలు

1. ఓ కుమారా! పెద్దలపట్ల గౌరవభావం కలిగి, వృద్ధులసేవ చేసే వాడిని లోకమునందు పరిశుద్ధమగు మనస్సుకలవాడని, తెలివి తేటలు బాగా ఉన్నవాడని, ధర్మము తెలిసిన వాడని పెద్దలంటారు.
2. ఓ కాళికాంబ! ఏకాగ్రబుద్ధితో మనసులో గురువునే ధ్యానిస్తూ పనులు చేసినట్లయితే తప్పులన్నీ తొలగి కార్యసాఫల్యుడై ధన్యుడౌతాడు. అలా ధన్యుడైన వాడు లోకముచే గౌరవింపబడి తరిస్తాడు.
3. ఓ కాళికాంబ! జీవులకు తల్లియే ప్రత్యక్షదైవమని వేదాలు, ధర్మశాస్త్రాలు స్పష్టంగా చెప్పాయి. మాతృమూర్తిని మించిన మరొక దైవం లేదు.
4. దశరథుని పుత్రుడా! సముద్రమంతటి దయగలవాడా! ఎవడు అసత్యములాడడో వాడే ఉత్తముడు. శత్రువులు దండెత్తి వచ్చినపుడు యుద్ధము చేయుటకు వెనుకాడనివాడు ధీరుడు. అడిగిన వారికి వెనుకాడకుండ దానము చేయువాడు మహాదాత. మిమ్ముల సేవించువాడే జీవితంలో భయమనేది ఎఱుగని వాడగును.
5. సంపదలు కలిగినప్పుడు మహాత్ముల మనస్సులు కలువలవలె మృదువుగా ఉంటాయి. ఆపదలు వచ్చినపుడు మాత్రం పెద్ద కొండలవలె కఠినంగా ఉంటాయి. అంటే – సంపదలు వచ్చినపుడు గర్వించి కఠినంగా ప్రవర్తించరనీ, ఆపదలు వచ్చినపుడు చలించరని భావం.
6. అలంకారములతో శోభిల్లేవాడా! ధర్మపురిలో వెలసినవాడా! దుష్టులను సంహరించేవాడా! పాపాలను హరించేవాడా! ఓ నరసింహా! అడవి పక్షులకు ఆహారము, జంతుజాలానికి మేత, వనంలో చరించు ప్రాణులకు ఆహారము, చెట్లకు నీరు పోయుట, స్త్రీల కడుపున శిశువును పెంచుట, పాములకు పాలు పోయుట తుమ్మెదలకు తేనె, పశువులకు పచ్చిగడ్డి, ఇవన్నీ ప్రసాదించింది ఎవరు? నీవేకదా! దేవా! జీవులను పోషించునది నీవే కాని, మరొక దాతలేడు.

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది అంశాల గురించి మాట్లాడండి.

అ) వృద్ధుల కష్టాలకు సంబంధించి మీరు విన్న వార్తలను లేదా చూసిన సంఘటనలను గూర్చి చెప్పండి.

ఆ) తల్లి మనస్సు ఎలాంటిదో చెప్పండి.

2. పద్య భావాలు చదివి కింది వాటిలో సరియైన సమాధానం గుర్తించండి.

అ) జీవులకు ప్రత్యక్షదైవం ఎవరు ?

i) అమ్మ **ii)** అక్క **iii)** అన్న **iV)** ఎవరూ కాదు ( )

ఆ) దాశరథీ అనగా

i) దశరథుడు **ii)** దశరథుని రథము **iii)** దశరథుని కుమారుడైన రాముడు

iV) ఎవరూ కాదు ( )

ఇ) సంపదలు కలిగినప్పుడు మహాత్ముల మనస్సు ఇలా ఉంటుంది.

i) కలువలవలె మృదువుగా **ii)** శిలవలె కఠినంగా

iii) గర్వంగా **iV)** ఏదీ కాదు ( )

ఈ) నరసింహశతక పద్యంలో జీవులను పోషించేదెవరని కవి అంటున్నాడు

i) రాజు **ii)** దాత **iii)** నరసింహుడు **iV)** ఎవరూ కాదు ( )

3. కింది పద్యం చదవండి భావానికి సంబంధించిన వాక్యాలను పద్య పాదాలలో ఉన్నవిధంగా వరుస క్రమంలో అమర్చండి.

గడచిపోయినట్టి క్షణము తిరిగిరాదు
కాలమూరకెపుడు గడుపబోకు
దీపమున్న యపుడె దిద్దుకోవలెల్లు
విలువ తెలిసి చదువు తెలుగుబిడ్డ.

వాక్యాలు :

అ) దీపమున్నప్పుడే ఇల్లుచక్క దిద్దుకోవాలి.

ఆ) కాలం విలువ గుర్తించి చదువుకోవాలి.

ఇ) గడిచిపోయిన క్షణం తిరిగి రాదు.

ఈ) కాలాన్ని వ్యర్థంగా గడపకూడదు.

4. కింది ప్రశ్నలకు పాఠం చదివి జవాబులు రాయండి.

అ) లోకమాన్యులై తరించేదెవరు?

ఆ) వేదాలు, ధర్మశాస్త్రాలు తల్లిని గూర్చి ఏమని చెప్పాయి?

ఇ) ఉత్తముడు, ధీరుడు, దాత, మంచిమనస్సుకలవారు ఎవరని గోపన్న అంటున్నాడు?

ఈ) మహాత్ములు ఆపదలు వచ్చినపుడు ఎలా ఉంటారు?

ఉ) జీవులను పోషించే దాత ఎవరు?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

1. గురువును ఆశ్రయించడం వల్ల ప్రయోజనం ఏమిటి? మీ మాటల్లో రాయండి.
2. 'తల్లిదైవంతో సమానం' దీన్ని మీరెలా సమర్థిస్తారు?
3. మీ దృష్టిలో మహాత్ములంటే ఎవరు?
4. నరసింహ శతక పద్యభావాన్ని సొంత మాటల్లో రాయండి.

ఆ) కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

1. మీరు ఎవరిని ప్రత్యక్షదైవాలుగా భావిస్తారు? ఎందుకు? సొంతమాటల్లో రాయండి.
2. మీకు తెలిసిన ఒక దాతను గురించి సొంత మాటల్లో రాయండి.

ఇ) కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

1. పాఠంలోని పద్యాల ఆధారంగా సూక్తులను తయారుచేయండి.
2. పాఠంలోని పద్యాల ఆధారంగా మనం అలవర్చుకోవలసిన మంచి గుణాల జాబితా తయారు చేయండి?

III. భాషాంశాలు

పదజాలం

1. కింది గళ్ళలో దాగిన శతకాల పేర్లు రాయండి.

కా	దా	న	రీ	ళ
సు	భా	కు	శ	ర
వే	శ్రీ	స్క	త	శ్వ
సిం	మా	తి	మ	థి
స్తీ	ము	హ	క	★

శతకాలు :

ఉదా॥ 1. వేమన శతకము

2. _____

3. _____

4. _____

5. _____

6. _____

7. _____

8. _____

2. కింది ప్రకృతి పదాలకు పట్టికలోనున్న పదాలనుండి సరియైన వికృతి పదం గుర్తించి రాయండి.

ప్రకృతి	–	వికృతి
అటవి	–	_____
విద్య	–	_____
కథ	–	_____
సంతోషము	–	_____
పక్షి	–	_____
భోజనము	–	_____
పశువు	–	_____

పసువు
బోనము
పక్కి
సంతసము
విద్దె
అడవి
కత

3. కింద వాక్యాల్లో గీతగీసిన పదాల అర్థం తెలిపి సొంత వాక్యంలో ప్రయోగించండి.

ఉదా॥ మేఘన సత్కథలు వింటుంది. సత్కథలు = మంచి కథలు

వాక్యం : శివానికి సత్కథలంటే ఇష్టం.

1. పూలపై మధుపాళి నాట్యం చేస్తుంది.
2. సాయికి బొంకెడి వారంటే గిట్టదు.
3. వంశీ తన పుట్టిన రోజున తాను పొదుపు చేసిన డబ్బును అర్థులకు దానం చేశాడు.
4. ప్రత్యూషకు బంగారు భూషణములంటే ప్రీతి.

4. పాఠం ఆధారంగా కింది పదాలను సొంత వాక్యాల్లో ఉపయోగించండి.

1. ధన్యులు 2. మాన్యులు
3. జంకు 4. అరిబృందము

వ్యాకరణాంశాలు

1. కింది వాటిలో ఏ అలంకారం ఉన్నదో గుర్తించి రాయండి.

అ) తలలు మాఱిచియొ, మూటలు విప్పియో, కొల్ల
గొట్టియొ సిరికూడ బెట్టవలయు
ఆస్తులనెల్ల భార్యలపేర వ్రాయించి
మాయా దివాలాలు తీయవలయు

ఆ) మా పొలంలో బంగారం పండింది.

2. కింది విగ్రహవాక్యాలకు సమాసపదాలను రాసి అవి ఏ సమాసాలో గుర్తించండి.

విగ్రహవాక్యం	సమాసపదం	సమాసంపేరు

అ) వృద్ధజనుల యొక్క సేవ

ఆ) మంగళమయిన స్నానము

ఉత్పలమాల

3. కింది ఉదాహరణను గమనించండి.

భ	ర	న	భ	భ	ర	వ
U II	U I U	I I I	U I I	U II	U I U	I U
బొంకని	వాఁడెయో	గ్యుడరి	బృందము	లెత్తిన	చోటఁ జి	వ్వకుం

భ	ర	న	భ	భ	ర	వ
U II	U I U	I I I	U I I	U II	U I U	I U
జంకని	వాఁడె జో	దు, రభ	సంబున	నర్థి క	రంబు సాఁ	చినం

పై పద్యపాదంలో ప్రతిపాదంలోనూ వరుసగా 'భరనభభరవ' అనే గణాలే వచ్చాయి. (నాల్గు పాదాలలోనూ ఇలాగే వస్తాయి) ఇలా వచ్చే పద్యాన్ని 'ఉత్పలమాల' అంటారు. పద్యపాదంలోని మొదటి అక్షరానికి 'యతి' అనిపేరు. అదే పాదంలో నియమిత స్థానంలో అక్షరాన్ని నిలపడాన్ని యతిమైత్రి అంటారు. నిలిపేచోటును యతిస్థానం అంటారు. ఉత్పలమాల పద్యంలో యతిస్థానం 10వ అక్షరం. పై వాటిలో మొదటి పాదంలో 'బొ – బృ' కు, రెండవ పాదంలో 'జ – స' కు యతిమైత్రి చెల్లింది. పద్యపాదంలోని రెండవ అక్షరాన్ని 'ప్రాస' అంటారు. పద్యంలోని మొదటిపాదంలో

రెండవ అక్షరంగా ఏ హల్లు ఉంటే మిగతా పాదాలలో కూడా రెండవ అక్షరంగా అదే హల్లు రావాలి. ఇలా ఉండడాన్ని 'ప్రాసనియమం' అంటారు. పై పద్యపాదాలలో రెండవ అక్షరంగా 'ంక' వచ్చింది. పద్యమంటే పాద, గణ, యతి, ప్రాసలతో కూడినది. పై విషయాలనన్నింటినీ పరిశీలించాక 'ఉత్పలమాల' పద్యలక్షణాలను ఈ విధంగా చెప్పుకోవచ్చు.

అ) ఈ పద్యంలో నాలుగు పాదాలుంటాయి.

ఆ) ప్రతి పాదంలోనూ వరుసగా 'భరనభభరవ' అనే గణాలు వస్తాయి.

ఇ) యతిస్థానము పదవ అక్షరం.

ఈ) ప్రాస నియమం ఉంటుంది.

4. క్రింది పద్య పాదంలో గురులఘువులు గుర్తించి, గణవిభజన చేసి, లక్ష్యలక్షణ సమన్వయం చేయండి.

అ) ఆపురి బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తిభా

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- పాఠశాల గ్రంథాలయం నుండి వివిధ రకాల నీతి పద్యాలు సేకరించి సంకలనంగా తయారు చేయండి.



"ఆలయంశిథిలమైపోవచ్చు.

బావి కూడుకుపోవచ్చు.

నీటి ఉధృతికి చెరువు కట్ట తెగిపోవచ్చు.

అడవి నశించవచ్చు.

కానీ పద్యం అజరమరంగా నిలిచి ఉంటుంది."

10 మాట్లాడే నాగలి

మళయాల మూలం : పొన్‌కున్నం వర్కెమ్, అనువాదం : ఎన్. వేణుగోపాలరావు

చదవండి - ఆలోచించండి - చెప్పండి

ఈ విశ్వంలో, ఈ భూమండలంలో, ఈ జీవనచక్రంలో మనకెంత ప్రాధాన్యముందో....ఓ చీమకు, ఓ దోమకు, ఓ ఈగకు, తూనీగకు, తేనీగకు, ఓ గద్దకు చివరకు ఓ నత్తకూ, ఓ పీతకూ కూడా కాస్త అటూ ఇటూగా అంతే ప్రాధాన్యం ఉందని తేలిపోయింది. సమస్యేమిటంటే ఉన్నత జీవులం కావటంతో మనకు తెలివి ఎక్కువనుకుంటాం. ఆ తెలివిని మనం వినాశానికి ఉపయోగిస్తున్నామనుకోలేదు. నాటి వేటకాలం నుంచీ నేటి పారిశ్రామిక యుగం వరకూ మనం ఇతర జీవులనూ, ఈ ప్రకృతిలోని జీవవైవిధ్యాన్ని, సకల వనరులనూ పరిహసిస్తూనే పోతున్నాం. ఫలితం - ఇప్పుడు ఈ భూమ్మీద మన అస్తిత్వమే అయోమయంలో పడింది. ఈ విలయం చూసి భయపడటం.

ప్రశ్నలు

1. పై పేరా దేని గురించి ఉంది?
2. తెలివిమీరిన మానవులు ఏం చేస్తున్నారు?
3. వీటి ఫలితాలు ఎలా ఉన్నాయి?
4. జీవవైవిధ్యాన్ని కాపాడటానికి మనం ఏం చేయాలి?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

ప్రాణులకు - ముఖ్యంగా పెంపుడు జంతువులకూ సంవేదనలుంటాయనీ మనం చూపే ప్రేమ, ఆప్యాయతలకు అవి స్పందిస్తాయనీ చెప్పడం ఈ పాఠం ఉద్దేశం. జీవకారుణ్య దృష్టిని పెంపొందింపచేయడం ఈ పాఠం ఉద్దేశం.

పాఠ్యభాగ వివరాలు

అనువాదం – ఒక భాషలో నున్న సాహిత్యాన్ని వేరొక భాషలోకి యథాతథంగా రాసినట్లైన దానిని అనువాదం అంటారు. ఇది అనువాద ప్రక్రియ.

విద్యార్థులకు సూచనలు

- *అర్థంకాని పదాలకింద గీత గీయండి.*
- *తెలియని పదాల అర్థాలను పదపట్టిక చూసి గ్రహించండి, మిత్రులతో చర్చించండి. ఇంకా తెలియని పదాల అర్థాలను ఉపాధ్యాయులని అడిగి తెలుసుకోండి.*
- *ఈపాఠానికి శీర్షిక ఎందుకు అలా పెట్టారో ఊహించండి.*

కవి పరిచయం

పొన్‌కున్నం వర్కెయ్ మలయాళ అభ్యుదయ రచయితలలో ప్రముఖుడు. 1-7-1910న కుట్టనాడ్ దగ్గరున్న ఎదతువ గ్రామంలో సిరియన్ క్రైస్తవ కుటుంబంలో జన్మించాడు. ఈయన బాల్యంలోనే తండ్రి చనిపోయాడు. దాంతో తల్లి – పిల్లలతో తన పుట్టిల్లైన పొన్‌కున్నంకు చేరుకుంది. వర్కిబాల్యం అక్కడే గడిచింది. ఈయన పాఠశాలవిద్య పూర్తికాకముందే భారత స్వాతంత్ర్యోద్యమంవైపు ఆకర్షితులయ్యారు. ప్రారంభదశలో ఈయన రచనా వస్తువులు స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించి ఉండేవి.

ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించిన వర్కెయ్ 'తిరుముల్కచ్చ' (1939) అనే కథానికా సంకలనంతో రచయితగా పరిచయమయ్యారు. మొదటి గ్రంథమే వీరికి విశేష ఖ్యాతిని తెచ్చి పెట్టింది. వ్యావహారిక వచనాన్ని ఒడిసి పట్టుకోవడానికి కథానిక, నాటక ప్రక్రియలే తగినవని నమ్మిన వర్కెయ్ వాటిపై దృష్టిసారించి సామాజిక అసమానతలపై రాజీలేని ఒంటరిపోరాటం చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుశిక్షననుభవించారు. జీవిక కోసం పుస్తకాల కొట్టు పెట్టడం దగ్గర్నుంచీ సినిమారంగంలో పనిచేయడం దాకా ఎన్నో ధనార్జన మార్గాలను అనుసరించారు.

24 కథానికా సంపుటాలు, 16 నాటకాలు, 2 కవితాసంపుటాలు, ఒక వ్యాస సంకలనం, ఆత్మకథ వెలువరించిన వర్కి 2004లో కన్నుమూశారు.

మానవసంబంధాలు, మనిషికి ప్రకృతితో ఉన్న అనుబంధం వర్కెయ్ రచనలలోని ప్రధానాంశాలు. ఈయన గొప్ప మానవతా వాది.

I

ఎద్దు సంగతి వచ్చేసరికి ఓసెఫ్ చెత్తన్ అన్నీ మరిచిపోతాడు. వేరే రైతులు అతణ్ణి 'ఎద్దు పిచ్చోడు' అని పిలుస్తారు. ఆ ఎద్దు పేరు కన్నన్. దాన్ని చూసి ముచ్చటపడని రైతు లేడు. ఓసెఫ్‌కు కన్నన్ తోడిదే లోకం. బూడిద రంగులో బలంగా, పొట్టిగా, లావాటి ఒంపు తిరిగిన కొమ్ములతో అది బ్రహ్మాండమైన ఆకారం గల వృషభరాజు. సుడి తిరిగిన బిగువైన చర్మం, బైటికి ఉబికిన కళ్ళు. అసలు కన్నన్ నడకలోనే ప్రత్యేకమైన రీవి ఉట్టిపడేది. దున్నేటప్పుడయినా, మరెక్కడయినా ఓసెఫ్ మనసులో ఏమున్నదో కన్నన్ తప్పనిసరిగా పసికట్టేది. ఎక్కడయినా సరే, సామానుల గదిలోగాని, పొలంలోగాని ఆ ఎద్దు సరిగ్గా ఓసెఫ్ ఏమనుకుంటున్నాడో గుర్తించగలిగేది.

కన్నన్ మీద ఓసెఫ్ తన చెర్నాకోల నెన్నడూ ఉపయోగించలేదు. ఊరికే చెర్నాకోల పైకి లేపే వాడంతే. వేరే రైతులలాగ అతనికి గొంతెత్తి తన ఎద్దును తిట్టవలసిన అవసరమూ ఉండేదిగాదు. స్నేహితుడితో మాట్లాడినట్టే కన్నన్‌తో కూడా మాట్లాడేవాడు. అక్కడ ఉన్న ఎద్దులన్నిటికీ నాయకురాలు కన్నన్. ఒక మడిలో దున్నడం అయిపోయిన తర్వాత, పక్క మడిలోకి వెళ్ళాలని కన్నన్‌కు చెప్పవలసిన అవసరమే లేదు. అటువంటి పనులన్నీ ఎప్పుడు, ఎట్లా చెయ్యాలో కన్నన్‌కు తెలుసు.కొన్నిసార్లయితే కన్నన్ పక్కమడిలోకి వెళ్ళిపోతుంటే, ఓసెఫ్ ఒక్కక్షణం విరామం కావాలనేవాడు.

"ఓయ్ – ఓ క్షణం ఆగు, నన్ను పాన్ వేసుకోనీ. చాలా సేపయింది."

ఆ మాట వినగానే కన్నన్ నిలిచిపోయేది. పాన్ నమలడం అయిపోగానే ఓసెఫ్ "హుఁ" అనే వాడు. కన్నన్ మళ్ళీ పని మొదలుపెట్టేది. ఒక మడిలోంచి మరో మడిలోకి వెళుతున్నప్పుడు ఆ చిన్న గట్లమీద ఎంత జాగ్రత్తగా అడుగులు వేసేదని! ఆ చిన్న చిన్న గట్లమీద ఎక్కడయినా తన గిట్ట పెట్టేది కాదు. సరిగ్గా చూసి ఒక్క తన్ను తంతే గట్లు తెగిపోతాయని దానికి తెలుసు.

చెప్పినదంతా అర్థం చేసుకునే కన్నన్‌ను కట్టేయవలసి ఉండేది కాదు. దున్నడం అయిపోగానే మేతకు వదిలేసేవాడు. ఊరికే వదిలేస్తూ "హే – పో కడుపు నింపుకో. అరటిచెట్లు మాత్రం ముట్టుకోకు" అని హెచ్చరించేవాడు ఓసెఫ్. కన్నన్ ఎప్పుడూ అరటి చెట్లను గాని, కొబ్బరి మొలకలనుగాని ముట్టుకునేది కాదు. వాటని ఎంతో శ్రద్ధతో, శ్రమతో నాటారని దానికి తెలుసు. వాటిని నాటిన వాళ్ళను కొమ్ములతో పొడవడం కన్న వాటిని తొక్కేయడం ఘోరమని దానికి తెలుసు. దున్నడం అయిపోగానే, కన్నన్ ఒంటిమీద బురదా మట్టీ అంతా కడిగేసేవాళ్ళూ. ఓసెఫ్‌కు ఈ విషయంలో మాత్రం పట్టుదల ఎక్కువ.

"కుడికాలు ఇటువైపు లేపు –ఆఁ!– తలెందుకట్లా ఊపుతున్నావ్? నీ కొమ్ములు నాకు తగిలాయంటే చూసుకో! సరిగ్గా నించో లేవూ... కదలకు..." ఓసెఫ్ మాట్లాడిన ఈ మాటల్లో ప్రతి ఒక్కటీ కన్నన్‌కు అర్థమయ్యేది. అయితే ఈ భాష దానికంతగా నచ్చేది కాదు. అసలు కడగడం అంటేనే దానికి అయిష్టం. కాని ఓసెఫ్ మీద ఉన్న ప్రేమకొద్దీ ప్రతిసారీ లొంగిపోయేది. హృదయంలోని ప్రేమానురాగాల్ని ఎట్లా వాడుకోవాలో తెలియని రైతులు "ఏ మొండి ఎద్దునైనా తీసుకుపోయి ఒక్కసారి ఓసెఫ్‌కు అప్పజెప్పండి. ఒక్కసారి తన చేతులతో తినిపించాడంటే, ఆ పశువు కొత్త రూపమెత్తుతుంది," అనేవాళ్ళు. ఎద్దులతో ఓసెఫ్ సహజంగా మాట్లాడేవాడు. రోజంతా ఓసెఫ్ తన ఎద్దుకు మేత పోగేస్తూనే గడిపేవాడు. పశువుల పట్ల క్రూరత్వాన్ని మానాలని ఉపన్యాసాలు వింటే ఓసెఫ్‌కు చిర్రెత్తేది. "పశువుల్ని రక్షించాలి, పశువుల్ని రక్షించాలి అని ప్రతివాడూ ఉపన్యాసమిచ్చేవాడే. ఏ ఊళ్ళోనైనా ప్రభుత్వం ఒక వరిపొలాన్నయినా పశువుల కోసం వదిలేసిందా? ఏం? గడ్డం తినిపించి రక్షిస్తారా పశువుల్ని?"


కన్నన్‌కు మేత వేసిన తర్వాతనే ఓసెఫ్ తన ఆకలి తీర్చుకునేవాడు. దొడ్లో పశువులు మేతకు మాడితే, ఆ ఇంటికి అరిష్టం దాపురిస్తుందని ఓసెఫ్ నమ్మకం. లేదా, అనాస ఆకులు కన్నన్ నోటికి అందిస్తున్నాడంటే, ముళ్ళన్నీ కత్తిరించి, ఆకులు ముక్కలు చేసి ఇచ్చాడన్నమాటే.

కన్నన్ పొలాల్లో తిరిగి ఇంటివాకిట్లో అడుగు పెట్టగానే, "హెయ్ కన్నన్," అని కేకేసే వాడు ఓసెఫ్. ఆ గొంతు వినగానే ఎద్దు ఆగిపోయేది. మోర పైకెత్తి ఓసెఫ్ తన దగ్గరి కొచ్చేవరకూ చూస్తూ నిలబడేది. చేతినిండా గడ్డిపరకలతోనో, కాసిన్ని అరటి తొక్కలతోనో, ఏదో ఒక చిన్న కానుక పట్టుకుపోయేవాడు ఓసెఫ్. కన్నన్ అట్లా చేతుల్లోంచే తినేసేది. ఓసెఫ్ ప్రేమగా దువ్వుతుండగా, కన్నన్ అతణ్ణి నాకుతుండేది. ఓసెఫ్ ఎండిపోయిన చెమట ఉప్పన కన్నన్‌కు చాలా ఇష్టంగా ఉండేది.

II

ఎంత గుంపులోనుంచి అయినా కన్నన్ ఓసెఫ్ గొంతు గుర్తుపట్టేసేది. మేఘ గర్జన విని పురి విప్పిన నెమలిలా అది ఆనందించేది. పొలంలో ఓసెఫ్ నాగలి పట్టాలని కూడా దానికి పట్టుదలగా ఉండేది. నాగలి ఇంకెవరు పట్టినా అది తన కొంటెతనం చూపెట్టేది. అది ఆపడానికి మళ్ళీ ఓసెఫ్ జోక్యం చేసుకోవలసి వచ్చేది. "కన్నన్ – వద్దు. మన కుట్టప్పనే కదూ, నీకు తెలిదా ఏం?" అనేవాడు. అట్లా ఓసెఫ్ శాంతి కుదిర్చేవాడు. పొలాల్లో రైతులకు ఒక ఆలాపన ఉంటుంది. అందులో పదాలూ, వాక్యాలూ ఏమీ ఉండవు. ఓసెఫ్ కూడా 'హో' అని గొంతెత్తి అందంగా ఆ ఆలాపన చేసేవాడు. ఒకటి రెండు నిమిషాల పాటు ఆ మాధుర్యం అలా స్పష్టంగా నిలిచి ఉండేది. ఈ సంగీతం ప్రేమగీతాలలోను, బృందాగానాలలోను వినిపించే మధుర స్వరాలకు గ్రామీణ బాణీలా ఉండేది. బహుశా దాన్ని పవిత్రగీతంగానో, పశువుల మంత్రంగానో వర్ణించడం సరిగా ఉంటుందేమో. ఓసెఫ్ ఆ గీతం ఎత్తుకున్నాడంటే, కన్నన్ ఆలసటనూ, బాధనూ, పనినీ కూడా మరచిపోయి సంగీతంలో మునిగిపోయేది.

మెడలోని గంటలు, నేలలోకి దిగుతున్న గిట్టలు ఆ గీతానికి తాళం వేసేవి. ఓ రోజు చిత్రమైన సంగతి జరిగింది. తుండతిల్ కేలన్ కొడుకు పచన్ నాగలి కట్టాడు. సన్నగా కీళ్ళనొప్పి వచ్చి ఓసెఫ్ ఆ రోజు ఇంట్లోనే పడుకున్నాడు. ఓసెఫ్ ఎద్దులు లేకుండా కేలన్ పొలంపని ఆ రోజు పూర్తికాదు. కనుక కన్నన్‌ను, దాని జత ఎద్దునూ తీసుకుపొమ్మని ఓసెఫ్ చెప్పాడు. మిగతా ఎద్దులతోపాటు ఈ రెండూ కూడా పొలంలో ప్రవేశించాయి. ఆ మడి ఒకసారి దున్నడం అయిపోయింది. రెండో దుక్కి మొదలుపెట్టాక పచన్‌కు పాట ఎత్తుకోవాలనిపించింది. కన్నన్ వెనకనుంచి పచన్ ఆలాపన ప్రారంభించాడు. కాని ప్రపంచంలోకెల్లా సంగీత రహితుడైన ఆ మనిషి ఎందుకు పాడాలనుకున్నాడు? పాడాలనిపించిది, పాడాడు – అంతే. ఆ దారుణమైన సంగీతం మొదలుకాగానే కన్నన్‌కు అసంతృప్తి కలిగింది. తల వేగంగా అటూ ఇటూ ఊపి తన నిరసన ప్రకిటించింది. పచన్‌కు ఇదేమీ ఎక్కలేదు. తాను బాగా పాడుతున్నానే అనుకుంటున్నాడు. తమ పాట ఎంత ఘోరంగా ఉన్నదో గాయకులు గుర్తించకపోవడం సంగీతంలో సహజమైనదే. కాసేపటికి కన్నన్ తన అసంతృప్తిని స్పష్టంగానే



ప్రకటించింది. ఐనా పచన్ పాట ఆపలేదు. పచన్ స్నేహితులకు ప్రపంచంలోని ఏ రాగమైనా ఒకటే. కన్నన్‌కు వాళ్ళ తోడ్పాటేమీ దొరకలేదు. పచన్ సంగీతాన్ని అవమానించాడని, కన్నన్ కుడికాలు మీద బలంగా తన్నింది. మూడు రోజులపాటు ఆ సంగీతకారుడు ఇంట్లో ఉండి కాపడం పెట్టించుకోవలసి వచ్చింది.

ఓసెఫ్ దగ్గర కన్నన్ పన్నెండేళ్ళపాటు విశ్రాంతి లేకుండా పనిచేసింది. ఈ మధ్య ఎన్నో వసంతాల్లో శిశిరాల్లో పంటలు ఇంటికొచ్చాయి. చెట్లూ, దుబ్బులూ ఎన్నో శీతాకాలాల్నీ, ఎంతో మంచునూ చూశాయి, పాలితుల ముందు ప్రభువులు చూపిన అనేక సింహాసనాలూ, రాజదండాలూ కూలిపోయాయి. బ్రహ్మాండమైన మార్పులు జరిగిపోతున్నాయి. మనిషిని మనిషి దోపిడీ చేయడానికి వీలులేని కొత్తరకం పాలన లాంటి సంతోషకరమైన మాటలు వినబడ్డాయి. కాని ఓసెఫ్ తనకెంతో ఇష్టమైన ఎద్దుల్ని అమ్మెయ్యవలసివచ్చింది. అప్పటికే అతను బంగారుబాతు లాంటి వరిపొలాన్ని తాకట్టు పెట్టేశాడు. ఇష్టపూర్వకంగా ఏమీ కాదు. కాని అంతకన్న గత్యంతరం లేదు. అతనికి పెళ్ళీడు దాటుతున్న ఒక ముద్దుల కూతురు ఉంది. పెళ్ళికొడుకు కుటుంబం పైసకు ఠికాణా లేనిదే అయినా, మూడువేల రూపాయల కట్నం అడగడంతో ఓసెఫ్‌కు గత్యంతరం లేకపోయింది. పొలాన్ని పదిహేనువందల రూపాయలకు తాకట్టు పెట్టేశాడు. కట్నానికి అది సరిపోయింది. పెళ్ళి ఖర్చులకు ఇంకా డబ్బు కావాల్సివచ్చింది. అందుకని, ఎద్దులంటే ఎంత ప్రేమ ఉన్నా, వాటిని అమ్మెయ్యక తప్పలేదు.

ఇరవై సంవత్సరాలపాటు అతను రాత్రింబవళ్ళూ కష్టపడి పనిచేశాడు. అతను అందరికీ తెలిసిన రైతు. కాని చివరికి ఫలితం ఏమిటి? అతని తల నెరిసిపోయింది. చూపు మందగిస్తోంది. ఒళ్లంతా ముడతలు పడింది. కీళ్ళ నొప్పులు మొదలయ్యాయి. పనితో అతని చేతులెట్లా కాయగాశాయంటే, కత్తికూడా దిగేదికాదు. ఏం చేస్తాడతను మరి? ఐదువేల ఏళ్ళ కిందటి సాధనాలతో పని చేస్తుండేవాడు. నేలలో సారమంతా పోయింది. వెయ్యటానికి ఎరువులేమీ లేవు. తన జీవిత సాధనమూ మోక్షసాధనమూ అయిన భూమిని పరిరక్షించమని అతను వరుణ దేవతను, మేఘాలను, పర్వతాలను, వాయుదేవతను ప్రార్థించాడు. ఏళ్ళకొద్దీ సాగిన ఆ ప్రార్థనల నిష్ఫలత్వం నుంచి అతనింకా చేరుకోలేదు. కాని, దుకాణాలూ పెరిగాయి, దోపిడీ పద్ధతులూ పెరిగాయి. అతను అవమానపడే విషయాలన్నీ పెరగడం మొదలయింది.

కన్నన్‌ను అమ్మినప్పుడు ఓసెఫ్ అక్కడలేడు. క్రయపత్రం విషయంలో అతనికి ఒక రూపాయి రుసుము రావాల్సి ఉండింది. కాని ఎన్ని రూపాయిలయినా ఆపలేని కన్నీళ్ళతో అతను అక్కడ్నించి వెళ్ళిపోయాడు. ఆ ఆవరణ వదిలిపోవాలంటే కన్నన్‌కు కష్టం కలిగింది. తల పైకెత్తి, తన యజమాని, తన ప్రాణానికి ప్రాణం అక్కడ ఉన్నాడేమోనని చుట్టూ చూసింది. ఎక్కడో ఏదో పొరపాటు జరిగిందనుకుంటున్నట్టుగా ఒకటి రెండు సార్లు ఆగిపోయింది. ఆ సమయానికి దక్షిణం వేపు పనసచెట్టు కింద నిలబడి ఓసెఫ్ మౌనంగా కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు.

ప్రేమకు ఎప్పుడూ మాటలూ, ప్రదర్శనలూ అవసరం లేదు. ప్రేమంటే దుఃఖం తెలిసిన రెండు హృదయాల సాన్నిహిత్యమే; అయితే, ఓసెఫ్, కన్నన్‌ల కన్నా ఒకరికొకరు దగ్గరయినవాళ్ళు మరెవరూ ఉండరు. వాళ్ళు తమ కష్టాల్ని ఒకరికొకరు చెప్పుకోలేదు. అందువల్ల ఆ రెండు హృదయాలూ మరింత ఎక్కువ బాధను అనుభవించాయి.

III

దీక్షాదినాలు ముగిసిపోయి ఈస్టర్ పండగ వచ్చింది. ఎంత పేదవాళ్ళయినా సరే, క్రైస్తవులకు ఇది ఒక ఆనందోత్సాహాల దినం. ఆ రోజున ప్రతి వంటగదిలోంచీ ఘుమఘుమలాడుతూ మాంసం వాసనలొస్తాయి. మూకుళ్ళలో అప్పాలు సుయ్యిమని చప్పుడు చేస్తూ మత్తెక్కించే వాసనల్ని వెదజల్లుతుంటాయి. వేడి మాంసం కూర, కొబ్బరి ముక్కలు, అట్లు, కొన్ని పళ్ళేలు అక్కడ ఉంటాయి. అక్కడ ఎటు చూసినా సంతోషమే. ఈ అద్భుతమైన రోజున ఆనందంలేని ఇళ్ళుండనే ఉండవు. కాని ఓసెఫ్ దేనికోసమో ఎదురుచూస్తూ కూర్చున్నాడు. దగ్గర్లో ఎవరో పొలం దున్నుతున్నారు. ఆ నాగలివాడి మధురస్వరం ఓసెఫ్‌కు వినబడుతోంది. ఆ పాట అతనిలోని రైతు హృదయాన్ని దహించివేస్తోంది. దొడ్లో సాలెగూళ్ళు నిండి, ఎత్తుగా నిలబడి ఉన్న నాగలిని చూస్తే అతని హృదయం బాధతో నిట్టూరుస్తోంది. మళ్ళీ తనకు జీవితంలో ఎప్పుడైనా కన్నన్‌లాంటి

ఓ జత ఎద్దులు, ఓ నాలుగైదెకరాల మంచి భూమి వచ్చి ఈ నాగలిని ఉపయోగించగలుగుతాడా? అటువంటి రోజును చూసే అదృష్టం తనకుందా అని ఓసెఫ్ నిస్సహాయంగా ఆలోచించాడు.

"ఏమయ్యోవ్; ఎంతసేపని అట్లా కూచుంటావ్? జరిగిందేదో జరిగిపోయింది. కొట్టాయం వెళ్ళవా ఏమిటి? దాన్ని రేపు అత్తారింటికి పంపిచవా ఏం?" ముభావంగా కూచున్న ఓసెఫ్‌ను భార్య మరియా మందలించింది.

కూతుర్ని మర్నాడే అత్తారింటికి పంపించాలి. ఇంకా పెట్టాల్సిన బట్టలు పెట్టనే లేదు. ఓసెఫ్‌కు ఇష్టం లేక కాదు గాని చేతిలో డబ్బులు లేవు. మరియా ఇరవై రూపాయల చీటీ కడుతోంది. దుర్భరమైన రోజుల్లోకూడా కడుపు కట్టుకుని, ప్రతి మెతుకూ జాగ్రత్తగా చూసుకుంటూ వాళ్ళు ఆ చీటీ కడుతున్నారు.

ఓసెఫ్ ఇంక దుకాణానికి వెళదామని లేచి నిలబడ్డాడు. "నాన్నా, రవికల గుడ్డ కాస్త మందం ఉండేట్టు చూడు," అని చెప్పింది కత్రికుట్టి.

"భూమి శిస్తు కట్టలేదు గదూ, అదికూడా కట్టిరా," అంది మరియా.

ఓసెఫ్ చంకలో గొడుగు పెట్టుకుని, భుజంమీద ఓ తుండు వేసుకుని, బొడ్లో ఓ పాన్ దోపుకుని బయల్దేరాడు.

ఈస్టర్ సందడి, ఆనందోత్సాహాలు కొట్టాయంలో ఏమీ తక్కువలేవు. క్రైస్తవుల దుకాణాలు ఒక్కటి కూడా తీసిలేవు. కాని బట్టల దుకాణాలు చాలానే ఉన్నాయి. ఓసెఫ్ ఒకటి రెండు దుకాణాలలోకి వెళ్ళి రకరకాల బట్టల ధరలు, నాణ్యం కనుక్కున్నాడు.

"అబ్బో – ఎంత ధరో!" బట్టల ధర విపరీతంగా ఉన్నదని అతని అభిప్రాయం. "ఏదేమైనా నేనింకో రెండు మూడు దుకాణాల్లో కనుక్కోవాలి. ఎక్కడ అణా తక్కువకు దొరుకుతుందో ఎవరికి తెలుసు" అనుకున్నాడు. అట్లా దుకాణాలన్నీ తిరిగాడు. అట్లా నడుస్తూ నడుస్తూ మునిసిపల్ భవనం ముదుకు చేరుకున్నాడు. అక్కడ, గోడ బైటనే, చాల ఎద్దుల్ని వరుసగా నిలబెట్టారు. అవన్నీ ఎంత బక్కచిక్కి ఉన్నాయంటే వాటి పక్కటెముకలు లెక్కపెట్టొచ్చు. ఎముకలమీద కప్పిన చర్మం తప్ప మరేమీ లేదు. వాటిలో కొన్ని చివరి రోజుల్లో కొచ్చిన ముసలి ఎద్దులు. కొన్నిటికి తోకలు తెగిపోయాయి. కొన్నిటికి ఏళ్ల తరబడి బళ్లు లాగిన గుర్తుగా మెడలు కాయగాసి ఉన్నాయి. కొన్నిటికి కొమ్ములు ఎదుగుదల ఆగిపోయి చాలా రోజులయినట్టున్నాయి. కొన్ని మనిషి భూతదయలేమిని ప్రకటిస్తున్నాయి. ఆ ఎద్దుల్లో అటువంటి సంగతులెన్నో కనబడతాయి. వాటన్నిటిమీదా మునిసిపాలిటీ నల్లని మృత్యుముద్ర వేసింది. వాటిలో ఇంకా ఏమన్నా మిగిలి ఉంటే ఈస్టర్ పర్వదినాన మాంసంగా మారబోతోంది. అట్లా ముద్రవెయ్యని పశువుల్ని కోసి అమ్మే కటికవాళ్ళమీద మునిసిపాలిటీ కఠిన చర్యలు తీసుకుంటోంది. ప్రజల ఆరోగ్యాన్ని అన్నిటికన్న మిన్నగా భావించే మునిసిపాలిటీ ఈ పరీక్షను ఎప్పుడూ సడలించలేదు. ఓసెఫ్ అక్కడ నిలబడి కాసేపు తేరిపార జూశాడు. అతని దయాహృదయం కదిలిపోయింది. అప్పటికే అక్కడ మొత్తం దాదాపు నలభై ఎద్దులున్నాయి. ఇంకా ముద్ర వెయ్యడానికి రైతులు పశువుల్ని తీసుకొస్తూనే ఉన్నారు. ఓసెఫ్ వాటివంక మరణశిక్ష పడిన మిత్రులవేపు చూసినట్టు చూసి ఉత్తరం వైపు నడక సాగించాడు.

హఠాత్తుగా అతను వణికిపోయాడు. నమ్మశక్యం కాని సంగతి. మందగిస్తున్న కంటిచూపు మోసం చేయడం లేదు గదా అనుకున్నాడు. అక్కడ ఎముకలు తేలిన ఓ పశువును చూసి, ఆ వృద్ధుడి హృదయం కుంగిపోయింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. జలదరింపు కలిగింది. ఔను, అది కన్ననే.

"కన్నన్" అంటూ గుండె లోలోతుల్లోంచి కేకవేశాడు. ఒక్క గంతులో ఆ పశువును చేరుకున్నాడు. తనకు సౌఖ్యాన్నీ, ఆశనూ కలిగించిన ఆ గొంతు విని, పశువు మొద్దుబారిపోయింది. కన్నన్ అప్పుడు ఆ బ్రహ్మాండమైన భవనం ముందర తలదించుకుని ఉంది. మళ్ళీ ఒకసారి దాని చెవుల్లో జీవితం ప్రతిధ్వనించింది. తల పైకెత్తి చుట్టూ చూసింది.

"బిడ్డా, నన్ను గుర్తుపట్టావా? నిన్నీ స్థితిలో చూడవలసి వచ్చిందా?' ప్రేమ స్పందిస్తున్న గుండెలకు అతను ఆ పశువును హత్తుకున్నాడు. దాని తలమీద నిమిరాడు. ఆ చేతుల స్పర్శ గుర్తించగానే అది తోకెత్తింది. అది తన నోటితోకాదు,

హృదయంతో ఏడ్చింది. కన్నన్ మీద కూడా ముద్ర ఉందేమోనని చూశాడు ఓసెఫ్. ఔను, ముందరికాళ్ళమీద ముద్ర స్పష్టంగా ఉంది. దాన్ని చెరిపెయ్యడానికి ప్రయత్నించాడు. కాని మునిసిపాలిటీ వేసిన ఆ నల్లముద్రను చెరపడం అంత సులభం కాదు.

IV

కన్నన్‌కు కడుపుకింద ఒక రసి కారుతున్న పుండు ఉంది. దాని చుట్టూ ఈగలు ముసురుతున్నాయి.

"ఇదివరకు ఈ ఎద్దు నీదా?" అని అడిగాడు ఒక కటికవాడు.

"దీన్ని ఇక్కడికి తీసుకొచ్చింది నువ్వేనా?" అని అతణ్ణి అడిగాడు ఓసెఫ్.

"ఔను" అన్నాడు కటికవాడు.

కన్నన్ తన ప్రియమైన యజమాని చెమటబారిన ఒంటిని నాకడం మొదలుపెట్టింది. ఆ చెమటను చల్లబరచడానికే అది తన జీవితంలో అత్యధికం వెచ్చించింది. తన జీవిత చరమదశలో కూడ ఆ చెమటే నాకుతోంది. ఆ చెమట రుచి దానికి బాగుంటుంది, అది దాని జీవితంలో భాగం. ముసలిరైతు వెచ్చని కన్నీళ్ళు కన్నన్ ముఖంమీద రాలాయి.


"వెళ్ళనీ, ఇప్పటికే ఆలస్యమైంది. మధ్యాహ్నంలోపు ఈ మాంసం దుకాణానికి చేర్చాలి" ఒకరితో ఒకరు మాట్లాడుకుంటున్న ఆ ఇద్దర్నీ ఉద్దేశించి అన్నాడు దుకాణదారు. రెండు మూడు ఎద్దుల్ని తీసుకుని వెళ్ళిపోతున్న వ్యాపారుల్లో ఒకరు కన్నన్‌ను కూడా తీసుకురావాలని సైగచేశాడు. అంతే ఇక, ఓ రెండు మూడు గంటల్లో కన్నన్ ఈస్టర్ విందుకు మాంసాహారాన్ని సమకూరుస్తుంది.

చీకటి పడుతోంది. "దీపాలు పెట్టేలోపు ఈ అరుగు ఊడ్చెయ్యమ్మా" ఓసెఫ్‌కోసం ఎదురుచూస్తున్న మరియా కూతురికి చెప్పింది.

"నాన్నకింత ఆలస్యమయిదేమిటమ్మా?" అడిగింది కత్రి.

"పనిమీద వెళ్ళాడుగా, రానీ" అని మరియా సర్దిచెప్పింది.

"కొట్టాయంకే వెళ్ళి ఉంటే, ఎప్పుడో రావాల్సింది" తన బట్టలకోసం ఎదురుచూస్తున్న కత్రి అసహనంగా అంది. ఆమె కళ్ళు దారిమీదనే ఉన్నాయి. మరియా కూడ ఎదురుచూస్తూనే ఉంది. ఓసెఫ్ జాడలేదు. దీపం వెలిగించారు.



కింద ఆమె ఒక తెల్ల ఆకారాన్ని చూసింది. "అమ్మా, నాన్న వచ్చాడు. ఔనౌను, నాన్నే" కత్రి ఆనందంగా కేకలు వేసింది. నాన్నను తానే మొట్టమొదట చూశానని సంబరంగా ఉంది. తల్లీకూతుళ్ళిద్దరూ ఒకే ఆలోచనతో చూస్తూ నిలబడిపోయారు.

బట్టలకోసం ఆశగా ఎదురుచూస్తున్న ఆ యువతి కళ్ళ ముందరే ఓసెఫ్ కన్నన్‌తో కలిసి లోపలికి వచ్చాడు.

"ఓయ్, ఇది కన్నన్," కత్రి ఆశ్చర్యంతో అంది.

"బట్టలేవి? నువు దీన్ని కొనుక్కొచ్చావా?" అడిగింది మరియా. కన్నన్ తన పాత దొడ్లో ప్రవేశించి సంతోషంతో నేలమీద ఒరిగింది.

వాళ్లు అతణ్ణి వెయ్యి ప్రశ్నలతో వేధించారు. గొంతెత్తి అరిచారు. ఓసెఫ్ ఒక్కమాట మాట్లాడలేదు. అతని ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది.

"నాన్నా, నువ్వు నాకింత పని చేస్తావని ఎప్పుడూ అనుకోలేదు" కళ్ళనిండా నీళ్ళతో అంది కత్రి.

"బిడ్డా," తండ్రి డగ్గుత్తికతో జవాబిచ్చాడు "నాకు నువ్వెంతో కన్నన్ అంతే. కసాయివాళ్ళు..." తుండుతో కళ్ళొత్తుకున్నాడు. అతను ఆ వాక్యం పూర్తిచెయ్యలేక పోయాడు.

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది అంశాల గురించి తెలపండి.

అ) ఈ కథను సొంతమాటల్లో చెప్పండి.

ఆ) 'మాట్లాడే నాగలి' అనే పేరు ఈ కథకు సరైందేనా? ఎందుకు?

2. కింది వాక్యాలు పాఠంలో ఏ పేరాలో ఉన్నాయో గుర్తించండి. ఆ వాక్యాల కింద గీత గీయండి.

ఒకసారి దాని చెవుల్లో జీవితం ప్రతిధ్వనించింది.

అది తన నోటితో కాదు; హృదయంతో ఏడ్చింది.

3. కింది పేరా చదవండి. ఖాళీలు పూరించండి.

ఒక పండుగరోజు ఆశ్రమంలో సేవచేస్తున్న ఒక ముసలమ్మ హాలుకు ఎదురుగా ఉన్న గడపలకింద ఉన్న నేలమీద ముగ్గులు వేస్తోంది. అది రమణమహర్షిగారి కంట పడింది. పొటీ! అని భగవాన్ పిలువగా ఎంతో సంతోషంగా భగవాన్ దగ్గరకు వచ్చిందామె. ఇదిగో అవ్వా! కష్టపడి ముగ్గులు పెడుతున్నావు గాని అది బియ్యపుపిండేనా? అన్నారు భగవాన్. కాదు! రాతి ముగ్గే అంది ఆ అవ్వ. అయ్యో! చీమలకైనా ఉపయోగం ఉండదే. ముగ్గులు పెట్టడం అంటే చీమలకు ఆహారం వేయడమన్నమాట. ఆ ధర్మం విడిచిపెట్టి అచ్చంగా

రాతిముగ్గే పెడితే చీమలు ఆ పక్కకే రావు. ఒకవేళ వచ్చినా ఆ ఘాటుకు చచ్చిపోతాయి కూడా. ఎందుకది? కొంచెమైనా బియ్యపు పిండి చేర్చుకోండి – అని సెలవిచ్చారు భగవాన్. ఆ మాటలు విన్నవారొకరందుకొని "ధనుర్మాసంలో ముగ్గులు అధికంగా పెట్టడం చీమలకు ఆహారం వెయ్యడం కోసమేనా!" అన్నారు. ఆ! కాకపోతే మరియేమి? కొత్త ధాన్యం వచ్చిన సంబరంతో రంగవల్లులు తీర్చి చీమలకు ఆహారం వేస్తారన్నమాట. 'పెద్దలు నిర్ణయించిన ఆచారాలన్నీ జీవకారుణ్యంతో కూడినవే! ఇప్పుడవి పాటించేదెవరు? అలంకారానికి ఏదో చేస్తారంతే' అన్నారు భగవాన్.

అ) జీవకారుణ్యం అంటే _____

ఆ) ముగ్గులు పెట్టడంలో అంతరార్థం _____

ఇ) పూర్వాచారాలను పాటించాలి ఎందుకనగా _____

ఈ) పై పేరాకు శీర్షిక _____

ఉ) పై పేరాలోని 5 ముఖ్యమైన పదాలు _____

4. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) ఓసెఫ్ కన్నన్‌తో ఎలా మాట్లాడేవాడు?

ఆ) వేటిని తొక్కి పాడుచేయడం ఘోరమైన పని అని కన్నన్ అనుకుంది?

ఇ) పశువుల విషయంలో ఓసెఫ్‌కున్న నమ్మకం ఏమిటి?

ఈ) పచన్ పాటపాడుతుంటే ఏం జరిగింది?

ఉ) ఇరవై సంవత్సరాలు వ్యవసాయం చేసిన ఓసెఫ్‌కు లభించిన ఫలితం ఏమిటి?

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) కన్నన్ స్థానంలో నువ్వుంటే ఏం చేసిఉండేవాడివి?

ఆ) 'పశువుల పట్ల క్రూరత్వాన్ని మానాలని ఉపన్యాసాలు వింటే ఓసెఫ్‌కు చిర్రెత్తేది' ఎందుకని?

ఇ) క్రయపత్రం అంటే ఏమిటి? ఏ సందర్భాల్లో దీన్ని ఉపయోగిస్తారు?

ఈ) కన్నన్‌తో తిరిగివచ్చిన తండ్రిని చూసి కత్రి "నాన్నా!" అంది. అలా అనడంలో ఆ అమ్మాయి ఉద్దేశం ఏమిటి?

ఉ) ఈ కథను కొనసాగించి మీకు తోచిన ముగింపునివ్వండి.

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) కన్నకూతురితో సమానంగా ఓసెఫ్ కన్నన్‌ను చూడటానికి కారణం ఏమిటి?

ఆ) మూగ జీవాల మీద ఎందుకు ప్రేమ చూపించాలి?

3. సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

"మూగజీవులకు నోరొస్తే....." ఊహాత్మకంగా కథ రాయండి.

III భాషాంశాలు

పదజాలం

1. గీతగీసిన పదాలకు అర్థాలు రాసి ఆ పదాలను సొంతవాక్యాలలో రాయండి.

ఉదా: **వృషభం** పరమేశ్వరుడి వాహనం.

వ్యవసాయ రంగంలో ఒకప్పుడు **ఎద్దు** కీలకపాత్ర పోషించింది.

అ) పిల్లల మనసులో ఏముంటుందో తల్లి పసికడుతుంది.

ఆ) దొడ్లో పశువులు మేతకు మాడితే ఆ ఇంటికి అరిష్టం దాపురిస్తుందని వ్యవసాయదారుల నమ్మకం.

ఇ) వర్షాకాలం రాగానే రైతులు వ్యవసాయ పనుల్లో మునిగిపోతారు.

ఈ) పాలకులు ప్రభావం పాలితుల సంస్కృతిపై ఉంటుంది.

ఉ) సమ్మెకాలంలో గత్యంతరం లేక ప్రజలు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం చేశారు.

2. కింది పదాలకు అర్థాలను రాయండి.. వీటితో సొంతవాక్యాలు రాయండి.

అ) మడి/మడిచెక్క ఆ) ఆలాపన ఇ) బృందగానం ఈ) ఠికాణా

వ్యాకరణాంశాలు

1. కింది సమాసాలకు ఉదాహరణను, విగ్రహవాక్యాన్ని రాయండి.

సమాసంపేరు	ఉదాహరణ	విగ్రహవాక్యం
అ) అవ్యయీభావ సమాసం		
ఆ) ద్వంద్వ సమాసం		

2. కింది పద్యపాదాలను గణవిభజనచేసి యతి ప్రాసలను గుర్తించండి.

కొంకనివాఁడెదాత, మిముఁగొల్చి భజించినవాఁడెపో నిరా
తంక మనస్కుడెన్నగను దాశరథీ కరుణా పయోనిధీ.

భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

- పెంపుడు జంతువులు యజమానుల నిర్బంధంలో పడే బాధల్ని సంభాషణ రూపంలో రాసి, ఆయా జంతువుల మాస్క్‌లతో కొరియోగ్రఫీ రూపొందించి ప్రదర్శించండి.

సూక్తి

కపట మానవప్రేమకన్నా
కల్మషంలేని మూగజీవుల అనుబంధం మిన్న



1. ఎం.ఎస్.సుబ్బలక్ష్మి

జాతీయ ప్రతిపత్తి గల కొద్దిమంది కర్నాటక సంగీత విద్వాంసులలో ఒకరుగా పేరొంది, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రత్యేకతను సంతరించుకున్న ఎం.ఎస్.సుబ్బలక్ష్మి అన్ని వయసుల శ్రోతలను ఆకర్షించే గాన మాధుర్యం కలది. ఉచ్ఛస్థాయిలో ఎక్కువసేపు రాగాలాపన చేయడంలో ఆమె మంచి దిట్ట. సాహిత్యంలోని అంతరార్థాన్ని ఆమె తన గాన మాధుర్యంతో రక్తి కట్టించేది. మహిళాభ్యుదయానికి అవిశ్రాంత పోరాటాన్ని జరిపి, సంగీత ప్రపంచంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించి, భవిష్యత్తరాల గాయనీమణులకు మార్గదర్శకురాలయ్యింది. ఎంత ఎదిగినా వినయం తొణికిసలాడే ఆమె సంప్రదాయ గృహిణిగా, నిగర్విగా ఉంటూ ఎందరికో అభిమాన పాత్రురాలయ్యింది.

1916 సెప్టెంబరు 16న తమిళనాడులోని మధురైలో సుబ్బలక్ష్మి జన్మించింది. ఈమె పూర్తిపేరు షణ్ముఖవడివు సుబ్బులక్ష్మి. ఈమె తండ్రి సుబ్రహ్మణ్య అయ్యర్ సంగీత ప్రియుడు. తల్లి వడిపు వీణా విద్వాంసురాలు. సుబ్బలక్ష్మికి తనతల్లే తొలిగురువయ్యింది. తల్లి దగ్గరే గాత్ర సంగీతాన్ని, వీణను నేర్చుకుంది. అమ్మమ్మ అక్కమ్మాళ్ వయోలిన్ విద్వాంసురాలు సోదరుడు శక్తివేల్ మృదంగ వాద్యకారుడు. విద్వాన్ మదురై శ్రీనివాస్ అయ్యంగర్ వద్ద సుబ్బలక్ష్మి బాల్యంలో కొంతకాలం సంగీతం అభ్యసించింది. ఆయన అకాల మరణం కారణంగా ఆమె స్వయంగా భక్తిగీతాలను గంటలకొలదీ, తనదైన విలక్షణ శైలిలో సాధన చేసేది.

మదురైలోని ఒక పెళ్ళి కార్యక్రమంలో సుబ్బలక్ష్మి తన తొలిసంగీత కచేరీని పదవ ఏటనే చేసింది. ఈమెకు కొంతకాలం వరకు సోదరుడే వాద్యసహకారం అందించేవాడు. తండ్రి నుండి ఎంతో క్రమశిక్షణను మనోధైర్యాన్ని నేర్చిన ఈమె బాల్యంలోనే తండ్రిని పోగొట్టుకొని ఎంతో విచారించింది. మద్రాసుకు మకాం మార్చడంతో తనతల్లి స్నేహితురాలు విదుషీమణిని ఈమె కలిసింది. సుబ్బలక్ష్మిలోని గాత్ర ప్రతిభా విశేషాలను విదుషీమణి గుర్తించి మరింత పదును పెట్టింది. తన పదవ ఏటనే సుబ్బలక్ష్మి తొలి గ్రామఫోన్ రికార్డును ఇచ్చింది. ఆ తర్వాత హెచ్.ఎమ్.వి కంపెనీకి గానతారగా రూపొందింది.

మ్యూజిక్ అకాడమీ వారి రంగస్థలంపై తొలిసారిగా 1932 జనవరి 1వ తేదీన సుబ్బలక్ష్మి కచేరి చేసింది. ఆ తర్వాత ఆమె చేసిన లెక్కలేనన్ని కచేరీలు అభిమానులను మంత్రముగ్ధుల్ని చేసింది. పురుషాధిక్య సంగీత ప్రపంచంలో తన స్థానాన్ని నిలుపుకునేందుకు తనకు ఎదురైన ఎన్నో ఒడిదుడుకులను తన ప్రతిభతో ఎదుర్కొని తన పోరాటాన్ని విజయ పథంలోకి నడిపింది. తన ధైర్యసాహసాలతో అప్పటి సంగీత ప్రముఖులను అబ్బురపరచే ఈమె విమర్శకులచే సైతం ప్రశంసలందుకుంది.

తన సంగీత ప్రతిభ వలన మహాత్మాగాంధీ, సి.రాజగోపాలాచారి వంటి జాతీయనాయకులతో ఆమెకు పరిచయ భాగ్యం కలిగింది.

ఒకసారి సుబ్బులక్ష్మి ముంబైలో కచేరి చేయవలసి వచ్చింది. కచేరి ప్రాంతానికి వెళ్ళడానికి ఆమె ఇతరుల సహకారాన్ని కోరుకుంటున్న సమయంలో టి.సదాశివన్ ముందుకు వచ్చి సహాయపడ్డాడు. అతడు సాతంత్ర్య సమరయోధుడు. మరియు మంచి భావుకుడు. ఆరోజు ఆ పరిచయం వలన సుబ్బులక్ష్మి జాతీయ స్థాయి కచేరీలకు అంకురార్పణ చేయగలిగింది. జీవిత భాగస్వామిగా సదాశివన్‌ను ఎన్నుకొంది. అతడి రెండవ కుమార్తె రాధ సుబ్బులక్ష్మి కచేరిలలో కొంతకాలం వరకు సహకార గానం చేసింది. శిష్యులకోసం ఏమాత్రం ఆశించని ఆమెకు ఏకైక శిష్యురాలు రాధ అయ్యింది.

1940లో తిరునీర్మలైలో వీరి వివాహం జరిగాక సదాశివన్ ఆనందవికటన్ పత్రికలో అడ్వర్‌టయిజ్‌మెంట్ మేనేజరుగా చేస్తున్న ఉద్యోగాన్ని విరమించాడు. సుబ్బులక్ష్మి సంగీత కీర్తి సౌధా నిర్మాణాన్నే తన జీవిత ధ్యేయంగా నిర్ణయించుకున్నాడు. ఆమె సంగీత కచేరీలను ఎంతో ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసేవాడు.

అందం, ప్రతిభానైపుణ్యాలు కలిగిన సుబ్బులక్ష్మి సేవాసదనం, శకుంతలై, సావిత్రి, మీరా అనే నాలుగు చిత్రాల్లో నటించింది. కల్కి తమిళ వారపత్రిక ఆర్థిక సహాయం కోసం ఆమె సావిత్రి సినిమాలో నారదుడి పాత్ర పోషించింది. ఆ పత్రికను సదాశివం ప్రారంభించాడు. సదాశివన్ నిర్మాణంలో మీరా చిత్రం పెద్ద హిట్ అయ్యింది. ఆ తర్వాత హిందీలో పునర్నిర్మితమై జాతీయస్థాయి ప్రశంసలూ పొందింది. మీరా చిత్రంలో ఆమె ప్రదర్శించిన సౌందర్యం, ప్రతిభ, కృష్ణభక్తి సమపాళ్ళలో ఆవిష్కృతమై ఎందరో ప్రముఖుల ప్రశంసలకు నోచుకుంది. ఈ చిత్రంతోనే సుబ్బులక్ష్మి నెహ్రూ, సరోజినీ నాయుడు వంటి జాతీయ నాయకుల దృష్టిని ఆకర్షించింది. మీరా చిత్రం తర్వాత ఆమె తన నటనకు స్వస్తి చెప్పి భక్తి గీతాలాపనకే అంకితమయ్యింది.

మహాత్మాగాంధీ కోరికపై ఈమె రాంధున్ వైష్ణవ జనతో, హరీతుమ్ హరోభజన పాటలను పాడి రికార్డుచేసి గాంధీకి పంపింది. 1947 అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా సిద్ధం చేసిన ఈ రికార్డును 1948 జనవరి 30 గాంధీ హత్యానంతరం ఆకాశవాణి కేంద్రాలు ప్రసారం చేసినపుడు సుబ్బులక్ష్మి తన గొంతును మొదటిసారిగా ఆకాశవాణిలో వినింది. గాంధీ హత్య విషయమై బాధ పడిన ఆమె ఆ తర్వాత చాలా కాలం వరకు గాంధీ కొరకు పాడిన భజన పాటలను ఆలపించలేకపోయింది.

సుబ్బులక్ష్మి చిన్న వయసులోనే తన సంగీతాన్ని భక్తి తత్వానికే అంకితం చేసింది. మీరా, తుకారాం, సూరదాస్, కబీర్, తులసీరామ్ మొదలగు భక్త కవుల భజన గీతాలతో పాటు ఆండాళ్, కరైకాళ్, అవ్వయ్యార్ మొదలగు తమిళ సాధకుల కృతులను కూడా పాడింది. ఆదిశంకరుని రచనలలోని సంగీతం పట్ల ఆకర్షితురాలై విష్ణుసహస్రనామం వంటి మంత్రశ్లోకాలను పఠించింది. బెంగాలీ రవీంద్ర సంగీతాన్ని కూడా చక్కగా పాడేది. ప్రాత:కాలాన వినే శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం గానం చేసింది. సంస్కృతంలో కొంత పరిజ్ఞానం ఉండడం వల్ల ఆ శ్లోకాలను చక్కగా ఉచ్ఛరించేది. ముప్పయ్యవ సంవత్సరంలో అడుగుపెట్టేసరికి, ఆమె ఉన్నతశ్రేణి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకుంది. తాను పొందిన పేరు ప్రఖ్యాతులకు కారణమైన వారిని ఆమె తరచు గుర్తుచేసుకునేవారు. అరుదైన పాటలు నేర్పిన శమ్మంగుడి శ్రీనివాసయ్యర్, ముసిలి సుబ్రమణ్యయ్యర్ మొదలగువారు ఆమెగానాన్ని, గాత్రాన్ని మెరుగు పరచారని ఆమె చెప్పేది.

దక్షిణామూర్తి రూపులో శివస్తోత్ర గానంతో ఆమె తన కచేరీని యమునా కళ్యాణి రాగంలో ప్రారంభించేది. వివిధ వర్గాల శ్రోతల కోసం శాస్త్రీయ బాణాలను, లలిత సంగీతాన్ని కలిపి గానం చేసేది. కంచి పరమాచార్య విరచిత శాంతి గీతాలాపన ఆమె కచేరీలో ఆణిముత్యం. కర్నాటక సంగీతానికి ఆమె చేసిన విశిష్టసేవ అన్నమాచార్య కృతులను పునరుద్ధరించడమే ఆమె గాత్రాన్ని రికార్డు చేయడం వలన వివిధ ప్రసార సాధనాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది ఆమె భక్తి సంగీతాన్ని వినగలుగుతున్నారు. సంగీతం అనేది సమైక్యతా బంధ రాగమని ఆమె నమ్మేది.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఉత్సవాల సందర్భంగా కచేరీలు చేసి యాభయ్యవ దశకంలో ఆమె ప్రపంచవ్యాప్త కీర్తిమంతురాలయ్యింది. 1963లో ఎడిన్‌బర్గ్ అంతర్జాతీయ ఉత్సవానికి ఆమె ఆహ్వానం అందుకొంది. 1966లో ఐక్యరాజ్యసమితి

జనరల్ అసెంబ్లీలో కచేరీకై శ్యామశాస్త్రి కృతమైన "సరోజదళనేత్రి" ప్రపంచశాంతిపై రాజగోపాలాచారి ఇంగ్లీషులో వ్రాసిన గీతాన్ని అద్భుతంగా పాడి శ్రోతల్ని ముగ్ధులను చేసింది. ఆమెరికాలో హిందూ దేవాలయాల నిర్మాణం కోసం విస్తృత పర్యటన జరిపింది. విదేశాల్లో జరిగిన ఇండియా మహోత్సవాల్లో పాల్గొని కచేరీలు చేసింది.



1968లో మ్యూజిక్ అకాడమీ వార్షిక సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె తంబూరా శృతిలో స్వరాన్ని కలిపి నడపటం గాయనీ గాయకుల విధి అని, సాహిత్యంలోని భక్తి భావాన్ని శ్రోతలకు గానమాధుర్యం ద్వారా వినిపింపజేయాలని యువగాయనీ గాయకులకు చెప్పింది. గాయకులు తమ గొంతులోని అపశృతులను గ్రహించడానికి వీణ పలికే అపశృతులను గురించి ముందుగా తెలుసుకోవాలని సూచించింది.

ఆమె తన వద్ద ఉన్న త్రివేంద్రం తంబూరాతో శృతి కలిపి సాధన చేసేది. సంగీత సాధన కోసం జీవితమంతా శీతల పదార్థాలను విసర్జించి గొంతు, ఆరోగ్యాన్ని కాపాడుకునేది. ఈమెలోని క్రమశిక్షణ మరియు మూర్తీభవించిన అరుదైన నైపుణ్యాలు ఎందరికో ఆదర్శప్రాయంగా ఉండేది. శ్రీ సత్యసాయిబాబా భక్తురాలైన ఈమె ప్రశాంత ముఖవర్చస్సుతో ఫోటో గ్రాఫర్లను ఆకర్షించేది. ముత్తు చెట్టియార్ పట్టుబట్టల కంపెనీవారు నేసే ప్రత్యేకమైన కంచి చేనేత పట్టుచీరలనే ఆమె ధరించేది. ఆమె ధరించే నీలిరంగు చీరలకు ఎమ్.ఎస్.బ్లూ అనే పేరు వచ్చింది. గాజులు, మల్లెపూచెండులంటే మక్కువ కలిగిన ఈమె వజ్రపు ముక్కుపుడకలు తప్ప ఖరీదైన ఏ ఇతర నగలను ధరించేది కాదు.

సత్యసాయిబాబా భజనలను తొమ్మిది భాషలలో గానం చేసి "సుస్వరలక్ష్మి" అని కీర్తించబడింది. సుమారు వందకుపైగా సహాయకార్యక్రమాలను తన కచేరీల ద్వారా లక్షలరూపాయలు సేకరించి ఇచ్చింది.

మ్యూజిక్ అకాడమీల్లో కచేరీకై ఆమె ఎన్నడూ ధనాన్ని స్వీకరించలేదు. 1962 చైనాపై ఇండియా యుద్ధ సమయంలో యుద్ధనిధికై కచేరీ నిర్వహణతోపాటు తన బంగారు గాజులనూ విరాళంగా సమర్పించింది. రామన్‌మెగసెసె అవార్డులో లభించిన మొత్తాన్ని రెండుభాగాలు చేసి చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌కు చెందిన ఒక ఆసుపత్రికి, కుంభకోణంలోని ఒక వేదాధ్యయన కేంద్రానికి విరాళంగా ఇచ్చింది.

సంగీత ప్రపంచానికి ఈమె చేసిన విశిష్ట సేవలకు గాను ఈమె పొందిన సత్కారాలు ఎన్నో ఉన్నాయి. 1954 సం॥లో పద్మభూషణ్, 1956లో రాష్ట్రపతి నుండి బహుమతి, 1968లో మ్యూజిక్ అకాడమీచే సంగీత కళానిధి అవార్డు పొందిన తొలి మహిళ, 1974లో రామన్ మెగసెసె అవార్డు, 1975లో పద్మవిభూషణ్, 1998లో భారతదేశపు అత్యున్నత పురస్కారం 'భారతరత్న' పొందింది. యునెస్కో ఏర్పరచిన అంతర్జాతీయ సంగీత మండలికి 1981లో గౌరవ సభ్యురాలిగా ఎన్నుకోబడింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఆస్థాన విదుషీమణిగా నియమించబడింది. ఆకాశవాణి ఎమెరిషన్ ప్రొడ్యూసర్‌గా నియమించింది.

వయసు పైబడటంతో పాటు 1997లోభర్త కీర్తిశేషులవడంతో ఈమె కచేరీలు విరమించింది. 2002లో మ్యూజిక్ అకాడమీ ప్లాటినమ్ ఉత్సవాలకు హాజరు కాలేకపోయింది. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ ఈమె ఇంటికి వెళ్ళి గౌరవ పతకాన్ని ప్రదానం చేసారు. చెన్నైలోని కొత్తూరు పురంలో ప్రశాంత జీవనం గడుపుతున్న ఈమె 2004 డిశంబరు 11న అంతిమశ్వాసతీసుకొని మనల్ని దు:ఖసాగరంలో ముంచింది.

ఎం.ఎస్.సుబ్బలక్ష్మి మన మధ్య లేకున్నా దేశవ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో ప్రాత:సమయాల్లో, శుభకార్యాల్లో ఈమె గాత్రమాధుర్యాన్ని ఆచంద్ర తారార్కము వింటూనే ఉంటాము.



2. భక్తరామదాసు

గోదావరి – భద్రాచలం :

భారతదేశంలో పవిత్రమైన నదుల్లో గంగా యమునల తర్వాత చెప్పుకోదగ్గది గోదావరి. గరుడపురాణంలో గోదావరి మానవులకు సకల సౌభాగ్యాలు కలుగజేయడమే గాక మోక్షాన్ని గూడ ప్రసాదిస్తుందని చెప్పబడింది. ఈ గోదావరి దక్షిణ భారతదేశంలోని నదుల్లోకెల్లా పొడవైంది. ఇది మహారాష్ట్రలోని నాసికాత్ర్యంబకంవద్ద పుట్టి ఎత్తైన కొండల మధ్య ఇరుకైన మార్గాలగుండా చిన్న చిన్న నదుల్ని కలుపుకుంటూ 900 మైళ్ళు ప్రయాణించి ఆంధ్రతీరంలో బంగాళాఖాతంలో కలుస్తుంది.

ఈ గోదావరికి ఉత్తరపొడ్డున ఇప్పటి తెలంగాణంలో దట్టమైన అడవుల మధ్య భద్రాచలం వుంది. అయితే ఆ అడవులు 16వ శతాబ్దం తర్వాత అంతరించి ప్రస్తుతం ఈ భద్రాచలం పవిత్రమైన పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుంది. భద్రాచలాన్నే భద్రాద్రి లేక భద్రగిరి అని కూడా అంటారు.

ఈ భద్రాచలం కాకతీయుల పరిపాలనా కాలంలో వారి అధీనంలోకి వచ్చింది. 15వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తాను చేత ఒక జాగీరుగా అన్నప్ప అనే వానికి ఇవ్వబడింది. క్రీ.శ.1860లో నిజాం ప్రభువు బ్రిటీషు ప్రభుత్వానికి దీన్ని దత్తం చేశాడు. అప్పటి నుంచి మనకు స్వాతంత్ర్యం వచ్చేవరకు ఈ భద్రాచలం బ్రిటీషు ఇండియాలో ఒక భాగంగా ఉండిపోయింది.

గోల్కొండ రాజ్యం – తానీషా :

బహమనీ రాజ్యాల్లో గోల్కొండ రాజ్యం కూడ ఒకటి. 16-17వ శతాబ్దాల్లో గోల్కొండ రాజ్యం దాదాపుగా నేటి ఆంధ్ర రాష్ట్రమంత విస్తీర్ణం కల్గి ఉంది. గోల్కొండను పాలించిన రాజులు ప్రజల హితమందు, శ్రద్ధ కల్గి ధర్మబద్ధంగా పాలించి వారి యోగక్షేమాలకొరకు పాటుపడ్డారు. ఈ రాజుల మాతృభాష తెలుగు కాదు. అయినా వారిలో కొందరు తెలుగు నేర్చుకొని తెలుగు భాషను ఎంతో ప్రోత్సహించి తెల్గు కావ్యాల్ని అంకితం గూడ పుచ్చుకున్నారు. తెల్గు చాటువుల్లో కన్పించే 'మల్కిభ రాముడు' గోల్కొండ ప్రభువైన 'ఇబ్రహీం కుతుబ్‌షా' అని అందరికీ తెలిసిన విషయమే.

కుతుబ్ షాహి వంశంలోని నాల్గోరాజు మహమ్మద్ కులీకుతుబ్‌షా కాలంలోనే నేటి హైద్రాబాద్ నగరం నిర్మించబడింది. గోల్కొండ రాజ్యాన్ని పాలించిన చిట్టచివరి రాజు అబుల్ హసన్ కుతుబ్‌షా. ఎంతో ఉత్తముడై తన ప్రజల్నందర్నీ నిష్పక్షపాత బుద్ధితో పాలించి ప్రజలచేత 'తానాషా' అనే బిరుదును పొందాడు. 'తానాషా' అంటే మంచి రాజు అని అర్థం. తానాషాకే అందరూ సాధారణంగా తానీషా అని అంటుంటారు.

అక్కన్న - మాదన్నలు :

ఈ తానీషా దగ్గర అక్కన్న - మాదన్నలను అన్నదమ్ములిద్దరు నియోగి బ్రాహ్మణులుండేవారు. వీరిలో అక్కన్న మంత్రి మరియు దండనాయకునిగాను, మాదన్న ప్రధానమంత్రిగాను ఉండేవారు. మాదన్న అసలు పేరు సూర్యప్రకాశరావు. ఈ అన్నదమ్ములిద్దరు ఔరంగజేబు దాడులనుంచి గోల్కొండ రాజ్యాన్ని కాపాడ్డంలో ప్రధానపాత్ర వహించారు. మహారాష్ట్ర నాయకుడు శివాజీకి తానీషాకు సంధి జరిపారు. అక్కన్న మాదన్నలు బ్రతికి ఉన్నంతకాలం ఢిల్లీ సుల్తాను, గోల్కొండను ఆక్రమించుకోలేకపోయాడు. వీరు నిజమైన అన్నదమ్ములు కాకపోయినా ఒకరినుండి మరొకరికి వేరుచేయలేనంత సన్నిహితంగా కలిసిపోయారు. వీరు హత్య గావింపబడ్డ అనంతరమే ఔరంగజేబు తానీషాను బందీ చేశాడు. ఒక ముస్లిం రాజ్యానికి మంత్రులుగా హిందువులుండడం ఔరంగజేబుకు సహించలేదు. అందుకే అక్కన్న మాదన్నలను వదిలించుకొమ్మని ఔరంగజేబు ఎంత చెప్పినా తానీషా వార్ని వదులుకోలేదు. అక్కన్న మాదన్నలకు తానీషాతోగల అనుబంధం ఆంధ్రదేశంలో ఆనాటి హిందూ, ముస్లిముల ఐకమత్యాన్ని స్నేహసౌహార్ధతలను చాటుతుంది.

గోపన్న పుట్టుక - బాల్యం :

ఖమ్మం జిల్లాలోని తాలూకా కేంద్రమైన నేలకొండపల్లి ఊళ్ళో క్రీ.శ.17వ శతాబ్దం ప్రాంతంలో లింగన్న కామమ్మ దంపతులుండేవారు. ఇంటిపేరు కంచెర్లవారు. ఆదంపతులిద్దరు ఎంతో అన్యోన్యంగా అనురాగంతో కాలం గడుపుతున్నారు. కొన్నాళ్ళకు అంటే షుమారు 1620 ప్రాం॥లో వాళ్ళకు ఒక మగబిడ్డ పుట్టాడు.

ii) బాల్యం :

తండ్రి ఆ బిడ్డకు 'గోపన్న' అనే పేరు పెట్టాడు. గోపన్నకు తగిన వయసు రాగానే ఉపనయనం చేయించాడు. అయిదవ ఏటనే అక్షరాభ్యాసం చేసారు. శాస్త్ర పండితులయిన రఘునాథ భట్టచార్యుల లాంటి వైష్ణవ దీక్షా గురువులు గోపన్నకు బాల రామాయణాన్ని తాత్పర్య సహితంగా చెప్పడం జరిగింది. అందువలన చిన్నతనం నుంచే గోపన్న మనసులో శ్రీరాముడి మహిమలు నాటుకుపోయాయి. ఎప్పుడూ సీతారాముల విగ్రహాలకు భక్తితో పూజలు చేసేవాడు. తోటి పిల్లలతో రామ భజనలు చేసేవాడు. రామకోటి రాసేవారు. ఐదేళ్ళ వయసులోనే గోపన్నకు ఎంత రామభక్తి అంటే తాను గూడ ఆ రాముడున్న కాలంలోనే పుట్టి ఉంటే హాయిగా భక్తితో ఆ సుగ్రీవుడు, ఆంజనేయుడు లాగా రాముణ్ణి సేవించే భాగ్యం లభించేది గదా అని బాధపడేవాడు. ఈవిధంగా ఎంత రామభక్తి పరాయణుడైనా గోపన్న సర్వ శాస్త్రార్థసార విస్తారము నెల్ల నేర్చుకొని తల్లిదండ్రులను తృప్తి పరిచాడు. కాని విద్యావంతుడు దైవభక్తి యుక్తుడైన పుత్రుడి అభివృద్ధిని చూచి ఆనందించే భాగ్యం ఆ తల్లిదండ్రులకు లేదు కొద్ది రోజులకే వారు చనిపోయారు.

తారక మంత్రోపదేశం :

ఇంటి భారమంతా గోపన్నమీద పడింది. బంధుమిత్రుల సలహామీద గోపన్న పెళ్ళి చేసుకున్నాడు. భార్య కమలమ్మ సౌందర్యవతి. సకల సద్గుణాలు గల ఉత్తమ ఇల్లాలు. సంసార భారాన్ని ఎంతో జాగ్రత్తగా మోస్తూ భర్త మనసుకు అనుకూలంగా నడుచుకుంటూ

ఉండేది. ఆ దంపతులిద్దరూ ఇంటికి వచ్చే అతిథులను సేవిస్తూ అన్నప్రదానం గూడ చేస్తూ ఉండేవారు. ఒకనాడుదయాన కబీరుదాసు గోపన్న ఇంటి సమీపంలోకి హరినామ సంకీర్తన చేస్తూ వచ్చాడు. ఇంట్లో నుండి బయటికి వచ్చి గోపన్న కబీరును చూశాడు. అతడు గూడ గోపన్నను చూచి చేతులు చాచి పిలిచాడు. గోపన్నలో భగవద్భక్త లక్షణాలు కన్పించాయి కబీరుకు. "గోపన్నా! నీలో శాంతి, సౌమనస్యం లాంటి సద్గుణాలున్నాయి. నీకు అఖండ యోగం, శ్రీరామచంద్రుడి అనుగ్రహం కల్గుతాయి. నేను చెప్పిన విధంగా నీవు "ఓం రామాయనమ:" అనే ఆరక్షరాల తారక మంత్రాన్ని నియమంతో పారాయణ చేయి. అజ్ఞానంతో సంసార బంధమందు కష్టసుఖాలు పడేవాళ్ళకు ఒక దారి తెలియదు. వాళ్ళకు మోక్షం కలుగదు. కాబట్టి నీవు శ్రీరామ సేవా పరుడవై రామున్ణే ధ్యానించు. నీకు త్వరలో ఆ దేవుడు ప్రత్యక్షమవుతాడు అని కబీరు తారక మంత్రోపదేశం చేశాడు గోపన్నకు. కబీరు వలన తారకమంత్రోపదేశం పొందిన గోపన్న "శ్రీరామ నామం మరువాం మరువాం. సిద్ధము యమునికి వెరువాం వెరువాం" అని కీర్తనలు పాడడం ప్రారంభించాడు.

కొంత కాలానికి గోపన్నకు ఒక బిడ్డ పుట్టాడు. తల్లిదండ్రులు ఆ బిడ్డకు రాముడు లేక రఘురాముడు అనే పేరు పెట్టారు. ఆవిధంగా గోపన్న బిడ్డలో రామున్ణి రోజూ చూసుకోవచ్చు అనుకున్నాడు. ఆ బిడ్డను గూడ గోపన్న సంప్రదాయ పద్ధతిలోనే పెంచుతున్నాడు. ఒకనాటి రాత్రి కలలో గోపన్నకు రాముడు కన్పించి 'త్వరలో నీవు భద్రాచలానికి తహసీలుదారుగా వస్తావు' అని అన్నాడు.

భద్రాచలానికి తహసీలుదారగుట :

గోపన్న పేదలకు సహాయం చేస్తూ, అన్న సంతర్పణచేస్తూ నియమనిష్ఠలతో భజన కార్యక్రమాలు నిర్వహించేవాడు. కాలక్రమేణ అతని పూర్వులు సంపాదించి ఇచ్చిన ఆస్తి తగ్గిపోయింది. దీనికితోడు 17వ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ఏర్పడ్డ కరువుకాటకాలు గోపన్నను బాగా క్రుంగదీశాయి. ఫలితంగా ఏదైనా ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం తప్పలేదు. మేనమామలు గుర్తుకొచ్చారు. వాళ్ళ సహాయంతో తానీషా కొల్వులో ఏదైనా నౌకరీ సంపాదించాలనుకున్నాడు.

ఒకనాడు గోల్కొండకు బయలుదేరి వెళ్ళి అక్కన్నమాదన్నలతో తన పరిస్థితి చెప్పుకున్నాడు. వాళ్ళు గోపన్నను తానీషా వద్దకు తీసుకెళ్ళారు. గోపన్నకు ఏదైనా మంచి ఉద్యోగం ఇవ్వాలని తానీషా అనుకున్నాడు. అక్కన్న మాదన్నల సూచనమేరకు గోపన్నను భద్రాచలం తుకిడీకి (తాలూకా) తహసీలుదారుగా నియమించాడు తానీషా.

ఉద్యోగ నియామక ఉత్తర్వులను తీసుకొని మేనమామలకు, తానీషాకు కృతజ్ఞతలు చెప్పుకొని గోపన్న తిరుగుముఖం పట్టాడు.

గోపన్న రామదాసగుట :

గోపన్న అక్కన్న మాదన్నల సహాయంతో తానీషా చేత భద్రాచలానికి తహసీలుదారుగా నియమించబడ్డాడు. ఆ తర్వాత రైతులతో కలుపుకోలుగాఉంటూ గోపన్న తన బాధ్యతలను చక్కగా నిర్వహించుకుంటున్నాడు. అలాగే భద్రాచల రామచంద్రునకు వేళతప్పక సేవలు గూడ చేస్తూ ఉన్నాడు. రామకోటి మానలేదు.

ఒకసారి రామకోటి పూర్తిచేసిన శుభ సమయంలో అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశాడు. వంటవాళ్ళు ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమై ఉన్నారు.

ఇంతలో వంట ఇంట్లో బంతులకోసం వండిన అన్నం తాలూకు గంజి వంచడానికి త్రవ్విన గంజిగుంట నుంచి కెవ్వున కేక విన్పించింది. గోపన్న భార్య కేక వినిపించిన వైపు పరుగెత్తి చూచింది. అప్పటికే గంజిగుంటలోపడ్డ ఆబిడ్డ భద్రాద్రిరాముడి సాన్నిధ్యంలోకి వెళ్ళాడు.



గోపన్న లోపలికి వచ్చాడు. అన్నింటికీ ఆ రాముడే వున్నాడులే అనుకున్నాడు. ఆ రాముణ్ణే ప్రార్థించి బిడ్డను బ్రతికించుకోవాలనుకున్నాడు. భార్య కమల, ఊరి జనం వెంటరాగా భద్రాద్రి రాముణ్ణి సమీపించాడు. ఆ బిడ్డను భగవంతుడి పాదాల వద్ద పడుకోబెట్టాడు. నేనేం అపరాధం చేశాను. వేళ తప్పక నిన్ను సేవిస్తున్నానే: ఏనాడూ తెలిసి నీకు ఏ లోటూ చెయ్యలేదు. ఒక్కగానొక్క బిడ్డడు. ఈ బిడ్డని నీ వద్దకు అప్పుడే తసుకెళ్ళావా?

ఈవిధంగా శ్రీరామచంద్రుణ్ణి మనసు కరిగేలా ప్రార్థించిన రామదాసు కోరిక నెరవేరించి. చనిపోయిన బిడ్డ నిద్రనుంచి లేచినట్లు లేచాడు. గోపన్న భక్తికి చేతులు జోడించారు. నిజమైన రామభక్తుడని కొనియాడారు. ఆనాటి నుంచే గోపన్నను అంతా రామదాసని పిలవడం ప్రారంభించారు.

బందిఖానా రామదాసు :

భద్రాచలంలో ఉన్న శ్రీరామచంద్రుణ్ణి చూడ్డానికి జనం తండోపతండాలుగా రావడం మొదలయింది. అందువల్ల యాత్రీకులకు సౌకర్యాలు కలుగ జెయ్యాల్సిన బాధ్యత తహసీలుదారుగా తనమీద ఉంది. అలాగే ఒక భక్తజనశిఖామణిగా రాముడి ఆలయానికి ఒక గోపురం, ప్రాకారం మండపం గూడ కట్టించి ఆలయాన్ని బాగు చెయ్యాల్సిన అవసరం గూడ ఏర్పడింది. దీనికోసం ఒకనాడు గోపన్న ఆ ఊళ్ళో రైతులను పిలిపించి ఈ విషయం వాళ్ళముందు ఉంచాడు. ఒక మంచిపని చేద్దాం. మీరు నాతో సహకరించండి. అంటూ గోపన్న ప్రబోధించాడు. ఈ మాటలువిన్న ఊరిజనం అలాగే అని అంగీకరించారు. ఎవరి శక్తికొద్దీ వారు సహాయం చెయ్యడానికి సిద్ధమయ్యారు.

6 లక్షల వరహాలు ఖర్చుపెట్టి దేవతా విగ్రహాలకు ఆభరణాలను ఆభరణాలతోసహా ఆలయ పునరుద్ధరణ కార్యక్రమం పూర్తిచేశాడు. దేవాలయం పూర్తిగా క్రొత్తదనం రూపుదిద్దుకుంది. అయితే ఊళ్ళో కొందరు గోపన్న శ్రేయోభిలాషులు మాత్రం గోపన్న చేసినదాన్ని అభినందించలేదు. పైగా మందలించారుగూడ. సర్కారు పైకము ప్రభుత్వ అనుమతి లేకుండ ఖర్చుచెయ్యడం రాజద్రోహంగా ప్రభుత్వం భావించి గోపన్నకు శిక్షవిధించకపోదు అన్న భయం గోపన్న ఆత్మీయులను క్రుంగదీసింది. రామదాసు

మాత్రం భయపడలేదు. తన జేబులోకో, ఇంట్లోకో, ప్రభుత్వం సొమ్ము ఖర్చు పెట్టలేదు గదా తాను. ఆ భగవంతుడి కోసమే కదా అంతా ఖర్చు పెట్టింది. ఇదీ రామదాసు మొండి ధైర్యం.

గోపన్న చేసినఘనకార్యం మేనమామ మాదన్నవరకు పోయింది. "రాజుగారి సొమ్మంతా భగవంతుడి కోసం ఖర్చుపెట్టాను. ఆ దేవదేవుడి దయ ఉంటే భూమీశుని సొమ్ము పైసలతోసహా చెల్లిస్తాను" అని నిర్భయంగా ఉదాసీనంగా సమాధానం పంపాడు.

గోపన్న పంపిన సమాధానంతో అక్కన్నమాదన్నలు నిశ్చేష్టులయ్యారు. తానీషాకు గోపన్న మీద కోపం ఎక్కువయింది. తక్షణం గోపన్నను ఆస్థానానికి తీసుకురమ్మని సంబంధిత అధికారులను (హర్కారులు) భద్రాచలానికి పంపారు.

హర్కారులు గోపన్నకు తానీషా జారీ చేసిన హుకుం (ఆజ్ఞ) చూపించారు. "అన్ని తాలూకాలనుండి రావలసిన శిస్తు వసూళ్ళు ఖజానాలో జమ అయ్యాయి, నీ తాలూకా మాత్రం 6 లక్షల వరహాలు జమపడవలసిఉంది" అని కారణాలు వివరించారు. గోపన్నకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. పైగా పైన భగవంతుడున్నాడులే అనుకొని హర్కారుల వెంట కొల్వుకు బయలుదేరాడు. కొందరు గోపన్న భక్తిని శ్లాఘించగా మరికొందరు గోపన్న తలబిరుసుతనాన్ని నిందించారు. గోపన్న మాత్రం హర్కారులు దారివెంబడి పెట్టు బాధలకు కారణం పూర్వజన్మలో తాను చేసిన పాపమే అనుకున్నాడు.

హర్కారులు గోపన్నను తానీషావద్దకు కట్టి తెచ్చారు. అపరాధిగా ముందు నిలుచున్న గోపన్నను చూచి శిస్తు బకాయిలు 6 లక్షలు కట్టమని నిలదీశాడు తానీషా. తాను స్వార్థం కోసం ప్రభుత్వ ధనాన్ని ఖర్చు పెట్టలేదనియు, ప్రభువుల కీర్తి అజరామరంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పని చేశానని గోపన్న సంజాయిషీ ఇచ్చుకున్నాడు. ధర్మకార్యాలకు సొంత డబ్బు వాడుకోవాలేగాని పరుల డబ్బు తాకగూడదని తెలియదా అని తానీషా ప్రశ్నించాడు.

ప్రభూ! నేను ప్రభుత్వ ధనాన్ని మీ అనుమతి లేకుండ ఖర్చుపెట్టిన మాట వాస్తవం. అయితే దాన్ని నేను నా సొంతానికి వాడలేదు. అంతా తమ ఏలుబడిలోనే భద్రాద్రి రామాలయాన్ని పునరుద్ధరించి తమ కీర్తి ప్రతిష్ఠలను దిగంతాలకు వ్యాపింపచెయ్యాలనే ఆ పని చేశాను. ఇదంతా ప్రభువుల వారి అనుగ్రహం తమ ధర్మబుద్ధి. తమ దయాదాక్షిణ్యాలు లేకపోతే నేను ఆపని చేసేవాణ్ణి కాను. ఇకపై ప్రభువుల వారి చిత్తం.


ఈ మాటలకు తానీషా లోపల్లోపల సంతోషించాడు. కాని గోపన్నను వదిలిపెడితే తక్కిన తహసీలుదార్లు గూడ ఏదోఒక విధంగా ప్రభుత్వం డబ్బును ఖర్చుపెట్టి ఇలాగే క్షమాభిక్ష వేడుకుంటే ప్రభుత్వానికి మిగిలేది బూడిదే. కనుక గోపన్నను విడిచిపెట్టకూడదనుకున్నాడు. గోపన్నను చెఱసాలలో ఉంచమని సరదార్లను ఆజ్ఞాపించాడు. ఒక వారంలోపు డబ్బుకట్టమని హెచ్చరించాడు. లేని పక్షాన డబ్బు కట్టేవరకు చెరసాలలో ఉండాలన్నాడు.

రామదాసుని తానీషా కష్టపెట్టుట :

భద్రాద్రి రాముణ్ణే నమ్ముకొని కీర్తనలు పాడుకుంటూ, చెరసాలలో గూడ రామదాసు రామభజన మానలేదు. బందిఖానావాళ్ళు పెట్టే బాధలు తట్టుకోవడం నావల్ల కాదు రామా! అని మొరపెట్టుకొనేవాడు పాపం. రామదాసు బాధ చూడలేక దేవుడు రామదాసు వండుకున్న అన్నాన్ని దివ్యాన్నంగా మార్చేవాడు. దాన్ని తిని రామదాసు హాయిగా అన్ని బాధలు మర్చిపోయేవాడు.

తానీషా రామదాసు విషయం వాకబు చేసి పైకం అసలు చెల్లిస్తాడో లేదో పరిస్థితి ఎలా వుందో కనుక్కురమ్మని భటులను పంపుతాడు. రామదాసు చెరలో హాయిగా ఉండడాన్ని వాళ్ళు తానీషాకు చెప్తారు. పైకం అసలు చెల్లించే ఉద్దేశం లేదని తానీషా గ్రహిస్తాడు. రోజూ కొరడా దెబ్బలు కొట్టమని ఆజ్ఞాపిస్తాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక పాపం రామదాసు "అబ్బబ్బ దెబ్బలకు తాళలేర : రామప్పా గొబ్బుననన్నాదుకోరా:" అని దేవుణ్ణి ప్రార్థించేవాడు. అంతటితో కొరడా దెబ్బల బాధ తెలిసేది కాదు రామదాసుకు.

ఒకసారి చెరలో ఉండగా రామదాసు నూతిలోని నీళ్ళకొరకు చేదుతాడు వేసేటప్పుడు ఆ తాడునే కరచుకొని ఉన్న ఒక తేలు కుట్టడం జరిగింది. అపుడు రామదాసు "మేలైన చిటకన వేలు ప్రాత:కాలమందును గుట్టె తేలు, బాలత్వమున నేను



బావినీళ్ళకుపోయి కాలుబెట్టగ నేను చిన్నతేలు పొడిచెనయ్యా: కాపాడుతండ్రీ:" అని రాముణ్ణి ప్రార్థించాడు. మంట, సలుపు తగ్గిపోయాయి. భటులు ఆశ్చర్యపోయారు. "రాముని వారమైనాము. ఇతరాదుల గణనసేయము మేము" అని రామదాసు బదులుచెప్పి మీరు కూడా సర్వకాల సర్వావస్థలందు స్థిరమైనభక్తితో రామనామ కీర్తనం చెయ్యండని భటులకు బోధించాడు.

12సం॥లు గడిచాయి. రాముణ్ణి అన్నివిధాల తిట్టడంగూడ జరిగింది. అయినా కరుణించలేదు. ఇక లాభం లేదనుకొని తండ్రి కరుణించనపుడు తల్లియైనా చెప్తుందన్న నమ్మకంతో "నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ: ననుబ్రోమని చెప్పవే" అని సీతమ్మను ప్రార్థించాడు. ఏకాంతంలో నీవు భద్రగిరీశుని మేల్కొల్పి నా మొర విన్నవించమ్మ అంటూ మొర పెట్టుకున్నాడు. అంతతో కరుణించి ఆ తల్లి శ్రీరాముడితో "స్వామి! పూర్వం మీరు ప్రహ్లాదుణ్ణి, గజరాజుని రక్షించలేదా! నా మనవి విని వేగ ప్రాణనాథా రామదాసుని వదలించుమి ప్రాణనాథా! తురక పైకము చెల్లింపుడు ప్రాణనాథా! ఎంతో త్వరితముగా వేగి రండు అని పలికింది. అపుడు రాముడు, లక్ష్మణుడితో గూడ మారు వేషంలో గోల్కొండకు ప్రయాణమయ్యాడు రామదాసును చెరనుంచి విడిపించడానికి.

తానీషా రామలక్ష్మణుల సంవాదం :

చెరలో 12 సంవత్సరాలుగా బాధలు పడుతున్న రామదాసును ఎలాగైనా విడిపించాలని రాముడు తమ్ముడైన లక్ష్మణుడితో ఆలోచించాడు. తానీషాకు ఆరులక్షల వరహాలు చెల్లించుటయే తక్షణ కర్తవ్యంగా భావించి సేవకుల వేషాలతో అన్నదమ్ములిద్దరు గోల్కొండకు బయలుదేరారు, హైద్రాబాదు వచ్చి తానీషా అంత:పురంలో ప్రవేశించారు. అయితే అదే సమయంలో రామదాసు చెరలో ఒక నిర్ణయానికి వచ్చాడు. ఈ రాత్రికి నన్ను రక్షింపకున్న విషము త్రాగవలసిందే అనుకున్నాడు రామదాసు. ఇక్కడ అంత:పురంలో తానీషా నిద్రపోతున్నాడు. అతడికి ఒక కల వచ్చింది. ఆ కలలో తనకు సూర్యవంశజులైన రామలక్ష్మణులు కన్పించి రామదాసు తాలూకు పైకం చెల్లించి రశీదు తీసుకున్నట్లు భార్యతో చెప్పాడు. ఇంకా తెలవారలేదు. జాము పొద్దుంది.

రామలక్ష్మణులు మారువేషాలలో తానీషా గదిని సమీపించి "తలుపు తియ్యవయ్య తానీషా నీ కియ్యెడ పైకమునియ్య వచ్చితిమయ్య" అని తలుపు కొట్టారు. భార్యను ధైర్యంగా ఉండమని తానీషా తాను తలుపు తీసి నివ్వెరపోయాడు. ఇంత రాత్రివేళ తన గదిలోకి ప్రవేశించే ధైర్యం గల వ్యక్తులెవరా? అని ఆశ్చర్యపోయాడు. నోట మాట రాలేదు. జగన్మోహనాకారులైన రామలక్ష్మణులను కామమోహితాలైన కళ్ళతో కనిపెట్టలేకపోయాడు తానీషా. వీళ్ళెవరో నాకు తెలియదులే అనుకొని నేల చూశాడు. ఎదురుగా బంగారు వరహాలరాశి పడివుంది. సంభాషణ మొదలయింది రామలక్ష్మణులతో.

తానీషా : ఏ దేశం మీది. ఎవరు పంపారు – ఎందుకోసం వచ్చారు?

రాలక్ష్మణులు : భద్రాద్రిలో మేము చాల రోజుల నుండి కాపురముంటున్నాం, రామదాసు బంటులం. వారిని ఖైదు చేసిన వార్త తెలిసి పైకం చెల్లించి విడిపించుకోవాలని వచ్చాం, కాబట్టి రామదాసును రప్పించి ప్రేమతో మా కప్పగించు.

తా : అతడు కట్టాల్సిన పైకం కట్టలేదు. కనుక చెరసాల నుండి వదలం.

రా.ల : ఇదిగో డబ్బు చూసుకోండి. తివాచీలు పరిపించి లెక్క వేసుకోండి. రశీదు ఇవ్వండి. 12 సం॥నుంచి ఖైదులో పెట్టి

మా రామదాసును మీరు దారుణంగా బాధ పెడుతున్నారు.

తా : మీరు ఎవరి జవానులు. ఎక్కడుంటున్నారు? ఎవరు పంపితే వచ్చారు?

రా.ల : మేము రామదాసు జవానులం. భద్రాచలంలో ఉంటున్నాం. రామదాసు పంపిస్తే వచ్చాం.

తా : మీ కులం ఏమిటి? మీరిద్దరు ఏమౌతారు?

రా.ల : మాది సూర్య కులం. మేం అన్నదమ్ములం.



తా : మీ పేరు? మతం.

రా.ల : రామోజి, లక్ష్మోజి. రామానుజ మతం.

తా : జీతం?

రా.ల : ప్రసాదం.

తా : ఆయన మిమ్మల్ని ఎందుకు పంపారు?

రా.ల : సర్కారు బాకీ పైకం మాచేత ఇచ్చి పంపారు.

తా : సొమ్మంతా తెచ్చారా?

రా.ల : అంతా తెచ్చాం.

తా : కూర్చోండి, కూర్చోండి.

రా.ల : కూర్చోడానికి రాలేదు. మీతో భేటీకి వచ్చాం.

తా : ఆరు లక్షలూ తెచ్చారా? లేక కొరవేమైనా పెడతారా?

రా.ల : ఆరు లక్షలేం ఖర్మ. 10 లక్షలు కావాలంటే ఇస్తాం.

తా : కట్టాల్సిన డబ్బు కట్టి తర్వాత పరిహాసాలు ఆడండి.

రా.ల : పదివేలు తెచ్చాం. ఇప్పుడు. తక్కినది మా చేతిలో లేదు.

తా : మాతో ఏగతాళి ఆడుతున్నారా?

రా.ల : మీతో పరిహాసాలాడ్డానికి మేం ఎవరం?

తా : మా చేతికి డబ్బివ్వండి. లేదా ఖైదులోకి పొండి.

రా.ల : మేం ఖైదులోకి పోడానికి రాలేదు. మీ ఖజానాపైకం కడతాం. రశీదివ్వండి.

పైకం తీసుకొని తానీషా రాజముద్రవేసి రశీదు ఇవ్వగానే వెంటనే రామలక్ష్మణులు చెరలోవున్న రామదాసుకు రశీదు ఇద్దామని తానీషా వేషంలో బయలుదేరారు. అదే సమయంలో రామదాసు మేల్కొని ఇంకా జాముపొద్దుండడంచూచి అయ్యో ఆ రామచంద్రుడు అంతమందిని కాపాడాడు. నన్నింక రక్షించడానికి రాలేదే అని దిగులు పడ్డాడు. అప్పుడప్పుడూ తిట్టాడు. మరలా పశ్చాత్తాపపడ్డాడు తిట్టినందుకు. ఇక లాభంలేదు. ఎప్పటికైనా చావు తప్పదు. చెరలో ఈ బాధలకంటే అదే నయం. అయితే చావడానికి ముందు ఆఖరిసారిగా మనసులో ఆ రాముణ్ణి పూజిస్తాను అని మానసపూజ మొదలుపెట్టాడు. రామలక్ష్మణులు చెరవద్దకు వచ్చారు. తానీషా వేషంలో రాముడు "రామదాసూ! బాకీపైకం ముట్టింది. ఇదిగో రశీదు" అని రశీదు ఇచ్చి మాయమయ్యాడు లక్ష్మణుడితోసహా. ఇదంతా రామ మహిమే అనుకుంటూ కృతజ్ఞతాపూర్వక భక్తికీర్తనలాలపించాడు.

అక్కడ తానీషా మేల్కొని భార్యను చూచి ఇదంతా రామమాయగా చెప్పాడు. అయ్యో! ఆ దేవదేవునికి సేవలు చెయ్యలేదే అని క్రుంగిపోయాడు. రామదాసు భక్తికి ముగ్ధుడయ్యాడు. సకల మర్యాదలతో రామదాసును గౌరవించాలనుకున్నాడు. తెల్లవారగానే రామదాసును విడిపించి కొల్వుకు తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. అక్కన్న మాదన్నలు చెరసాలకు వెళ్ళి రామదాసుతో జరిగినదంతా

చెప్పారు. రామదాసు ఆశ్చర్యపోయాడు. తనకంటే తానీషా అదృష్టవంతుడని మెచ్చుకున్నాడు. వెంటనే రాజమర్యాదలతో రామదాసు రాజు కొల్వుకు చేరుకున్నాడు. తానీషా తాను ఇంతకుముందే రామలక్ష్మణులకు రశీదు ఇచ్చానన్న సంగతి గూడ భక్తి పారవశ్యంలో మర్చిపోయి మరలా రశీదు ఇవ్వబోయాడు రామదాసుకు.

రామదర్శనంతో ధన్యుడైన తానీషాను రామదాసు, భక్తిపారవశ్యంతో భగవంతుని దాసునిగా చేసుకున్న రామదాసును తానీషా పరస్పరం అభినందించుకున్నారు. తర్వాత రామదాసును ఇన్నాళ్ళు కష్టపెట్టినందుకు తానీషా పశ్చాత్తాపపడి రామలక్ష్మణులు తనకు చెల్లించిన డబ్బుతో పాటు పట్టువస్త్రాలు గూడ ఇచ్చి భద్రాచలాన్ని శ్రీరామచంద్రునికి మాన్యంగా ప్రకటించాడు. అన్నీ స్వీకరించి భక్తరామదాసు తానీషాకు కృతజ్ఞతలు చెప్పుకొని భద్రాచలం ప్రయాణమయ్యాడు.

రామదాసు భద్రాచలం చేరుట :

చెరనుండి విముక్తుడయిన రామదాసు భద్రాచలానికి బయలుదేరాడు. తానీషా ఇచ్చిన పట్టువస్త్రాలను దేవుడికి సమర్పించి దర్శనం చేసుకొని ఇంటికి వెళ్ళాలనుకున్నాడు రామదాసు. ఇంతలో చెరనుండి రామదాసు విడుదలైవచ్చాడన్న సంగతి తెలిసి ఊరి జనం గంధపుష్ప తాంబూల చందనాది పూజాద్రవ్యాలతో ఎదురొచ్చి రామదాసుకు సాష్టాంగ దండప్రణామం చేశారు. రామదాసు రామ భజన చేసుకుంటూ భద్రాద్రికి ప్రయాణమయ్యాడు రామదాసు మండీమార్బలంతో ఆలయానికి వస్తున్నాడన్న విషయం ముందే తెలుసుకున్న ఆలయ పూజారులు తులుపులు తీయించి సమస్త పూజాద్రవ్యాలు సిద్ధంచేసి ఎదురుచూస్తూ ఉన్నారు. రామదాసు రాగానే గోపురద్వారాలు తెరుచుకున్నాయి. ఆనందబాష్పాలతో రామదాసు "రామ నామము బల్కవే పాపపు జిహ్వా! రామనామము బల్కవే" అంటూ రామనామ కీర్తనం చేశాడు.

తర్వాత గర్భగృహంలో ప్రవేశించి సీతాలక్ష్మణ సమేతుడైన రాముణ్ణి చూచి ఆనందబాష్పాలు కారుతుండగా సర్వం మరచిపోయి రామమూర్తిలో లీనమై గద్గదస్వరముతో "కంటి నేడూ మాసీతారాముల కనుగొంటి నేడు" అని గానం చెయ్యసాగాడు. హరి దాసులతో గూడి భజన చేసుకుంటూ ప్రదక్షిణం చేసి ఇంటికి చేరుకున్నాడు. ఈ విధంగా రామదాసు భద్రాద్రిలో ఉంటూ హరినామస్మరణతో బ్రాహ్మణులను భోజనాలతో తృప్తి పెడుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

రామదాసు వైకుంఠానికేగుట :

ఈ విధంగా చివరికాలంలో రామదాసు శరీరం మీద వ్యామోహం వదులుకొని రామనామ సంకీర్తనలో బ్రతుకుతుండగా ఒకనాడు ఆయన ఇంటిముందుకి పుష్పకవిమానం వచ్చింది. భగవంతుడు నన్ను అనుగ్రహించాడనుకుంటూ ఆ విమానాన్ని ఎక్కి ఆ దేవదేవుని సన్నిధికి వెళ్ళి ఆయన పాదసేవచేసే భాగ్యం సాక్షాత్తుగా కల్గుతుందనుకున్నాడు. చివరగా ఒక్కసారి ఇన్నాళ్ళూ తననే నమ్ముకొని సేవలు చేస్తున్న అర్ధాంగిని గూడ పిలిచాడు. ఆమె కొంచెం పనుంది ఇపుడే వస్తాను అని ఆలస్యం చేసింది. నీ ప్రాప్తం ఇంతేలే అనుకుంటూ రామదాసు పుష్పకవిమానం ఎక్కి భక్తులను చూచి "తర్లిపోతాము చాలా దయలుంచండి ఇంకను, మళ్ళీ జన్మజన్మాలకు రాము మదిలో నుంచండి" అంటూ వీడ్కోలు పల్కి భగవంతుని సన్నిధికి చేరుకున్నాడు.

కాసేపటికి లోపలినుండి భార్య కమల వచ్చి నా దురదృష్టం ఆయనతో నేను గూడ వెళ్ళలేకపోతినే అని తన అలసత్వానికి పశ్చాత్తాప పడింది. ఆలయానికి వెళ్ళి భగవంతుడి పాదాలమీద పడి ప్రార్థించింది. "నీ కుమారుడికి నను సేవించే వయసు వచ్చేవరకు నీవు నా కైంకర్యం చేస్తూవుండ"ని దేవుడు ఆదేశించాడు. రామాజ్ఞప్రకారం అలాగే సేవించి కొంతకాలానికి పరమపదం అందుకుంది.

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాత్మనే ।
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం ॥



3. షహనాయ్ షహెన్‌షా

డా॥ యన్. సదాశివ

షహనాయి షహెన్‌షా

21.08.2006 రాత్రి 2.20కి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అస్తమించినాడన్న విషాదవార్త వెలువడింది. మనదేశంలోనే కాక ప్రపంచంలోని అనేక దేశాల్లో సంగీతాభిమానులు సంతాపమగ్నులైనారు. అప్పుడతని వయస్సు 91. అంతవరకు బాగానే ఉన్నాడనుకున్న ఖాన్‌సాహెబ్‌ను వార్ధక్యానికి సంబంధించిన ఏవేవో రుగ్మతలు అలముకున్నాయని టి.వీ వార్తల వలన తెలిసింది. అతనింటికి వెళ్ళి చికిత్స చేసే వైద్యులు, "ఘన పదార్థం తీసుకోలేకపోతున్నాడు కానీ ద్రవపదార్థాలు తీసుకుంటున్నాడు. పరవాలేదు కోలుకుంటాడు" అని ఆశించినారు. బలహీనత పెరిగిపోయిన కొద్దీ వైద్యులలో ఆందోళన పెరిగింది. తన వాళ్ళందరినీ వదిలి ఆసుపత్రికి వెళ్ళటం ఖాన్‌సాహెబ్‌కు సమ్మతంకాదు. అందరూ నచ్చజెప్పి ఎట్లాగో 'హెరిటేజ్ ఆసుపత్రికి' తరలించినారతణ్ణి. ఆదివారం రాత్రి అన్ని పట్టీలు కట్టి ఉన్నప్పటికీ తన అభిమానుల కోసం కొన్ని కజిరీలు, చైతీలు వినిపించినాడు. కొంతదూరం అతనికి సహకరించిన స్వరాలు అప్పుడప్పుడు మొరాయించినాయి. అయినా వినిపించినాడు. ఇక పరవాలేదనుకున్నారందరూ. సాధారణంగా షహనాయి వాయించే వాళ్ళకు గాత్ర సంగీతం చేతగాదంటారు. కానీ ఖాన్‌సాహెబ్ మాత్రం అవసరమనిపించినప్పుడల్లా కొన్ని టుమ్రీ ముక్కలో, కజిరీ ముక్కలో వినిపిస్తుండేవాడు. అంతేకాక ఏ ఘరానా ఉస్తాదులు ఎట్లా పాడేవాళ్ళో అట్లా పాడి వినిపించేవాడు. వేదిక మీద గాత్ర కచేరీలు చేయలేదన్న మాటే గానీ చేస్తే బహుశః ఉస్తాదుల పద్ధతిలోనే పాడేవాడేమో. ఆ ఆదివారం రాత్రి ఇక ఫరవాలేదని అందరూ అనుకున్న తరువాత 1.50కి అంటే సోమవారం గుండెపోటు వచ్చింది. వైద్యులు ప్రయత్నిస్తుండగానే 2.20కి అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయినాయి.

భారతదేశం ఒక అనర్ఘరత్నాన్ని కోల్పోయింది. సంగీతరంగాన భారతరత్నలు మరి కొందరున్నారు. కానీ తమ సంగీతాన్ని కలకాలం నిల్పి దివ్యలోకాలు చేరుకున్న వాళ్ళిద్దరే. ఒకరు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్. ఇంకొకరు ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి. ఇది నా అభిప్రాయం. ఆసేతుహిమాచలం మందిరాల్లో పవళింపు సేవ తరువాత నిద్రించిన దేవతలు ప్రభాత సమయాన ఉస్తాద్ బిస్మిల్లాఖాన్

షహనాయి స్వరాలతో మేల్కొంటారు. లేదా సుబ్బలక్ష్మి సుప్రభాత గానంతో మేల్కొంటారు. ఇంతటి వ్యాప్తి ఇంకే గాయకుని సంగీతానికి గాని, గాయిక సంగీతానికి గాని, వాదకుని సంగీతానికి గాని లభించలేదు. ఖాన్ సాహెబ్ షహనాయికి మరికొంత వ్యాప్తి లభించింది. మన దేశంలో తీయబడే పలు భాషల సినిమాలలో పెళ్ళి సందర్భానగానీ ఇతర శుభకార్యాల సందర్భానగానీ బ్యాక్‌గ్రౌండ్‌లో ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ షహనాయిపై వాయించిన ఏదో ఒక రాగ స్వరాలు వినిపిస్తూనే ఉంటాయి.

మనదేశంలో సనాతన కాలం నుంచి శుభకార్యాల్లో వాయించే మంగళవాద్యం షహనాయి. దాన్ని కొన్ని ప్రాంతాల్లో సొన్నాయి, సన్నాయి అంటారు. అది చాల సున్నితమైన వాద్యం. అపస్వరానికి ఆస్కారం అధికం. పైగా దానితో కొన్ని స్వరాలే వాయించవచ్చుగాని పన్నెండు స్వరాలు వాయించడం కష్టం. కాబట్టి మంగళవాద్యంగా సన్నాయి వాయించేవాళ్ళు తాము వాయించగలిగిన కొన్ని గత్‌లను ప్రజాసంగీతంలోని కొన్ని పాటలను మాత్రం వాయించేవాళ్ళు. శాస్త్రీయ సంగీతం జోలికి వెళ్ళే వాళ్ళు కాదు.

బీహార్ రాష్ట్రంలో దుమ్రాన్ అనే చిన్న సంస్థానం ఉండేది. సంస్థానం చిన్నదే. దుమ్రాన్ బస్తీ చిన్నదే. అక్కడి రాజవంశీకులు తమ దర్బార్‌లో షహనాయి వాదకులను ఆస్థాన విద్వాంసులుగా నియమించుకున్నారు. వాళ్ళంతా అవసరానికి వాయించే వాళ్ళే కానీ ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ నాల్గవ తాత సాలార్‌హుసేన్ ఖాన్ తన షహనాయిలో కొన్ని అధికస్వరాలు పలికించే ప్రావీణ్యం సంపాదించినాడు. అంటే తన బాజాను కొంత మార్చినాడన్నమాట. సాలార్ హుసేన్‌ఖాన్ కొడుకు హుసేన్ బక్ష్‌ఖాన్, అతని కొడుకు రసూల్ బక్ష్ ఖాన్, అతనికొడుకు పైగంబర్ బక్ష్‌ఖాన్ తమ వాద్యంలో తలా కొన్ని సవరణలు చేసి పెద్ద పెద్ద గాయికలు, గాయకులు, సితార్ వాదకులు, సరోద్ వాదకులు అసీనులయ్యే సంగీత సభావేదిక మీద కూర్చుండే అర్హత సంపాదించినారు.

పైగంబర్ బక్ష్ కొడుకే బిస్మిల్లాఖాన్. తండ్రి అతణ్ణి షహనాయి నేర్చేముందు బడికి వెళ్ళి కొంతకాలం చదువుకొమ్మని బలవంత పెట్టేవాడు. చదువుకోవటం ఇష్టంలేని బిస్మిల్లాఖాన్ కాశీలో ఉండే తన మేనమామ అలీబక్ష్ విలాయతు దగ్గరికి పారిపోయినాడు. అలీబక్ష్ విలాయతు సంగీత సభల్లో సోలో వాయించే విద్వాంసుడే కాక కాశీ విశ్వనాథాలయంలో షహనాయి వాయించే విద్వాంసుడు. అతడు బిస్మిల్లాఖాన్‌కు చాలా ప్రేమతో షహనాయి వాద్య రహస్యాలు, తనజీవితంలో జరిగిన ఒక రహస్యం కూడా చెప్పినాడు. కాశీని మహాస్మశానం అని కూడా అంటారు. ఆ మహాస్మశానంలో ఏ మూలనో కూర్చుండి అలీబక్ష్ అర్ధరాత్రి షహనాయి సాధన చేస్తున్నాడట. ఎక్కణ్ణుంచో దివ్య పరిమళం. కళ్లు తెరిచి చూస్తే ఒక భవ్యమూర్తి నిలబడి ఉన్నాడట. జటాజూటం. ఒంటినిండా విభూతిరేఖలు, మెడనిండా, దండలకు, ముంజేతికి రుద్రాక్షమాలలు. అతడు మందహాసం చేస్తూ "వాయించు బేటా! వాయించు" అని తన వేళ్ళతో షహనాయిని తాకి అదృశ్యుడైనాడట. అతడు సాక్షాత్తు బాబా విశ్వనాథుడే అని, తన షహనాయిలో అతని స్పర్శ వలన సుస్వరాలు చేరినాయని ఆనందవివశుడై అలీబక్ష్ అనాటి నుంచి ధాటీగా వాయించటం మొదలు పెట్టినాడట. అయితే తన మేనల్లునికి ఆ ముచ్చట చెప్పి "ఇవి దేవ రహస్యాలు. ఇట్లాంటి దివ్యానుభూతులు ఇక్కడ చాలా జరుగుతాయి. ఒకవేళ నీకూ ఇట్లాంటి అనుభవం కలిగితే ఎవ్వరికీ చెప్పకు. జాగ్రత్త!" అని హెచ్చరించినాడట.

ఆ మందిర సముదాయంలోనే ఉన్న బాలాజీ మందిరంలోని బిస్మిల్లాఖాన్‌కు స్వరసాధన జేసే సౌకర్యం కలిగించి ఒక గది తాళంచెవి ఇచ్చినాడట అలీబక్ష్. ఆ తాళం చెవిని అతడు రాత్రి 9 గం.ల నుంచి 11 గం.ల వరకే ఉపయోగించవలె. తరువాత మేనమామకు ఇయ్యవలె. ఒకరాత్రి బిస్మిల్లాఖాన్ బాలాజీ మందిరం గదిలో లోపలి నుండి గొళ్ళెం పెట్టి కూర్చుండి సాధన ప్రారంభించినాడు. అకస్మాత్తుగా ఆ గది నిండా దివ్య పరిమళం నిండుకున్నది. కళ్ళు తెరచి చూస్తే అలాంటి దివ్య పురుషుడే! బాలుడైన బిస్మిల్లాఖాన్ భయపడి సాధన మానుకున్నాడట. "బజావ్, బేటా! బజావ్" అని మందస్మితం చేసి అతడు మాయమయినాడు. పెట్టిన గొళ్ళెం పెట్టినట్టే ఉన్నది. ఆ దివ్యపురుషుడు ఎటు వెళ్ళినాడో అని లాంతరు పట్టుకొని ఆ ప్రాంతమంతా వెతికినాడు. ఎవరూ కనిపించలేదు. భయభ్రాంతుడైన బిస్మిల్లాఖాన్ గదికి తాళం వేసి, గబగబా నడుస్తూ ఇంటికి వెళ్ళి తన గదిలో పడుకున్నాడు. ఇంత తొందరగా వచ్చినావేమిరా! అని మేనమామ అతని గదికి వెళ్ళి పలకరిస్తే బిస్మిల్లాఖాన్ గజగజ వణుకుతూ జరిగిందంతా

చెప్పినాడు. అలీబక్ష్ అతని చెంపమీద బలంగా చరిచి, "ఇక నోరుమూసుకో" అని వెళ్ళిపోయినాడు. కానీ బిస్మిల్లాఖాన్ తరువాత తన అనుభవాన్ని ఇంటర్వ్యూలలో చాలా మందికి చెప్పినాడు.

అలీబక్ష్ 1940లో మరణించినాడు. తన మేనల్లుడు బిస్మిల్లాఖాన్‌కు దివ్య దర్శనమయింది కనుక తనను మించిన ఉస్తాద్ అవుతాడని తన మిత్రులకు గర్వంగా చెప్పుకునేవాడట. దివ్యదర్శనాలు, దివ్యానుభూతులు వాస్తవమని హేతువాదులు నమ్మరు కదా! ఔను, అదంతా ఒక మూఢనమ్మకమే. అదంతా ఒక భ్రాంతి మాత్రమే. కానీ ఈ భ్రాంతి కారణంగా మనిషిలో ఒక ప్రోత్సాహం కలుగుతుంది. ఒక బలమైన ఆత్మవిశ్వాసం కలుగుతుంది. అవి ఆ మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి. ఉస్తాద్ బిస్మిల్లాఖాన్‌కు కాశీ నగరం పట్ల, విశ్వనాథుని పట్ల, గంగా మాయిపట్ల, తాను నివసించిన నరాయ్‌హరాపట్ల, తన ఇంటిముందటి సరస్వతీ విగ్రహం పట్ల అవినాభావమైన ఆత్మీయతాభావం ఉండేది. కాశీని వారణాశి అని అంటారు. బనారస్ అని గూడ అంటారు. ఖాన్‌సాహెబ్‌కు బనారస్ అన్న పేరు ఇష్టం. అందులో రసమున్నది. అతని నాస్తాకు బనారస్‌లో దొరికే పూరీ, కచోరీ, జిలేబీలే ఇష్టం. బనారస్ పానే ఇష్టం. బీడీలు, సిగరెట్లు అతనికి ఇష్టమైనవే.



బిస్మిల్లాఖాన్‌కు షమ్‌షుద్దీన్ అనే ఒక అన్న ఉండేవాడు. అలీబక్ష్ మరణించిన తరువాత ఆ అన్నదమ్ములిద్దరూ సంగీత సభల్లో కలిసి షహనాయి వాయించేవాళ్లు. చుడీదార్ పైజామాలు, జరీ బుటాల షేర్వానీలు, భర్‌ఝరీ పటకాలు ధరించి వేదిక మీద ఆసీనులైన వాళ్ళిద్దరు రాజకుమారుల్లాగా ఉండేవారు. షహనాయి వాద్యంలో అన్న కంటే తమ్ముడే ముందుండేవాడు. అయినా అన్నమీది గౌరవంతో బిస్మిల్లాఖాన్ అణిగి మణిగి వాయించేవాడు. షమ్‌షుద్దీన్ ఖాన్ అల్ప వయస్సులోనే మరణించినందున బిస్మిల్లాఖాన్ ఒక్కడే దేశవిదేశాల్లో సంగీత జైత్రయాత్ర సాగించినాడు. అదంతా అందరికీ తెలిసిందే. అన్ని పత్రికల్లోను వచ్చింది కాబట్టి ఇక్కడ ఇంకా దాన్ని గురించి వివరించి రాయను.

గాయకుడు, సంగీతవేత్త, హెచ్.ఎమ్.వి. కంపెనీ లోనూ, ఆలిండియా రేడియోలోనూ, ఎందరెందరో సంగీత కళాకారుల వెంటబడి స్టూడియోకు రప్పించి వాళ్ళ సంగీతాన్ని రికార్డు చేసిన జి.ఎన్.జోషి 1941 నుంచి షమ్‌షుద్దీన్‌ఖాన్, బిస్మిల్లాఖాన్‌లను తన స్టూడియోకు పిలిపించి షహనాయి రికార్డులు తయారు చేయించినట్లు తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. జి.ఎన్.జోషి గురించి ఇంత పెద్దవాక్యం ఎందుకు రాసినానంటే ఆనాటి గొప్ప గొప్ప కళాకారులను మనమీనాడు వినగలుగుతున్నామంటే అతని కారణంగానే. మన దేశానికి స్వాతంత్ర్యం దొరికిన 15 ఆగస్టు 1947 నాడు లాల్‌ఖిలాలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగానికంటే ముందు దేశమంతా ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ షహనాయి స్వరాలనే విన్నది. అప్పుడతని వయసు 31. ఆ వయస్సులోనే అతనికి మంచి గుర్తింపు లభించిందన్నమాట.

జి.ఎన్.జోషి కొన్ని వాద్యాలతో షహనాయి జుగల్బందీ చేయించి ఎల్.పి.లు తీయాలని సంకల్పించినాడు. 'గూంజ్ ఉఠీ షహనాయి' అనే సినిమాలో ఉస్తాద్ అబ్దుల్ హలీం జాఫర్‌ఖాన్ సితార్, ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ షహనాయి జుగల్బందీ విన్నాడు.

అట్లాంటి జుగల్బందీ ఎల్.పి.లో జరిపించాలని జాఫర్‌ఖాన్‌తో మాట్లాడినాడు. "అది 2 ¾ నిమిషాల రికార్డు కనుక ఇబ్బంది లేకుండా సాగింది. ఎల్.పి.లో సాగదు. రెండు వాద్యాలు స్వరవిన్యాసం వేరు, సాధ్యం కాదు" అని తప్పించుకున్నాడు జాఫర్ ఖాన్. అది వాస్తవమే. ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ ఎడింబరో మ్యూజిక్ ఫెస్టివల్‌లో పాల్గొనటానికి వెళ్ళినపుడు ఆ సభకు వచ్చిన ప్రసిద్ధ సితార్ వాదకుడు ఉస్తాద్ విలాయత్ ఖాన్‌తో ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ షహనాయి జుగల్బందీ ఏర్పాటు చేసినాడు. వాళ్ళ లండన్ ఆఫీసు ఏర్పాటు చేసిందా కార్యక్రమం. ఆ ఎల్.పి అద్భుతంగా వచ్చింది. బాగా అమ్ముడయింది.

ఆ తర్వాత షహనాయి జుగల్బందీ చాల వాద్యాలతో జరిగింది. వి.జి.జోగ్ వాయిలన్‌తో, ఉస్తాద్ అమ్జదల్‌ఖాన్ సరోద్‌తో జరిగిన జుగల్బందీలు ఎంతో ప్రజాదరణ పొందినాయి.

చాలా సంపాదించినాడు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్. అయినా అతని సంపాదన సరిపోయేది కాదు. సంపాదించేవాడు అతడొక్కడే. తినేవాళ్ళు నూరుగురు. అతని కుటుంబ సభ్యులే ఎనభైమంది. కొడుకులు, కోడండ్లు, మనుమలు, మనుమరాండ్రు, ముని మనుమలు, ముని మనుమరాండ్లు ఇంకా, కొందరు దగ్గరి బంధువులు భోజన సమయాన అతని ఇంటివాళ్ళే కాక ఆ ప్రాంతాల్లో తిరిగే బీదవాళ్ళు కూడా దస్తర్ ఖ్వాన్ మీద కూర్చుండేవాళ్ళట. అది భిస్మిల్లాహోటల్‌గానే పేర్గాంచింది.

అతడు షియా కనుక మొహర్రం నెలలో, ముఖ్యంగా ఎనిమిదిన కర్బలా మైదానంలో షహీదులయిన వాళ్ళకోసం ఏడ్చేవాడు. నోహా ఖ్వాన్ చేసేవాడు. కరుణరస ప్రధానమైన మర్సియాలు వాయిస్తూ తిరిగేవాడు. వాడవాడంతా ఏడుస్తూ అతని వెంట తిరిగేది.

సందర్భంలో తప్ప అతడెన్నడూ విచారం ప్రకటించలేదు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండేవాడు. తాను బనారస్‌లో విన్న విద్యాధరీదేవి, కాశీబాయి, రసూలన్‌బాయి, సిద్ధేశ్వరీ దేవి ఎంత గొప్పగా పాడేవాళ్ళో తన ఇంటికి వచ్చే శ్రోతలకు సంతోషంగా వినిపించేవాడు. తన తర్వాత తన వాళ్ళంతా ఏమైపోతారో అని రంధి ఎప్పుడూ ఉండేది. "ఎవరి అదృష్టం వాళ్ళది" అని సరిపుచ్చుకునేవాడు.

సాదాసీదా జీవితం గడిపిన ఉస్తాద్ సాదాసీదాగానే వెళ్ళిపోయినాడు. అతడు పోయినందువలన మనదేశం ఎంతటి సంపదను, ఎంతటి వైభవాన్ని కోల్పోయిందో చెప్పలేము.

ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ విదేశ పర్యటన గురించి అంతగా రాయలేదు నేను. ఈ నడుమ అన్ని పత్రికల్లో వస్తున్నదేగదా అని దాటవేసినాను. కానీ ఆ విషయాలు కొన్ని రాస్తే మంచిదే అని అనుకుంటున్నాను. పాశ్చాత్యదేశాల్లో ఉస్తాద్ అలీ అక్బర్‌ఖాన్ సరోద్ వాదనం వింటూ, పండిత్ రవిశంకర్ సితార్ వాదనం వింటూ ఆ దేశాల సంగీత ప్రియులు చాలాకాలం ఆనందం పొందివున్నారు కనుక ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ ఎల్.పి.లు ఆ దేశాలకు చేరిన తరువాత అతడు కచేరీలో షహనాయి వామించగా వినాలని ఉబలాటపడ్డారు. ఎన్నో దేశాలతన్ని ఆహ్వానించాయి. ఇంతవరకు మనం మాట్లాడుకున్న జి.ఎన్.జోషి యూరోపు వెళ్ళినప్పుడు అంటే 1964వ సం॥న లండన్ నగరాననే కాక ఇంగ్లండులో, ఫ్రాన్స్‌లో, జర్మనీలో మరికొన్ని ఇతర దేశాలలో అక్కడి సంగీత ప్రియులు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్‌ను వినాలనే కోరికను వెల్లడించినారట. ఇండియాకు వచ్చిన తరువాత జి.ఎన్.జోషి ఉస్తాద్‌ను కలిసి ఆ దేశాలనుంచి ఆహ్వానం వస్తే తప్పక వెళ్ళాలని సలహా ఇచ్చినాడట. కానీ ఖాన్ సాహెబ్‌కు ఏరోప్లేన్ ప్రయాణమంటే భయం. 1965లో అతనికి యూరోప్ దేశాల ఆహ్వానాలు అందినాయి. అతడెట్లాగూ ఏరోప్లేన్ ప్రయాణానికి సాహసించడు కనుక అలవిగానంత ప్రతిఫలాన్ని అడిగినాడు. వాళ్ళెట్లాగూ అడిగినంత ప్రతిఫలం ఇయ్యలేరు, తన ఖర్చులు భరించలేరు. కనుక తనను మళ్ళీ పిలువరు. అనే నమ్మకంతోనే. 1966లో ప్రతిష్ఠాత్మకమైన ఎడింబరో ఫెస్టివల్లో పాల్గొన వలసిందిగా భారత ప్రభుత్వమే అతన్ని కోరింది. మళ్ళీ తప్పించుకోవటానికి అదే ఉపాయం నడుస్తుందనుకున్నాడు. "నావెంట యాభై మంది. అందరినీ మొట్టమొదట మక్కా మదీన కర్బలాలు తిప్పాలె" అని కొన్ని షరతులతో ప్రభుత్వానికి జాబు రాసి

తప్పించుకున్నానని సంబరపడ్డాడు. కానీ ప్రభుత్వం అతని కోరికలన్నీ అంగీకరిస్తూ "ఇంకేమన్నా కావాలా?" అని అడిగింది. విమానం ఎక్కక తప్పలేదు బిస్మిల్లాఖాన్‌కు. హజ్‌యాత్ర ముగించుకొని ఎడింబరో ఫెస్టివల్లో పాల్గొన్నాడు. ఆ ఫెస్టివల్లో పాల్గొన్న వాళ్ళందరు సంగీత శిఖరాగ్రానికి చేరుకున్న కళాకారులే. ఆ ఫెస్టివల్లోనే షహనాయితో బిస్మిల్లాఖాన్ చేసే స్వరవిన్యాసాన్ని గమనించిన సంగీత ప్రియులు, సామాన్యులు ఆనంద పారవశ్యాన్ని పొందినారు.

ఆ తరువాత ఖాన్ సాహెబ్‌కు విదేశాలకు వెళ్ళటం పట్ల ఆసక్తి కలిగింది. చాలా దేశాల్లో తన సంగీతం వినిపించాడు. మొదట్లో బిస్మిల్లాఖాన్ షహనాయి వాదకులు వాయించే చైతీ, కజిరీ, సావనీ, టుమ్రీ మొ॥ వాటిని వాయించేవాడు. అవి సాధారణంగా మిశ్రఖమాచ్, మాండ్; మిశ్రపీలు లాంటి రాగాల్లో ఉంటాయి. తరువాత మేనమామ దగ్గర ఖయాల్ రాగాలు నేర్చుకున్నాడు. అతడు నేర్చుకున్న రాగాలు యమన్‌కళ్యాణ్, పూర్యా, ముల్తానీ, భాగేశ్రీ, లలత్, కేదారా, భైరవ్, భైరవి, రాక్షస సాధన చేసి ఆ రాగాల మీద సంపూర్ణాధికారం సంపాదించినాడు. సాధనకు చాలా ప్రాధాన్యమిచ్చేవాడు ఉస్తాద్. తెల్లవారి లేస్తేనే "పహెలే నమాజ్ ఫిర్ రియాజ్" అనేవాడు. అంటే తొలుత నమాజ్, తరువాత రాగసాధన. ఏ సభలోనైనా అతనికి యమన్ కళ్యాణ్ ఇష్టమైన రాగం. ఆ రాగాన్ని అద్భుతంగా వాయించేవాడు. ఆ రాగం మంగళకరమయింది. అతడు వాయించింది మంగళవాద్యం. యమన్ కాక అతడు ఇంకా చాలా రాగాలు అద్భుతంగా వాయించేవాడు. సరస్వతీ విగ్రహం అతని ఇంటి ముందే ఉండెనాయె. బాబా విశ్వనాథ్ అతని వాద్యంలో అమృతరసం చిలికించినాడాయె. ఈ నమ్మకాలు అతనిలో దృఢమైన ఆత్మవిశ్వాసాన్ని కలిగించినాయి.

26 జనవరి 1950 మొదటి గణతంత్ర దినోత్సవం ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ కాఫీ రాగంలో వాయించిన ఖయాల్‌తో ప్రారంభమయింది. అతడు ఏ రాగం వాయించినా అద్భుతంగానే వాయించినాడు. అయినా తనకు 'సచ్చాసుర్' అంటే స్వచ్ఛమైన స్వరం దొరకలేదని ఆవేదన పడేవాడు. ఎంతటి అదృష్టవంతులకో ఒక్క సచ్చాసుర్ లభిస్తుంది. "అల్లాహ్! నాకు ఐహిక సంపదలేవీ వద్దు. ఒక్క సచ్చాసుర్ ప్రసాదించు" అని నిరంతరం ప్రార్థించేవాడు. సచ్చాసుర్ అంటే స్వచ్ఛమైన స్వరం.

అతడు హాస్యప్రియుడు, ఎప్పుడూ ఫర్నీచర్ లేని తన పాత హవేలీలోని తన గదిలో కూర్చుండి తనను చూడవచ్చిన వాళ్ళను సాదరంగా ఆహ్వానించి చాలా సంతోషంగా సంభాషణ జరిపేవాడు. చిలిపిగా నవ్వేవాడు. తన మాటలతో వాళ్ళను నవ్వించేవాడు. చిన్నాపెద్దా భేదం లేదతనికి. తన కీర్తిపట్ల భేషజం లేని సాదాసీదా మనిషి, సామాన్యుల మనిషి, బనారస్ ఇరుకు సందుల్లో అతడు ఉన్నంతకాలం సైకిల్ రిక్షాలెక్కి తిరిగేవాడు కానీ కార్లకోసం వెంపర్లాడే వాడు కాదు.

తనకంటే పెద్దవాళ్ళయినా, సమానులైనా గాయనీ గాయకులను గౌరవించేవాడు. అతని సమవయస్కురాలు కిరాణాఘరానాకు చెందిన గాయిక గంగూబాయి హంగల్. అతడెట్లా 90 యేండ్ల వరకు స్వరాలు స్వాధీనంలో పెట్టుకుని షహనాయి వాయించినాడో గంగూబాయి హంగల్ కూడా 90 యేండ్లు దాటినా పడుచునాడు పాడినట్లే పాడగలదు. ఇటీవల ఆమెతో కలిసి పాడే మధురగాయిక కృష్ణాహంగల్, అంటే ఆమె కూతురు, మరణించి నందువలన ఇప్పుడు గంగూబాయి హంగల్ కచేరీలలో పాడటం లేదు. గంగూబాయి హంగల్ లాంటి ప్రఖ్యాతగాయికలు, గాయకులు అతని అంత్యక్రియల్లో హాజరైనారు. చాలామంది సంతాప సందేశాలు పంపినారు.

సంగీత సభల్లో షహనాయి వాయించే హిందూ పండితులున్నారు. ముస్లిం ఉస్తాదులున్నారు. బనారస్‌లో ఉన్నారు. ఇతరత్రా ఉన్నారు. అయితే మొదట ఆలాప్ వినగానే భిస్మిల్లాఖానెవరో ఇతరులెవరో గుర్తించగలం. మనదేశంలో షహనాయి వాద్యం సాగుతూ ఉంటుంది. కానీ ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ లాగా వాయించే గంధర్వుడు దొరకడు.



4. గౌతమ బుద్ధుడు

భౌతిక సంపదతో పెత్తనం చెలాయించటం కంటె, ఆధ్యాత్మిక బోధనలతో హృదయాలను గెలవటం గొప్పది. ఉప్పెనలాపైకెగసి కుప్పకూలే నాగరికతకంటె, కారణాంతరాలచే కనుమరుగైనా పునర్జన్మ పొంది మరింత దేదీప్యమానంగా వెలిగే సంస్కృతి మిన్నయైనది. ఇట్టిగొప్పతనాలనెన్నింటితోనో ప్రపంచంలోనే తలమానికంగా వెలుగుతూ ఉంది భారతదేశం. జాతికి గర్వకారణులైన యుగపురుషులు, ఋషులు, సంఘసంస్కర్తలు, ఉత్తమబోధకులు, మహాకవులు, ఆదర్శమూర్తులు ఎందరో ఇక్కడ జన్మించారు. భిన్నత్వంలో ఏకత్వసాధనకు, మానవుని మాధవుడుగా మలచడానికి పరిశ్రమించారు. ఇట్టి గణనీయ మహితాత్ములల్లో బుద్ధుడొకడు.

జననం :

ఈయన తండ్రి శాక్యవంశీయుడు, కపిలవస్తుమహారాజు శుద్ధోదనుడు. తల్లి పట్టపురాణి మహామాయాదేవి. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు కలలో సుమేధ అనే ఒక పుణ్యపురుషుడు ప్రత్యక్షమైనాడు. తనకు ఇదే చివరిజన్మయని, తల్లిగా ఉండుమని కోరాడు. తెల్లవారగానే ఆమె విషయం భర్తకు చెప్పింది. ఆయన ఆస్థానపండితులను స్వప్నఫలితం చెప్పండని కోరాడు. రాజు త్వరలో తండ్రి కాబోతున్నట్లు, జన్మించబోయే మగబిడ్డ సంసారియైతే విశ్వసమ్రాట్టు అవుతాడని, సర్వసంగపరిత్యాగియైతే మానవుల దు:ఖాలను తొలగించే మహాత్ముడవుతాడని చెప్పారు.

రాణి గర్భం ధరించింది. నెలలు గడిచాయి. ప్రసవసమయం దగ్గర పడింది. పుట్టినింటికి వెళ్లాలన్న కోర్కెను వెల్లడించింది. సుఖప్రయాణానికి భర్త అన్ని ఏర్పాట్లు చేశాడు. ఆమె బయలుదేరింది. దారిమధ్యలో లుంబినీవనం. ప్రకృతి అత్యంత శోభాయమానంగా ఉంది. కాస్సేపు విశ్రాంతి తీసికోవాలని ఆగింది. అంతలో పురిటినొప్పులు ప్రారంభమైనాయి. సలక్షణమైన శిశువుకు జన్మనిచ్చింది. అది క్రీ.పూ. 563వ సంవత్సరం, వైశాఖపూర్ణిమ శుభదినం.

కానుపై ఏడుదినాలైనా కాలేదు. తల్లి తీవ్ర అస్వస్థతకు గురైంది. వైద్యుల చికిత్సలు ఫలించలేదు. కుమారుని ఉజ్జ్వలభవిష్యత్తును ఊహించుకుంటూ, ధైర్యాన్ని చిక్కబట్టుకొనింది. ఇకమీదట వీడికినీవే తల్లివి అని చెల్లెలు మహాప్రజాపతికి బిడ్డను అప్పగించింది. తృప్తిగా కన్నుమూసింది. ఏలోపం లేకుండ పినతల్లి పెంపకంలో శిశువు పెరిగాడు. ఈబిడ్డ వివిధ దశల్లో సిద్ధార్థగౌతముడుగా, సిద్ధార్థుడుగా, గౌతముడుగా, బోధిసత్త్వుడుగా, గౌతమబుద్ధుడుగా, బుద్ధుడుగా పిలువబడ్డాడు.

విద్యాభ్యాసం :

రాజుకు స్వప్నఫలితం చెప్పిన పండితులే ఆబాలుని ప్రథమ గురువులు. ఆ తర్వాత వ్యాకరణ శాస్త్రంలో, భాషాతత్త్వంలో, వేదోపనిషత్తుల బోధనలో దిట్టయైన సర్వమిత్ర దగ్గర శ్రద్ధగా విద్యాభ్యాసం చేశాడు. భరద్వాజుడనే మరొక దేశకుని దగ్గర ధ్యానం, యోగం శిక్షణ పొందాడు. క్షత్రియోచితమైన యుద్ధవిద్యాదుల్లో కూడ పారంగతుడైనాడు. దినదిన ప్రవర్ధమానుడై సిద్ధార్థుడు మహామేధావియైనాడు.

గౌతముడు మహాకుశాగ్ర బుద్ధి, కరుణామయుడు, ఏకాంతమంటే ఇష్టపడేవాడు. సాటి స్నేహితులకు యోగాసనాలు నేర్పువాడు. మనస్సును ఏవిధంగా కేంద్రీకరించాలో బోధించేవాడు. "నేను సుఖంగా ఉందునుగాక! నాతోటి వారందరు సుఖంగా ఉందురుగాక! సకల జీవజంతుజాలము సుఖంగా ఉండునుగాక" అనే ఆదర్శభావాలను తరచూ తాను పలుకుతూ, మిత్రులచే పలికించేవాడు.

అరకడుపుతో మండుటెండలో మాడిపోయే శ్రామికుల్ని చూచి జాలిపడేవాడు. పనిచేయని యజమానికి సిరి లభించటం న్యాయం కాదని ఆవేదన చెందేవాడు. వేటపేరిట మూగజంతువుల్ని, అమాయక పక్షుల్ని హింసించేవారిని అధిక్షేపించేవాడు. వాటి గాయాలకు వైద్యంచేసి, నీళ్ల త్రాపి లాలించేవాడు. క్రీడలపోటీల్లో అలసటచెందిన గుర్రాల శ్రమను పోగొట్టడానికి పైపంచెతో చెమటను తుడిచేవాడు. ప్రేమతో నిమిరేవాడు. రాజులమధ్య యుద్ధకాంక్షను నిరసించేవాడు. అంగీకృతమైన అవగాహనద్వారా సమస్యల్ని నివారించుకోవచ్చని, హితవు పలికేవాడు.

వివాహం :

యుక్తవయస్సురాగానే గౌతమునికి యశోధరతో పెళ్ళయింది. వారికి కొడుకుపుట్టాడు. రాహులుడని నామకరణం చేశాడు. రాహుల శబ్దానికి 'ప్రతిబంధకం' అని అర్థం. తనకు లౌకికమైన విషయాలపై విరక్తి ఉండిన కారణంగా, తనలోని తాత్త్విక ప్రగతికి సంతానం అడ్డు అనే దృష్టితో ఆపేరుపెట్టి ఉండవచ్చు.

శుద్ధోదనుడు, సిద్ధార్థుడిని యువరాజుగాచేసి సంతోషించాలని ఆలోచించేవాడు. అతని మనస్సు సంసారంపై విరక్తి చెందకుండేలా అన్ని జాగ్రత్తలు తీసికొనేవాడు. అంతటితో ఆగక తన మంత్రుల సలహాలమేరకు, గౌతముడు సుఖభోగాలపై పట్ల ఆకర్షింపబడే అన్ని ఏర్పాట్లుచేసేవాడు. కాని ఇవేవీ సిద్ధార్థునికి రుచించలేదు. సరికదా అంత:పురానికి బందీకాలేకపోయాడు.

ఒకమారు ఆకస్మికంగా, ఈడ్వలేక బరువైన బండిని లాగుతున్న బక్కచిక్కిన ఎద్దును చూచాడు. చనిపోయిన వృద్ధుడి శవం దగ్గర ఏడుస్తున్న బంధువుల్ని చూచాడు. పీనుగులా తయారై మూలుగుతున్న క్షయవ్యాధిగ్రస్తుడిని చూచాడు. ఈ బాధ లేమిటో, దు:ఖమెందుకో అర్థంకాక మానసిక క్షోభకు గురయ్యేవాడు. వీటికి పరిష్కారాలు అన్వేషిస్తూ అదే చింతనలో రేయింబవళ్ళు గడిపేవాడు. రాబోయే దినాలలో విశాల ప్రపంచమే ఆయనకు సరిహద్దు కావలసి ఉంది కాబోలు!

పరిణామదశ :

రోహిణీనది జలాల వినియోగంతో శాక్యులకు, సరిహద్దులోని కొలియనులకు చాలామార్లు తగాదాలు తలయెత్తేవి. యుద్ధంతో శాశ్వత పరిష్కారాన్ని తేల్చుకోవాలని శాక్యసేనాపతి ఆలోచించాడు. రక్తపాతం జరగటం ఇష్టంలేని గౌతముడు పెద్దల సంఘాన్ని ఏర్పాటుచేసి యుద్ధరహితమైన తీర్పు తీసికోవడం మంచిదన్నాడు. సేనాని తనపంతం నెగ్గించుకోవటానికి లోపాయికారిగా పెద్దల్ని తనకు మద్ధతు పలికేలా చేసికొన్నాడు. సిద్ధార్థుని అభిప్రాయాన్ని సంఘసభ్యులు బలపరచలేదు. యుద్ధానికే మొగ్గుచూపారు. ఈ తీర్పును గౌతముడు వ్యతిరేకించాడు. సంఘనిర్ణయాన్ని కాదన్నందుకు ప్రతిఫలంగా అప్పటి రాజ్యనిబంధనలమేరకు మరణశిక్ష లేదా దేశబహిష్కారం అమలుకావలసి ఉంది. ఈ తీర్పునకు తాను భయపడలేదు. తక్షణమే తాను రాజ్యం వదులుతున్నట్లు, పైపెచ్చు పరివ్రాజకుడుగా కూడ మారుతున్నట్లు ప్రకటించాడు.

తల్లిదండ్రుల్ని సమాధానపరచాడు. ధర్మపత్ని యశోధర భర్త నిర్ణయాన్ని కాదనలేక బాలుడైన రాహుళుని సంరక్షణకై ఇంటి దగ్గరే ఆగింది. చివరగా కుమారుణ్ణి ప్రేమార చూచాడు. శ్రీని, శ్రీమతిని, చిరంజీవిని, సామ్రాజ్యాన్ని విడిచి అరణ్యంలో అడుగుపెట్టాడు. భరద్వాజ ఆశ్రమం చేరాడు. వెంటవచ్చిన ప్రజావాహినికి కృతజ్ఞతాంజలి సమర్పించి వీడ్కోలు పలికాడు. కన్నీటి పర్యంతంగా దు:ఖిస్తున్న, బాల్యమిత్రుడు రణచోధకుడైన చెన్నుణ్ణి ఓదార్చాడు. దు:ఖప్రకటన చేస్తున్న కంధకాశ్వాన్ని జాలిగా చూచి మృదువుగా స్పృశించాడు. రాజచిహ్నాలను చెన్ననకు అప్పగించాడు. శిరోముండనం చేయించుకున్నాడు. కాషాయవస్త్రాలు కట్టాడు. భిక్షాపాత్ర చేతపట్టాడు. సన్యాసిగా, భిక్షువుగా, గంగాతీరం చేరాడు. అప్పటికి ఆయన వయస్సు 29 సంవత్సరాలు.

దేశాటనం :

కనుచూపుమేర దాటి మగధరాజ్యం చేరాడు. పాండవమెట్లు అనేచోట పర్ణశాల ఏర్పాటుచేసికొన్నాడు. తత్త్వవేత్తలకు, మేధస్సంపన్నులకు, నాయకాగ్రణులకు నిలయమైన మగధరాజధాని 'రాజగృహ' సందర్శించాడు. ఆదేశరాజు బిందుసారుడు శాక్యకుమారుని విషయం తెలిసికొని దగ్గరకు వచ్చాడు. సన్యాసం వదలుమన్నాడు, తన రాజ్యంలో సగభాగం అశచూపాడు. కాని సిద్ధార్థుడు సున్నితంగా తిరస్కరించాడు. తర్వాత కొంతకాలానికి తనదేశంలో మార్పులు చోటు చేసికొన్నట్లు, శాక్యసంఘం పెద్దలు తన మాటకు విలువనిచ్చి సామరస్యపూర్వకంగా నీటి సమస్యను పరిష్కరించుకొన్నట్లు, తనను తిరిగి దేశానికి రమ్మని వర్తమానం పంపారు. కాని గౌతముడు దీనికీ సిద్ధం కాలేదు.

మానవుల దు:ఖాలను నివారించాలనుకొన్నాడు. వారిలో రాగ ద్వేషాలు, భేదభావాలు లేకుండా చేయాలని తలంచాడు. సమాధిస్థితిలోనికి వెళ్ళగలిగే ధ్యానంవల్ల మాత్రమే పరిష్కారం సాధ్యమని భావించాడు. వివిధనియమాల మధ్య రకరకాల సాధనాలు చేసేవారిని, స్వర్గసుఖాలుకోరి శరీరాన్ని శుష్కింపచేసేవారిని చూచాడు. వారి ఆంతర్యం తనకు బోధపడలేదు. వింధ్యవైపు ప్రయాణంచేసి అలారకాముని ఆశ్రమం చేరాడు. ఆయన నుండి సాంఖ్యయోగ, వేదాంతబోధ, సమాధి శిక్షణ పొందాడు. శ్వాసను బంధించి ఏకాగ్రత సాధించే ప్రయత్నం చేశాడు. అది విపరీత శిరోభారాన్ని కలిగించి వికటించింది. అయినా నైరంజినీ నది ఒడ్డున నిర్జనప్రదేశంలో ఆరేండ్లు తీవ్ర సాధనలో ఉండినాడు. ఏ వెలుగూ కనబడలేదు. పడినశ్రమంతా ప్రయోజనం లేకుండా పోయింది.

ఫలించిన ధ్యానం :

చివరకు గయదగ్గర ఒక రావిచెట్టుక్రింద తూర్పుముఖంగా కఠోర ధ్యానానికి కూర్చున్నాడు. ఆయన ధ్యానాన్ని భంగం చేయటానికి దూకిన దుష్టశక్తుల ప్రయత్నాలేవి, తనపై ప్రభావం చూపలేకపోయాయి. ఒకానొక అశరీరవాణి "నిన్నొక్కడినే ఉద్ధరించుకో, లోకంతో నీకేంపని" అని స్వార్థం రేకెత్తించింది. దానికీ లొంగలేదు. ఎట్టకేలకు 49 దినాల తదేకదీక్షతో నాలుగుదశల్లో జ్ఞానోదయం పొందాడు. మొదట హేతువుతో పరిశోధన చేశాడు. రెండవమారు హేతువునకు ఏకాగ్రత బోధించాడు. మూడవదశలో సమాహిత చిత్తుడైనాడు. కడకు పవిత్రత ప్రశాంతత సాధించినాడు. స్వచ్ఛమైన అద్భుతమైన కాంతితో వెలిగిపోయాడు. ఇన్నాళ్ళుగా తనను వేధిస్తున్న లోకుల దుఃఖాలకు కారణాలు తెలిశాయి. ఆ దుఃఖనివారణమార్గాలు గోచరించాయి.

గౌతమునకు ఏ చెట్టు క్రింద జ్ఞానోదయమైందో ఆచెట్టుబోధివృక్షంగా పిలువబడింది. ఏ ప్రాంతంలో తనలో మార్పు వచ్చిందో అది బుద్ధగయ అయింది. ఇక్కడినుండి ఆయన బోధిసత్త్వుడుగా, బుద్ధుడుగా ప్రశస్తికెక్కాడు.

కార్యాచరణ:

బుద్ధుని జీవితం కరుణతో నిండింది. శాంతికి స్థావరమైంది. ధర్మాన్ని ఆశ్రయించింది. సంఘశ్రేయానికి కేంద్రమైంది. పాదసంచారిగా శాక్య, కురు, అంగ మొదలైన ఉత్తరదేశాలన్నీ సంచరించాడు. చెట్ల నీడలో విశ్రాంతి పొందేవాడు. రోజు ఒక్కపూటే ఆహారం తీసికొనేవాడు. ఆదనంగా ఒకజత వస్త్రాలతో సరిపెట్టుకునేవాడు. శిష్యుల్ని, ఆశ్రితుల్ని, ప్రజారంజకమైన ఆలోచనాత్మకమైన తన ప్రవచనాలతో బోధలతో ప్రభావితుల్నిచేశాడు. ఆ బోధలు విస్తృత ప్రచారాన్ని అందుకొన్నాయి. పలువుర్ని ఆలోచింపచేశాయి. మార్పుముఖంగా మళ్లించాయి.

అట్టివారిలో మహారాజు బిందుసారుడున్నాడు. ప్రసిద్ధవైద్యుడు జీవకుడున్నాడు. హింసాప్రవృత్తితో నిండిన అంగుళీమాలుడున్నాడు. తన కుంటుంబసభ్యులు, పటాచారవంటి సాధారణ గృహిణులు, ఆమ్రపాలివంటి స్వేచ్ఛాజీవనులైన స్త్రీలు చంపటానికి వచ్చిన బందిపోటులు ఉన్నారు. వివిధవృత్తులవారిని, భిన్నవర్గీయులను ఆయన మంత్రముగ్ధుల్నిచేశాడు. ఆయనలోని అనిర్వాచ్యమైన ఆకర్షణ అట్టిది. ఆయన బోధనలు అంతబలమైనవి.

బోధలు :

బుద్ధుడు తన ఆదర్శాలను బలవంతంగా ఎవరిపైనా రుద్దలేదు. "ఏవిషయమైనా సరే నీకు నీవుగా తెలిసికొని దర్శించి అనుభవపూర్వకంగా సత్యమనిపిస్తేనే అంగీకరించు" అని పదేపదే చెప్పేవాడు.

అసమాన త్యాగం, పరిశుద్ధజీవితం ఎంతటి కఠినాత్ములనైనా దుర్మార్గులనైనా మార్చగల అచంచల విశ్వాసం ఆయనది. హింస, ద్వేషం, కసి, కుత్సితాలకు బదులుగా అహింస, స్నేహం, సహకారం, నిజాయితీ ఆచరింపదగినవని బుద్ధుడు బోధించాడు.

లోకుల దు:ఖ నివృత్తికై ఆయన అష్టాంగమార్గాలు ఉపదేశించాడు. అవి: –

1. సమ్యక్ దృష్టి : పరిశీలనాత్మకంగా ఉన్నదున్నట్లు గ్రహించటం

2. సమ్యక్ సంకల్పం : నిష్కపటంగా క్రియాశీలమైన ఆలోచన చేయటం

3. సమ్యగ్వచనం : ప్రియమైన, ప్రేమపూర్వకమైన, ప్రశాంతమైన, సత్యవాక్కులనే పలకటం

4. సమ్యక్‌కర్మ : హానిలేని, దంబంచూపని, దొంగతనంకాని, మంచిపనులు చేయటం

5. సమ్యక్‌జీవనం : సమాజానికి ఉపయోగపడే పవిత్ర పవృత్తులతో జీవించటం

6. సమ్యక్‌యత్నం : సత్యప్రాప్తికి సాధనమైన, ధర్మతత్పరితతో కూడిన ఉద్యోగం చేయటం


7. సమ్యక్‌స్మృతి : వర్తమానానికి అవసరమైంది మాత్రం జ్ఞప్తిలో ఉంచుకొని నిత్యం జాగరూకతతో, సమయస్ఫూర్తితో లోభమోహాదులకు దూరంగా ఉండటం

8. సమ్యక్‌సమాధి : తర్కంలేని, విచారానికి దూరమైన చిత్తైరాగ్రతను ప్రీతిగా సుఖంగా అనుభవించటం. ఏవిషయమందైనా 'నేను – నాది' అనే భావం వదలి ధ్యాననిష్ఠలో ఉండటం.

జిజ్ఞాసువులతో విషయస్పష్టతకోసం ఆయన చర్చాగోష్ఠులు నిర్వహించాడు. అవి ప్రశ్నోత్తర పద్ధతిలో సాగినట్లు తెలుస్తున్నది. ప్రార్థన, మతం, యజ్ఞయాగాదులు, దానం, ధర్మం, దయ, నీతి, నిష్కామకర్మ, అహింస, ఆహారం, సమరం, శాంతి, సత్యం, మరణానంతర జీవితం మున్నగు అనేక జీవితకోణాలు చర్చింపబడ్డాయి.

గురుశిష్యులమధ్య గృహస్థులమధ్య, యజమాని సేవకుల మధ్య ఉండవలసిన విధానాలు తెలిపాడు. విద్యార్థులు చదువుకై తీరని దాహం కలిగి ఉండాలని, అధ్యాపకుల్ని సేవించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రేమ, శిక్షణ, కళాజ్ఞానం అందించాలని అన్నాడు. అన్నింటా స్పష్టత, సారళ్యత, ఆచరణాత్మకతగోచరిస్తుంది. "నేను ఏకాకినై శాంతి పొందటం కాదు, జనులందరికి విముక్తి కలిగించటం నా కర్తవ్యం" అని నిర్ణయించుకొన్నాడు. కాబట్టి ఆయన బోధనల్లో సూటిదనం, చిక్కదనం కనిపిస్తుంది.

ఒకమారు తన తండ్రి భిక్షకు రమ్మని సిద్ధార్థుని ఆహ్వానించాడు. బంగారం కుప్పలు, ధనరాసులు బుద్ధుని ముందు ఉంచాడు. జనకునకు కనువిప్పు కలిగేలా "అనర్థాలకు కారణమైన ఈ ధనాన్ని గంగలో పడవేయి. భోజనానికి పిలిచావు. పెడితే భిక్షపెట్టు లేకుంటే నన్ను వెళ్ళనివ్వు. అంతేగాని నన్నిలా బాధించకు" అన్నాడు. తనపై ఎనలేని ప్రేమచూపుతున్న నాన్నతో



"నాపైనున్న ప్రేమను సాటి మానవులపై చూపించు. అప్పుడు నాకన్నా ఉన్నతస్థానం పొందుతావు" అన్నాడు.

మంచి కోరేమనిషి 1.ప్రాణం తీయటం 2.దొంగతనం చేయటం 3. వ్యభిచరించటం 4. అసత్యమాడటం 5. మత్తుపానీయాలు సేవించటం – అనేవాటికి దూరంగా ఉండాలని హితవు పలికాడు. సద్ధర్మం ఆచరించడమంటే 1. మనసులోని మాలిన్యాన్ని కడిగివేయటం 2. విద్యను అందరికీ అందుబాటులోనికి తేవటం 3. ప్రజ్ఞతో కూడిన ధర్మాన్ని ఆచరించటం 4. ప్రజ్ఞ, శీలం అనేరెండింటిని కరుణతో కలిపి ఉంచటం 5.మనిషికి మనిషికి మధ్యగల అంతరాలను తొలగించటం 6.ప్రతిభయే మనిషికి విలువనిస్తుంది కాని పుట్టుక కాదని తెలిసికోవటం 7. జీవుల మధ్య సమత్వాన్ని పెంపొందించటం – అని బుద్ధుడు పేర్కొన్నాడు.

80 సంవత్సరాల వయస్సులో క్రీ.పూ. 483లో 'కుసినార' వనంలో సరిగ్గా వైశాఖ పూర్ణిమనాడే – అనగా తాను పుట్టినదినాననే – బుద్ధుడు మహానిర్యాణం చెందాడు. ఆ తర్వాత 400 సంవత్సరాలకు ఆయన మహత్తర సందేశాలు, ఉదాత్త జీవిత విశేషాలు ప్రపంచవ్యాప్తంగా భిన్నభాషల్లో భిన్న ప్రక్రియల్లో అనేక గ్రంథాలుగా వెలుగుచూశాయి. బౌద్ధశాఖలైన మహాయాన గ్రంథాలు సంస్కృతంలో, హీనయాన గ్రంథాలు పాళీభాషలో కనిపిస్తాయి. బుద్ధఘోషుని రచనలకే ప్రాముఖ్యం ఎక్కువ. ఇతని సమకాలీకులైన బుద్ధదత్తుడు, ఆనందుడు, ధర్మపాలుడు బౌద్ధగ్రంథాలకు వ్యాఖ్యలు వ్రాశారు. బుద్ధుని జీవితం బోధలు ప్రదీప్తంచేస్తూ అశ్వఘోషుడు, ధర్మానందకోశాబి, ఎడ్విన్‌ఆర్నాల్డ్, రాహూల్ సాంకృత్యావన్ మున్నగువారు రచనలు చేశారు. మన తెలుగువారిలో తిరపతి వేంకటకవులు, కరటూరు సత్యనారాయణ, జంధ్యాలపాపయ్యశాస్త్రి, గుంటి సుబ్రహ్మణ్యశర్మ, దాశరథి, జాషువా తదితరులు బౌద్ధగాథలకు కావ్యరూపమిచ్చారు.

ముగింపు :

ధర్మాచరణకు కేంద్రబిందువు మానవుడు. అతడు సంఘజీవి. కాని అతని జీవితం సమస్యాత్మకంగా, దు:ఖమయంగా ఉంటున్నది. కాబట్టి వ్యక్తికే కాక సంఘానికి కూడ శుభం చూకూరే విధంగా బుద్ధుడు తన బోధనల్ని విస్తరింపచేశాడు. బౌద్ధభిక్షువులను ఉద్దేశించి – మీరు గృహాన్ని వదలాలి కాని సంఘాన్ని కాదని స్పష్టం చేశాడు. నిండు మనస్సే నిజమైన జీవితానికి నిదర్శనం అన్నారు. జబ్బుపడినవారిని సేవిస్తే తనను సేవించినట్లేయని, ధర్మాన్ని దర్శిస్తే తనను దర్శించినట్లేయని శిష్యుల్ని హెచ్చరించాడు.

ఆయన సమకాలీనులు బుద్ధునిలో ఉత్తమసంస్కర్తను, నిజాయితీ గల నీతిమంతుని చూచారు. సమస్త సంస్కృతిలో శిక్షణపొందిన ధీశాలిని దర్శించారు. జీవించి ఉండగానే విముక్తి కలిగించే ఆచరణాత్మకమైన పూర్ణవిజ్ఞానం బహిర్గతం చేసిన ధైర్యశాలిని కనుగొన్నారు. ఆయన అనంతరం ఆశోకచక్రవర్తి, కనిష్కుడు, ఆచార్యనాగార్జునుడు, అంబేద్కర్ మొదలగువారు ఆయనబోధనలచే ఆకర్షింపబడి ఆమార్గంలో నడిచారు. అందరినీ బందీలు చేయగలిగిన ఆకర్షణ, తేజస్సు, గాంభీర్యం ఆయన వ్యక్తిత్వంలోనే కాదు బాహ్యసౌందర్యంలోనూ ఉంది. మహాపురుషుల లక్షణాలన్నీ ఆయనలో పరిపూర్ణంగా ఉన్నాయి. మనం ఆయన జీవితానుసరణంతో, ఆయన సమీపస్థితిని ఏకొంతైనా చేరుకోవడానికి ప్రయత్నంచేసి ధన్యులమవుదాం.

ఈ వ్యాసం రచనకు శ్రీ జె.రఘుపతిరావు రచించిన 'బుద్ధుడు' (1994 – తెలుగువిశ్వవిద్యాలయ ప్రచురణ) మరియు మిసిమి (హైదరాబాదు; సంఘమిత్ర (మంగళగిరి); రసరేఖ (నాగార్జునసాగర్) పత్రికలు ఉపయోగపడ్డాయి.

– డా॥ ఆశావాది ప్రకాశరావు,
అవధానాచార్య, కళారత్న,
పెనుకొండ – 515110



పదాలు - అర్థాలు

అ

అంతర్ధానం = అదృశ్యమవడం
అఘము = పాపము, వ్యసనము, దుఃఖము
అజ్ఞాతం = కనబడకుండా ఉండడం
అణా = రూపాయలో పదహారవ వంతు
అతిథి = తిథి, వార, నక్షత్రాలతో పని లేకుండా పిలవకనే వచ్చువాడు
అతీతం = కడచినది, అతిక్రాంతము
అధమపక్షం = చివరి
అనుపమ = పోలికలేనిది
అన్వేషణ = వెదకడం
అరము = విచారించు, వెదకు
అర్థి = వేడుకొనువాడు, వాది, కొలుపుకాడు, కోరిక
అలసత్వం = ఆలస్యము

ఆ

ఆకళింపు = అవగాహన, అవగాహనచేసికొను
ఆప్తుడు = స్నేహితుడు, క్షేమంకోరువాడు
ఆర్ద్రము = తడిసినది
ఆర్య = పదునాఱేండ్రప్రాయముగల ఆడుది, పార్వతి
ఆరూఢుడు = ఎక్కినవాడు
ఆలాపన = గొంతెత్తి పాడేటప్పుడు తీసే / చేసే రాగం

ఈ

ఈర్ష్య = ఓర్వలేనితనము, ఈరసము
ఈస్టరు = క్రైస్తవుల పర్వదినం

ఉ

ఉచితం = తగినది, ఉంచబడినది, ఎఱుగబడినది
ఉత్పలము = కలువ, చెంగల్వము
ఉద్దండ = ఎక్కువైన, పొడవైన
ఉద్ధరిణి = నీళ్ళెత్తి చేత బోసికొనెడు లోహపు సాధన విశేషము
ఉద్వాసన = తొలగించుట, వధించుట
ఉద్యోగం = యత్నము, కడక
ఉన్మాదం = చిత్తభ్రమము, చంపుట

ఋ

ఋజువు = చక్కనైనది, తిన్ననిది, నిష్కపటము

క

కడు = మిక్కిలి
కణము = నీటిబొట్టు, లేశము, గింజ, సూక్ష్మమైనది
కతలు = కథలు
కన్నియ = పెండ్లికాని పడుచు, కూతురు, ఆడుది, ఒకానొకరాశి
కరము = చేయి, కిరణము, తొండము, కప్పము, పడగల్లు
కళేబరం = శవం
క్రయపత్రం = అమ్మకం, కొనుగోలు సమయంలోని ఒప్పంద పత్రం
కుంభం = కుండ, ఏనుగుకుంభ స్థలం
క్లేశము = దుఃఖము, కోపము, వ్యవసాయం
కొంకు = భయపడు, వెనుదీయు, సంకోచించు
కౌశలం = నేర్పరితనం

గ

గళము = కుత్తుక, సజ్జరసం
గత్యంతరం = వేరుదారి

ఘ

ఘోష = గొల్లపల్లె, ఆవులమంద, ఉఱుము

చ

చాతుర్మాస్యదీక్ష = ప్రతిసంవత్సరం ఆషాఢశుద్ధం మొదలుకొని కార్తీకశుద్ధం వరకు చేసెడివ్రతం
చిడిముడి = తొందరపాటు, తొట్రుపాటు

చివ్వ = కలహము, సన్నని చిన్న నిడుపాటి కొమ్మ
చిరస్థాయి = బహుకాలము వరకూ
చెర్నాకోల = సోలకోల, ఎద్దులను తదితర జంతువులను అదిలించడానికి వాడే సాధనం
చోరులు = దొంగలు, తస్కరులు

జ

జడిమ = జడత్వము
జర = ముసలితనము, ముదిమి
జోదు = యుద్ధంచేయుబంటు, యోధుడు

ట

టంకారం = వింటినారి యొక్క ధ్వని, ఆశ్చర్యము, ప్రసిద్ధి

ఠ

ఠికాణా = ఆధారం

డ

డొంకిని = పంగిన కర్ర

త

తనఖా = తాకట్టు, దత్తపత్రం
తరుణి = యౌవనమున గల ఆడుది, ఆడుది
తారతమ్యాలు = ఎక్కువ, తక్కువలు
తావి = పరిమళం
తీవియ = తీవె, తీగె, తీగి
తృణము = గడ్డి, పైరు
తృష్ణ = ఇచ్ఛ, దప్పిక, కోరిక
తొలిప్రొద్దు = మొదటివెలుగు, ప్రాత:కాల సూర్యుడు

ద

దప్పళం = కాయగూరలు వేసి పలుచగా చేసిన వ్యంజన విశేషం, పులుపు
దర = వెల, క్రయము
దాట = తప్పించు, వదిలివేసి ముందుకు వెళ్ళు
దివాలా = వ్యవహారం చెడి కలుగు నష్టం
దిశ = దిక్కు
దురితము = పాపము, కలచు
దుర్విలాసం = చెడు కార్యాలు
ద్వంద్వయుద్ధం = ఒకరితో ఒకరు తలపడడం

ధ

ధరణి = భూమి, నేల
ధనుర్మాసం = సూర్యుడు ధనూరాశిలో తిరిగే మాసం

న

నిక్కము = నిశ్చయము, సత్యము, యదార్థము
నిరాహారి = నడ్డి పూర్వకాయము వెనుకకు వంగియుండుట
నిరుపము = ఉపమలేనిది, పోలికలేనిది
నుడుగు = నుడువు, చెప్పు

ప

పన్నము = జారినది, అధోగమనం
పరిణామము = క్షేమము, మార్పు
పరివారం = పరిజనము, సేన, కత్తియొఱ
పలుకుబడి = ఉచ్చారణము, వచోనిబంధము
పాలితులు = పాలింపబడేవారు
పిత్రీయము = తండ్రిది
పుష్కలము = అధికము, సమృద్ధము, శ్రేష్ఠము
పూత = పూచుట, వికసము
పూరి = గడ్డి, తృణము, మృగముల చనుబాలు
ప్రజ్వలనము = మండుట, ప్రకాశించుట
ప్రత్యుపకారం = తిరిగి చేసేమేలు
ప్రమదము = మిక్కిలి సంతోషము
ప్రవర = పేరు, కులము
ప్రాజ్ఞుడు = పండితుడు, సమర్థుడు
ప్రారబ్దం = శరీరము నెత్తించెడు కర్మ విశేషము (ప్రారంభింపబడినది)
ప్రాలు = బియ్యం

ఫ

ఫణి = పాము, సర్పము, భోగి

బ

బారసాల = నామకరణ ఉత్సవం
బుధులు = విద్వాంసులు, వేలుపులు
బృందగానం = అందరూ కలిసిపాడేపాట
బొంకు = అసత్యము, అసత్యావచనము

భ

భాగ్యం = అదృష్టము, సుకృతము
భావి = భవిష్యత్తు, కాగలది
భీతి = వెఱపు, నడకు
భూతము = గడచినకాలం, పిశాచాది గణాలు

మ

మకరంధము = పూదేనె
మందబుద్ధి = చొరవలేనివాడు, మూర్ఖుడు
మడి = చుట్టూగట్లున్న భూభాగం
మతి = జ్ఞానము, ఇచ్ఛ, తలపు
మహితము = శివుని శూలము, గొప్ప
మగడు = పురుషుడు, భర్త
మడులు = మడుగువస్త్రం, వరిపొలం
మధుపము = తుమ్మెద, తేనెతిండి
మధువు = నీరు, పాలు, తేనె, కల్లు
మాగాణం = వరిపంట పెట్టెడు నేల, మాగలి
మాతామహుడు = తల్లి, దండ్రి, తల్లివంశం వారు
మానము = త్రాసు, మూర, మానిక
మాన్యము = గౌరవము
మానెడు = సేరెడు, నాలుగుసోలలు, తూనిక విశేషము
మావి = మావిడి, మామిడి
మురిపెం = నడకయందలి కులుకు, గర్వం
మూఢులు = తెలివిలేనివారు

య

యోగము = అపూర్వవస్తుప్రాప్తి, ధ్యానము, కూడిక, ఉపాయము
యోధుడు = యుద్ధము చేయువాడు, బంటు
యోగ్యుడు = తగినవాడు

ర

రభసము = వేగము, సంతోషము
రాగము = అనురాగము, రంగు

ల

లోభం = పిసినితనం, ఆకాంక్ష

వ

వషట్కరము = నిష్కారాలు
వడి = వేగము, శౌర్యము, కాలము, దారముపిరి, పురిబిగువు
వర్ధిల్లు = వృద్ధిబొందు, పెరుగు
వధువు = ఆడుంది, పెంట్లేము, పెండ్లికూతురు, కోడలు
వాంఛ = కోరిక, కాంక్ష, ఇచ్ఛ
వాకిలి = గృహద్వారం
వాఙ్మయము = భాషాస్వరూపము, సాహిత్యము, సారస్వతం
వివేకం = దేహాత్మాది విభేద జ్ఞానం, విభేదము, విచారము
వృద్ధులు = ఎనభై ఏండ్లకు పై బడిన ముసలివారు
వానప్రస్థం = ఒక ఆశ్రమము, ఇప్ప, మోదుగు
వ్యామోహం = అత్యంత మోహము

శ

శ్రావ్యము = వినగదినది
శిథిలము = జీర్ణమైనది
శిరోవేదన = తలనొప్పి
శిబిరం = దండు విడిసినచోటు, వేలము
శుష్కము = వంటచెరకు, ఎండినది, కేవలము
శ్రుతి = వేదము, చెవి
శ్రేయస్సు = శ్రేయము, శుభము, ధర్మము, మోక్షము

స

సంపర్కము = కలయిక, చేరిక
సాంగము = పూర్ణము
సారస్వతము = సరస్వతీ సంబంధమైనది, సాహిత్యం
సిరి = లక్ష్మి, సంపద, శోభ
స్మృతి = తలపు, ధర్మశాస్త్రము, బుద్ధి
సుమము = కుసుమము, పూవు
సురుచిర = మనోహరమైన, రమణీయమైన
సేతువు = ఆనకట్ట
సౌమనస్యము = సుమనోభావము, తృప్తి, శ్రాద్ధము నందు పిండదానానంతరము బ్రాహ్మణహస్తమునందిచ్చెడు పుష్పము

హ

హితము = వెనుకటికి మేలు చేయునది, ధరింపబడినది, పోయినది
హృదయంగమం = మనసుకింపైనది
హస్తోదకాలు = చేతినుండి విడిచిన నీళ్ళు

క్ష

క్షము = ఓర్పు, నేల

నానార్థములు

కరము	=	హస్తము, కప్పము, తొండము, కిరణము
కులము	=	వంశము, వృత్తి, ఆధారంగా పిలువబడేది
గ్రహణము	=	గ్రహించుట, గ్రహణము పట్టిన భాగము
గుణము	=	స్వభావము, అల్లెతాడు
పర్వము	=	గుణువు, పండుగ, దర్భ, నిఘనదాది సమూహము, ప్రస్తావము, మహాభారత భాగము.
పక్షము	=	రెక్క, వైపు, పదిహేనురోజులు
పాదము	=	కాలు, పద్యపాదము, నాలుగవవంతు
మాన్యము	=	బహుమతిగా ఇచ్చేభూమి, గౌరవం
మిత్రుడు	=	స్నేహితుడు, సూర్యుడు
రాజు	=	పాలకుడు, చంద్రుడు
క్షమ	=	ఓర్పు, భూమి, గౌరి, సమర్థము, ఇష్టము, ప్రియము

పర్యాయపదాలు

అచలము	=	కొండ, పర్వతము, గిరి
అన్వేషణ	=	శోధన, వెదకుట, గాలింపు
కరము	=	చేయి, కిరణము, తొండము, కప్పము, వడగల్లు
కొడుకు	=	కుమారుడు, పుత్రుడు, తనూజుడు
క్రోధం	=	కోపం, రోషం, అలుక, కినుక
చివ్వ	=	కలహము, యుద్ధం, సంగరం
చీకటి	=	అంధకారము, ధ్వాన్తము, తిమిరము, తమస్సు, కాలిక, గహ్వారము, మబ్బు, ఇరులు, చీకువాలు
తరుణి	=	స్త్రీ, ఆడది, అతివ
తీవియ	=	తీవె, తీగె, లత
దిశ	=	దిక్కు, వైపు
దేహం	=	శరీరం, కాయం, మేను, తనువు
ధనము	=	అర్థము, ద్రవ్యము, విత్తము, స్వాపతేయము, రిక్థము, ధనము, ద్యామ్నము, వసువు, హరణ్యము, పైకము, విడిముడి, ద్రవిణము, విభవము, రుక్థము, రూక, రొక్కము, సొమ్ము
ధరణి	=	భూమి, ఇల, వసుధ
పంకజము	=	పద్మము, తామర, జలజం
పర్వతం	=	అద్రి, అచలం, జగత్తు, జగము
పల్లె	=	గ్రామము, ఊరు
పాన్పు	=	పడక, పఱుపు, మెత్త, సెజ్జ, శయ్య, శయనము, శయనీయము, తల్పము, సంస్తరము, స్రస్తరము
మాతృమూర్తి	=	జననీ, మాత, తల్లి
మిత్రుడు	=	స్నేహితుడు, సఖుడు, చెలికాడు
లక్ష్మి	=	సిరి, ఇందిర, రమ
యుద్ధం	=	సమరం, అని, సంగరం, రణం, కలహం, సంగ్రామం, జగడం, కయ్యం
వాంఛ	=	కోరిక, ఇచ్ఛ, ఈప్సితం, కాంక్ష, అభిలాష, మనోరథం
వాణి	=	భారతీ, సరస్వతీ, వాగ్దేవి
వానరం	=	కోతి, ప్లవంగం, మర్కటం
శత్రుత్వం	=	విరోధం, పగ
సేతువు	=	ఆనకట్ట, వారధి
స్నేహం	=	చెలిమి, మైత్రి, సఖ్యము

వ్యుత్పత్యర్థములు

అచలము	=	చలించనిది = పర్వతము, మేకు, బ్రహ్మము
అజాతశత్రువు	=	శత్రువులు లేనివాడు = ధర్మరాజు
అతిథి	=	తిథ్యాది కాలనియము లేకయింటికి భోజనమునకు వచ్చువాడు,
తోయధి	=	నీటికి నిలయమైనది – సముద్రము
పంకజాక్షుడు	=	పద్మముల వంటి కన్నులు కలవాడు = విష్ణువు
ఫణి	=	ఫణము (పడగ) కలది = పాము
భార్య	=	భరింపఁబడినది = పెండ్లాము
బ్రాహ్మణుడు	=	బ్రహ్మ (ముఖమునందు) కులమునఁబుట్టినవాఁడు
మహాత్ముడు	=	గొప్పదైన ఆత్మకలవాడు – గొప్పవాడు
మహీధరము	=	భూమిచే ధరింపబడునది – పర్వతము
ముని	=	మౌనంగా ఉండేవాడు = ఋషి
వాసుదేవుడు	=	వసుదేవుని కుమారుడు – శ్రీకృష్ణుడు
సుగ్రీవుడు	=	మంచి మెడగలవాడు (సుగ్రీవుడు)
హనుమంతుడు	=	దవడలు నొక్కబడినవాడు (ఆంజనేయుడు)

ప్రకృతి – వికృతి

ఆశ	–	ఆస
కథ	–	కత
కన్య	–	కన్నియ, కన్నె
కీర్తి	–	కీరితి
కుక్కుటం	–	కోడి
కోకిల	–	కోయిల
గౌరవం	–	గారవం
త్యాగం	–	చాగము
దిశ	–	దెస
దు:ఖం	–	దూకలి
పశువు	–	పసరము, పసుపు
పక్షి	–	పక్కి
రాత్రి	–	రాతిరి
సంతోషం	–	సంతసం
భిక్షం	–	బిచ్చం